www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 252
మంగళవారం | 18-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి ఉ.7:12 తదుపరి చతుర్దశి, నక్షత్రం: స్వాతి పూర్తి, వర్జ్యం: ఉ.11:18-మ.1:06, దుర్ముహూర్తం: ఉ.8:39-9:24, రా.9:48-10:38, అమృతఘడియలు: రా.10:05-11:53, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 5:35
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మూడు తరాలు అంతం

సౌదీ దుర్ఘటనలో బుగ్గిపాలైన హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం
ఇంటి పెద్ద నసీరుద్దీన్, ఆయన భార్య సహా 8 మంది పెద్దవాళ్లు..
ఆయనకు ఉన్న 10 మంది మనుమలు, మనుమరాళ్ల దుర్మరణం
ఇంటి వద్దే ఉండడంతో బతికిన తల్లి.. టికెట్ దొరక్క అమెరికాలో పెద్దకొడుకు



సౌదీ అరేబియాకు వెళ్లే ముందు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో నసీరుద్దీన్ కుటుంబం

సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం 45 మంది సజీవ దహనం

మృతుల్లో 44 మంది హైదరాబాదీలే.. వారిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది..

- మక్కా నుంచి మదీనా వెళ్తుండగా దుర్ఘటన.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు
- 46 మందిలో ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్కడు.. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఉమ్రా యాత్రకు 54 మంది
- బస్సు ఎక్కని 8 మంది హైదరాబాదీలు సురక్షితం.. వివరాలు వెల్లడించిన తెలంగాణ హజ్ కమిటీ
- సౌదీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన భారత ఎంబసీ.. డీఎన్ఏ పరీక్షలతోనే మృతుల గుర్తింపు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం.. మంత్రి అజారుద్దీన్ ఆధ్వర్యంలో సౌదీకి ప్రతినిధులు
- ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని పంపేలా ఏర్పాట్లు.. అక్కడే మృతులకు అంత్యక్రియలు

గల్ఫ్ ప్రతినిధి/హైదరాబాద్ సిటీ/న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉమ్రా యాత్ర కోసం హైదరాబాద్ నుంచి మక్కా వెళ్లిన 45 మంది యాత్రికులు సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగి, సజీవ దహనమయ్యారు. బస్సులో 46 మంది ఉండగా.. ఓ వ్యక్తి మాత్రం తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మక్కాలో ఉమ్రా చేసుకొని 440 కి.మీ. దూరంలోని మదీనాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యాత్రికులు గాఢ నిద్రలో ఉండగా.. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బస్సు, డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్రా యాత్రలో భాగంగా 54 మంది బృందం

మిగతా 14వ పేజీలో...



బాధిత కుటుంబానికి చెందిన ఓ వ్యక్తిని ఓదారుస్తున్న తెలంగాణ మంత్రి అజారుద్దీన్

అత్యంత దురదృష్టకరం

సౌదీ ప్రమాదంపై ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దిగ్భ్రాంతి

14

పెను విషాదం

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ సంతాపం

ఉక్కు సంకల్పం!

17 నెలలు.. రూ.15 వేల కోట్లు

విశాఖ ఉక్కుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయమిది

- దేశంలో మరే ప్రభుత్వ రంగ సంస్థకూ ఇవ్వనంతగా చేయూత
- 17 నెలల్లో ఉత్పత్తి సామర్థ్యం 48 నుంచి 80 శాతానికి పెంపు
- జగన్ హయాంలో ఫ్యాక్టరీ నష్టాల పాలవుతున్నా పట్టించుకోని వైనం
- పైగా భూముల అమ్మకానికి యత్నం
- కూటమి ప్రభుత్వం రాగానే.. ప్రైవేటీకరణ నిలిపివేతకు చర్యలు
- మోదీ ప్రభుత్వంతో సంప్రదింపులు
- కేంద్రం నుంచి 11,400 కోట్ల సాయం
- రూ.2,400 కోట్ల విద్యుత్ బకాయిలను ఈక్విటీలుగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం
- నిరంతరాయంగా కరెంటు, నీటి సరఫరా
- రాష్ట్ర ప్రాజెక్టులకు విశాఖ ఉక్కు నుంచే స్టీల్ ఉత్పత్తుల కొనుగోలు
- ఇంత చేస్తున్నా వైసీపీ విష ప్రచారం
- కార్మికుల జీవితాలతో చెలగాటం



విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తున్నారని ప్రతిపక్షాలు నానాయాగీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వాస్తవానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సాయంతో అదిప్పుడు ప్రగతి దిశగా పయనిస్తోంది. అటు కేంద్రంలోని మోదీ సర్కారు, ఇటు రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దానికి అండగా నిలుస్తున్నాయి. గత 17 నెలల్లో రెండూ కలిపి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం అందించడం గమనార్హం.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో ఆవిర్భవించిన విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్) నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. అది అధికారంలోకి వచ్చే నాటికి స్టీల్ ప్లాంట్ తీవ్ర నష్టాలతో ఆర్థిక సంక్షోభంలో ఉంది. దానిని ఆదుకునేందుకు 17 నెలల కాలంలో అనేక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి దేశంలో మరే ప్రభుత్వ రంగ సంస్థకూ ఇవ్వని స్థాయిలో రూ.వేల కోట్ల ఆర్థిక సాయాన్ని విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం సాధించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరమవుతుందన్న విపక్షాల ప్రచారాన్ని తప్పు అని రుజువు చేస్తూ.. దానిని పురోగతి దిశగా నడిపిస్తోంది. కర్మాగారాన్ని నష్టాల నుంచి గట్టెక్కించేందుకు కేంద్రం ఇప్పటికే రూ.11,440 కోట్లు ఇవ్వగా.. రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఆర్థిక సహకారం అందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేవలం 17 నెలల్లో

మిగతా 12వ పేజీలో...

ఏపీకి ఎలక్ట్రానిక్స్ యూనిట్లు

- ఈసీఎంఎస్ రెండో దశ కింద పెడతాం
- దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 17 యూనిట్లు
- కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడి

2



తిరుపతి రుయాలో వైద్య పరీక్షలు చేయించి చిన్న అప్పన్నను తీసుకెళ్తున్న పోలీసులు

చిన్న అప్పన్న పెద్ద ముదురు!

- వైవీ వద్ద నమ్మకంగా ఉంటూ చిన్నాచితకా పనులు
- వైసీపీ హయాంలో ఢిల్లీ కేంద్రంగా బడా దందాలు
- 'భోలేబాబా'తో చిన్నఅప్పన్న బేరాలు
- ఒప్పుకోనందునే నెయ్యి శాంపిల్స్ ల్యాబ్‌కు
- 'ప్రీమియర్' నుంచి హవాలా మార్గంలో 50 లక్షలు వసూలు.. అప్పన్నను లోతుగా విచారిస్తున్న సిట్
- బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన ఏసీబీ కోర్టు

తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్న అప్పన్న పెద్ద ముదురని కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. సోమవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకూ ఆయనను కస్టడీకి అప్పగిస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టు అనుమతించిన నేపథ్యంలో సిట్ అధికారులు నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి చిన్న అప్పన్నను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం తిరుపతి చేరుకుని రుయా ఆస్పత్రిలో

మిగతా 14వ పేజీలో...

న్యూ ఇయర్‌కు ఎక్కడుంటారో తేల్చుకోండి!

- ఆదేశాలు పాటిస్తారా? 'ధిక్కారం' ఎదుర్కొంటారా?
- 4 వారాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తేల్చండి
- తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక
- నిర్ణయం తీసుకోవడంలో అలసత్వంపై తీవ్ర అసహనం

14



2

రిజర్వేషన్లు 50% దాటొద్దు!

- మహారాష్ట్ర స్థానిక సంస్థల కేసులో సుప్రీం స్పష్టీకరణ
- బీసీ కమిషన్ ట్రిపుల్ టెస్ట్ పాటించిందా? అని ప్రశ్న

షేక్ హసీనాకు మరణశిక్ష

2

- బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ సంచలన తీర్పు
- మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె నేర చర్యలు
- విద్యార్థుల హత్యలకు ఆదేశాలు ఇచ్చారు
- మాజీ ప్రధానికి మరణశిక్షే తగిన దండన: ట్రైబ్యునల్
- 15 నెలలుగా భారత్‌లోనే షేక్ హసీనా
- తీర్పును గుర్తించడం లేదు
- 'హేగ్'లో విచారణ జరిపించాలని డిమాండ్





గర్భనిరోధక మాత్రల అమ్మకాల జోరు

- దేశంలో ఏటా 35 మిలియన్ యూనిట్ల అమ్మకాలు
- అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో భారత్
- పదేళ్లలో 12% మేరకు పెరిగిన విక్రయాలు
- ఎక్కువగా వాడటం ప్రమాదకరం అంటున్న వైద్యులు
- అదే సమయంలో కండోమ్‌ల అమ్మకాలు తగ్గుముఖం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యవసర గర్భనిరోధక మాత్రల (ఎమర్జెన్సీ కాంట్రాసెప్టివ్ పిల్స్- ఈసీపీ) అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఏటా 35 మిలియన్ యూనిట్ల (3.5 కోట్లు) కు పైగా అమ్ముడవుతున్నట్లు మోర్డర్ ఇంటెలిజెన్స్ ఇండస్ట్రీ నివేదికలో వెల్లడించింది. ఈసీపీల వినియోగంలో ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉన్నట్లు

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు

ఐబొమ్మ ద్వారా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం

- ఉచిత సినిమా ఎరతో 50 లక్షల మంది డేటా తస్కరణ
- రవి వందల కోట్లు క్రిప్టో కరెన్సీగా తరలించాడు: సజ్జనార్
- లక్షల మంది కష్టం దోచుకున్నారు: చిరంజీవి
- పైరసీ వల్ల పరిశ్రమకు తీవ్ర నష్టం: పవన్ కల్యాణ్
- ఉచితం వెనుక ప్రాణాంతక ముప్పు: రాజమౌళి
- ఐబొమ్మ బప్పం టీవీ వెబ్‌సైట్లు మూసివేత

13

దిగుబడి తగ్గి.. ధర లేక..

పత్తి రైతు చిత్తు

- నాణ్యత లోపించి దక్కని 'మద్దతు'
- మొంథా దెబ్బకు రాష్ట్రంలో దయనీయ స్థితి
- తేమ శాతం సాకుతో రేటు తగ్గింపు
- కేంద్రం నిబంధనలతో మరిన్ని పాట్లు
- కోస్తా జిల్లాల్లో నామమాత్రంగానే సీసీఐ కొనుగోళ్లు
- ఎమ్మెస్పీ రూ.7,710-8,110
- ఆదోని మార్కెట్లో రూ.7,300
- పెట్టుబడి రాకున్నా.. ప్రైవేట్ వ్యాపారులకే అమ్మకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఓ వైపు దిగుబడి తగ్గి, మరోవైపు మద్దతు ధర దక్కక, ఇంకోవైపు సీసీఐ నిబంధనలతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో క్వింటా మధ్యస్థ పింజ పత్తికి రూ.7,710, పొడవు పింజ పత్తికి రూ.8,110 కనీస మద్దతు ధరగా కేంద్రం ప్రకటించింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. దాదాపు 8లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కేంద్రప్రభుత్వ విధానం

మిగతా 3వ పేజీలో...



6 నగరాల్లో పేలుళ్లకు కుట్ర!

- నాలుగేళ్లుగా ప్రణాళికలు.. ఆయుధాలు, నిధుల సేకరణ
- ఢిల్లీ బాంబు పేలుడు దర్యాప్తులో వివరాల వెల్లడి

2

అల్ ఫలాహ్ వర్సిటీ చాన్స్‌లర్ తమ్ముడు హైదరాబాద్‌లో అరెస్టు

- ఆర్థిక అక్రమాల కేసులో హామూద్ సిద్దిఖీని అరెస్టు చేసిన మధ్యప్రదేశ్ పోలీసులు
- పాతికేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న హామూద్

2

అమెరికా నుంచి వంట గ్యాస్!

- ఏటా 10% చొప్పున కొనుగోలు
- ఒప్పందం చేసుకున్న భారత్
- ఎల్పీజీ వినియోగంలో ప్రపంచ దేశాల్లో రెండో స్థానంలో మనం

2

కోస్తాకు మరో తుఫాను ముప్పు?

22న అల్పపీడనం.. మరింత బలపడుతుందని అంచనా
రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

12

'బార్‌కోడ్' సమాచారం సరిపోలుతోందా?


- తెలుసుకునేందుకు నిపుణుల పేర్లు ఇవ్వండి
- గ్రూప్-1 పత్రాల మూల్యాంకనం పిటిషన్‌పై అభ్యర్థులకు, ఏపీపీఎస్సీకి హైకోర్టు స్పష్టీకరణ
- కేసులో నిందితులుగా ఉన్న అధికారులను విచారణకు దూరంగా ఉంచాలని ఆదేశం

11

గ్రామ, వార్డు సచివాలయాల్లో బదిలీలు

స్పౌజ్ విభాగంలోనే ట్రాన్స్‌ఫర్లు పరిమితం

13



మహిళా టెకీపై సైబర్ వల

- ఆరు నెలల్లో 32 కోట్లు కాజేసిన కేటుగాళ్లు
- కర్ణాటకలో బయటపడ్డ అతిపెద్ద సైబర్ క్రైం
- పార్సిల్‌లో డ్రగ్స్, పాస్‌పోర్టులంటూ బెదిరింపు
- డిజిటల్ అరెస్టు పేరిట వేధింపులు
- బయటపడాలంటే డబ్బు కట్టాలని డిమాండ్
- సీబీఐ పేరిట 57 ఏళ్ల మహిళకు బురిడీ

13

అల్ ఫలాహ్ వర్సిటీ చాన్సలర్ తమ్ముడు

హైదరాబాద్‌లో అరెస్టు

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ చాన్సలర్ జావేద్ సిద్దిఖీ సోదరుడు హమూద్ సిద్దిఖీని మధ్యప్రదేశ్ పోలీసులు హైదరాబాద్‌లో ఆదివారం అరెస్టు చేశారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారుబాంబు పేలుడు కేసులో ఈ యూనివర్సిటీ వైద్యులే కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని మౌ పట్టణానికి చెందిన హమూద్ సిద్దిఖీపై 2000 సంవత్సరంలో పలువురిని మోసం చేసినట్లు కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి అతడు పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతున్నారు. అతడి సమాచారం తెలిపినవారికి రూ.10 వేల బహుమతి ఇస్తామని 2019లో పోలీసులు ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ పేలుడు కేసులో జావేద్‌ను ప్రశ్నించగా హమూద్ తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. దీంతో నలుగురు సభ్యులతో కూడిన మధ్యప్రదేశ్ పోలీసు బృందం హైదరాబాద్ పోలీసుల సహకారంతో స్పెషల్ ఆపరేషన్ చేపట్టి హమూద్‌ను అరెస్టు చేశారు. అతడిని స్థానిక కోర్టులో హాజరుపర్చి ట్రాన్సిట్ వారెంట్‌పై మధ్యప్రదేశ్‌కు తరలించారు. హమూద్ సిద్దిఖీపై మౌలో అనేక కేసులు ఉన్నాయని మధ్యప్రదేశ్ పోలీస్ అధికారి యాంచెన్ దోల్కర్ భూటియా సోమవారం తెలిపారు. 1995లో హమూద్ సిద్దిఖీ మౌలో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ప్రారంభించి స్థానికుల నుంచి పెట్టుబడుల రూపంలో రూ.40 లక్షల వరకు వసూలు చేశాడని, డబ్బులు తిరిగి చెల్లించకుండానే మూడేళ్ల తర్వాత అక్కడి నుంచి కుటుంబంతో సహా పరారయ్యాడని చెప్పారు. ఈ అంశంలో హమూద్‌పై మూడు కేసులు నమోదు కాగా, 1988-89లో అల్లర్లకు సంబంధించి కూడా అతడిపై రెండు క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. హమూద్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా ఒక షేర్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నడుపుతున్నట్లు తెలిపారు.

డిసెంబరు 6న.. ఆరు నగరాల్లో పేలుళ్లకు కుట్ర!

» నాలుగేళ్లుగా ప్రణాళికలు.. దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 17: దేశవ్యాప్తంగా కనీసం ఆరు నగరాల్లో పేలుళ్లు జరిపి భయోత్పాతం సృష్టించాలని ఉగ్రవైద్యులు కుట్ర పన్నినట్లుగా తాజాగా వెల్లడైంది. అదుపులో ఉన్న ఉగ్ర డాక్టర్లను ప్రశ్నిస్తూ, వారి నుంచి స్వాధీనం చేసుకున్న డైరీలు, నోట్స్, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్న క్రమంలో దర్యాప్తు అధికారులు పలు కొత్త కోణాలను వెలికి తీస్తున్నారు. దీని ప్రకారం.. ఉగ్ర డాక్టర్లు తమ కుట్ర అమలు ప్రణాళికను నాలుగేళ్ల క్రితం 2021లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డబ్బులు, సురక్షిత స్థావరాల్ని సమకూర్చుకోవటం వంటి పనులు కొనసాగిస్తున్నారు. ఢిల్లీలో పేలుడు సంభవించిన కారును నడిపిన ఉమర్ నబీతో ఇదంతా ప్రారంభమైంది. 2020లో శ్రీనగర్‌లోని అతడి క్లినిక్‌కు ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ అనే వ్యక్తి తన కుమారుడిని చికిత్స కోసం తీసుకొచ్చాడు. నబీతో అతడికి పరిచయం పెరిగింది. దీన్ని అవకాశంగా తీసుకొని నబీకి ఇర్ఫాన్ ఉగ్రవాద సాహిత్యం పరిచయం చేశాడు. ఈ క్రమంలో ఉమర్‌నబీ ఉగ్రవాదంవైపు మరలాడు. హరియాణాలోని అల్‌ఫలా యూనివర్సిటీలో తనతోపాటు పని చేస్తున్న ఇతర వైద్యుల్ని కూడా ఈ దారిలోకి తీసుకొచ్చాడు. ఫరీదాబాద్‌కు చెందిన మహిళా డాక్టర్ షాహిన్ సయీద్ కూడా వీరితో కలిసింది. 2021లో వీరందరూ పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాదుల్ని జమ్మూకశ్మీర్‌లో కలుసుకున్నారు. 2022 మార్చిలో టర్కీకి వెళ్లి జైషే మహమ్మద్ విదేశీ కార్యకలాపాలు నిర్వహించే అబు ఉక్సాను కలిశారు. ఈ నేపథ్యంలోనే, భారత్‌లో డిసెంబరు 6వ తేదీన (బాబ్రీమసీదును కూల్చిన రోజు) కనీసం ఆరు నగరాల్లో పేలుళ్లు జరపాలన్న కుట్ర అమలు వేగవంతమైంది. ఉగ్రవైద్యుల ముఠాలో షహీన్‌ను 'మేడమ్ సర్జన్' అని పిల్చుకునేవారు. వీరు 2022 నుంచి హవాలా మార్గంలో రూ.20 లక్షల మొత్తం సేకరించినట్లు వెల్లడైంది.

'సర్' మా వల్ల కాదు.. పనులను బహిష్కరిస్తాం

» తమిళనాడు రెవెన్యూ సంఘాల సమాఖ్య ప్రకటన

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పనులు తమ వల్ల కావడం లేదని తమిళనాడు రెవెన్యూ సంఘాల సమాఖ్య ప్రకటించింది. ఎన్నికల సంఘం సరైన ప్రణాళికలు, తగు శిక్షణ, అదనపు సిబ్బందిని ఇవ్వకుండా, కనీస ఆర్థిక కేటాయింపులు కూడా లేకుండా తమపై పనిభారాన్ని మోపుతోందని, ఈ కారణంగా మంగళవారం నుంచి తాము సర్ పనులను బహిష్కరిస్తున్నామని ఆ సమాఖ్య వెల్లడించింది. ఈ మేరకు ఆ సమాఖ్య అధ్యక్షుడు మురుగయ్యన్ విలేకరులతో మాట్లాడారు. సర్ పనులను త్వరగా ముగించాలంటూ ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు అదే పనిగా తమపై ఒత్తిడి చేస్తున్నారని, వీటికి తోడు రోజూ రెవెన్యూ శాఖ పనులను కూడా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పనిభారానికి తగినట్టు తమకు ఎలాంటి ఆర్థిక కేటాయింపులు లేవని ఆరోపించారు.

షేక్ హసీనాకు మరణశిక్ష

బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ సంచలన తీర్పు



ఢాకా, నవంబరు 17 : బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో మాజీ ప్రధాని, ప్రస్తుతం భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న నాయకురాలు షేక్ హసీనాకు ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్(ఐసీటీ) మరణశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా హసీనా నేరాలకు పాల్పడ్డారని ఈ తీర్పు సందర్భంగా ట్రైబ్యునల్ ఆక్షేపించింది. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనలను హసీనా ప్రభుత్వం హింసాత్మకంగా అణచివేసినట్టు నమోదైన అభియోగాలపై దాదాపు నెలరోజులపాటు విచారణ జరిగింది. జస్టిస్ మొహమ్మద్ గొలామ్ మొర్తుజా మజుందార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ట్రైబ్యునల్ సోమవారం ఆమెను దోషిగా తేల్చింది. ఇవే అభియోగాలపై హోంశాఖ మాజీ మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, పోలీసు శాఖ మాజీ చీఫ్ చౌధురీ అబ్దుల్లా-అల్-మామున్‌లను కూడా దోషులుగా ప్రకటించింది. వీరిలో కమల్‌కు మరణశిక్షను; ట్రైబ్యునల్‌ను, దేశ ప్రజలను క్షమాపణలు కోరిన అబ్దుల్లాకు ఐదేళ్ల శిక్షను విధించింది. గత ఏడాది ఆందోళనకారుల హత్యలకు దేశవ్యాప్తంగా ఈ ముగ్గురు కలిసికట్టుగా నిర్ణయం తీసుకుని, అమలుచేశారని ట్రైబ్యునల్ తేల్చింది. అల్లర్లను ప్రేరేపించడం... ఆందోళనకారుల హత్యలకు ఆదేశాలు...విద్యార్థులపై హింసను ఆపడానికి చర్యలు తీసుకోకపోవడం వంటి మూడు కారణాల రీత్యా హసీనాను దోషిగా ప్రకటిస్తున్నామని, ఆమె నేరాలకు మరణశిక్ష తప్ప మరే దండనా సరిపోదని ట్రైబ్యునల్ వ్యాఖ్యానించింది. "విద్యార్థుల డిమాండ్లను, వారి ఉద్యమాన్ని నాటి హసీనా ప్రభుత్వం లక్ష్యపెట్టకపోగా, 'రజాకార్లు' అంటూ నిందార్థ పదాలను ఉపయోగించింది. ఆందోళనకారులు గుమిగూడిన స్థలాలను డ్రోన్ల ద్వారా గుర్తించి హెలికాప్టర్లు, ప్రాణాంతక ఆయుధాలతో దాడులు చేసి చంపివేయాలంటూ శాంతిభద్రతల విభాగాలను హసీనా ఆదేశించగా, ఆ ఆదేశాలను అప్పటి హోం మంత్రి కమల్, నాటి పోలీస్ చీఫ్ అబ్దుల్లా అమలుచేశారు. విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉండటం హసీనా,కమల్‌ల దోషిత్వాన్ని సూచిస్తోంది" అని ట్రైబ్యునల్ వ్యాఖ్యానించింది. ట్రైబ్యునల్ తీర్పు నేపథ్యంలో ఢాకాలో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోలీసులు, పౌరులపై ఎవరు దాడులు చేసినా కాల్చివేయాలంటూ ఢాకా మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

హసీనాను భారత్ అప్పగించాలి: బంగ్లాదేశ్

మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ భారత్ ప్రభుత్వాన్ని బంగ్లా సర్కారు కోరింది. నేరస్థుల పరస్పర అప్పగింత ఒప్పందం ప్రకారం తమ విజ్ఞప్తిని భారత్ పాటించి తీరాల్సిందేనని పేర్కొంది. ట్రైబ్యునల్ నిర్ణయాన్ని బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ అధినేత మొహమ్మద్ యూనస్ చరిత్రాత్మక తీర్పుగా అభివర్ణించారు.

మా వైఖరిలో మార్పు ఉండదు

బంగ్లాదేశీయులకు ఏది మంచి చేస్తుందో, దానికే కట్టుబడి ఉంటామని భారత్ పునరుద్ఘాటించింది. షేక్ హసీనాకు మరణశిక్ష ప్రకటించడం, ఆ తర్వాతి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఒక పొరుగుదేశంగా.. బంగ్లాలో శాంతి, ప్రజాస్వామ్యం నెలకొనాలని కోరుకుంటున్నామంది.

తీర్పును గుర్తించను: షేక్ హసీనా

ప్రజలు ఎన్నుకోని ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఉగ్రవాద శక్తుల్లో దాగిన అనాగరిక, హత్యాపూరిత ఉద్దేశాలను ఈ తీర్పు బయటపెట్టిందని హసీనా విమర్శించారు. నిష్పక్షపాత విచారణ జరగలేదని, తమ వాదనలు వినిపించడానికి ట్రైబ్యునల్ అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఆందోళనకారుల హత్యలకు తానుగానీ, ప్రభుత్వంలోని నాయకులుగానీ ఆదేశించలేదని పేర్కొన్నారు. తీర్పును తాను గుర్తించడం లేదన్నారు. సరైన న్యాయస్థానంలో విచారణ జరగాలని, హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణ జరిపించాలని యూనస్ ప్రభుత్వాన్ని తాను పదేపదే కోరినట్లు హసీనా తెలిపారు. కాగా, ఆమె పెళ్లి రోజునే(నవంబరు 17) ట్రైబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించడం విశేషం.

నాడూ భారత్‌లోనే ఆశ్రయం

1975లో తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌ను, తల్లిని, కుటుంబసభ్యులను హత్యచేసిన అర్ధరాత్రి సైనిక తిరుగుబాటు నుంచి హసీనా తప్పించుకున్నారు. ఆ మారణకాండలో మొత్తం 36 మందిని అదే నివాసంలో ఊచకోత కోశారు. ఆ ఘటన తర్వాత హసీనా తన భర్త, పిల్లలు, సోదరి రెహానాతో కలిసి భారత్‌కు చేరుకుని 1981 వరకు ప్రవాస జీవితం గడిపారు. ఆమె భారత్‌లో ఉండగానే ఆమె తండ్రి పార్టీ అయిన అవామీ లీగ్ కార్యకర్తలు హసీనాను తమ అధ్యక్షురాలిగా ఎన్నుకొన్నారు. ఇప్పుడు కూడా గత ఏడాది ఆగస్టు 4వ తేదీ నుంచి హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు

» ఆయుధాలున్నాయన్న టీఎంసీ ఎంపీ ఆరోపణతో గవర్నర్ ఆదేశం



న్యూఢిల్లీ, నవంబరు 17: బీజేపీ నేరస్తులు గవర్నర్ అధికారిక నివాసంలో ఆశ్రయం పొందుతున్నారని, లోపల ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా ఉందంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ గత శనివారం తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో సోమవారం పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు నిర్వహించారు. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ సారథ్యంలో కోల్‌కతా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు, బాంబు స్క్వాడ్స్, డాగ్ స్క్వాడ్‌లతో కూడిన బృందాలు సోమవారం రాజ్‌భవన్‌లో ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత గవర్నర్ ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ తనిఖీల్లో నిషేధిత వస్తువులేమీ దొరకలేదన్నారు. కల్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు దారుణమైనవేకాకుండా దురుద్దేశంతో కూడినవి, నిరాధారమైనవన్నారు. బెంగాల్‌లోని రాజకీయ నాయకులు క్రూరమైన ఆరోపణలు చేస్తుండటాన్ని తాను గమనించానని, బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని నిరూపితమైందని, ఆయనపై చాలా కఠినమైన చర్య తీసుకోనున్నట్టు గవర్నర్ బోస్ తెలిపారు.


ఎస్పీ నేత ఆజంఖాన్‌కు ఏడేళ్ల జైలు

» డబుల్ పాన్ కార్డు కేసులో ఆయన కుమారుడికి కూడా



రాంపూర్, నవంబరు 17: డబుల్ పాన్ కార్డు కేసులో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత ఆజంఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజంలను ప్రత్యేక ప్రజా ప్రతినిధుల కోర్టు దోషులుగా తేల్చింది. అబ్దుల్లా ఆజం అసలు పుట్టిన తేదీ 1993 జనవరి 1వ తేదీ కాగా, ఆయన 2017 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వయసు అడ్డంకిగా మారింది. దీంతో అప్పటికే ఉన్న పాన్ కార్డును పక్కనపెట్టి.. 1990 సెప్టెంబరు 30న జన్మించినట్లు తప్పుడు పత్రాలు చూపి మరో పాన్ కార్డు తీసుకున్నారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన గెలుపొందారు. దీనిపై బీజేపీ నేత ఆకాశ్ సక్సేనా 2019లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు పాన్ నంబర్ ఇచ్చారని.. ఆజంఖానే తన కొడుకును ఎలాగైనా ఎన్నికల్లో పోటీ చేయించేందుకు కుట్ర చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక 77 ఏళ్ల ఆజంఖాన్‌పై భూకబ్జా, అవినీతి, మోసం, మేకల దొంగతనం వంటి మొత్తం 84 కేసులున్నాయి.

లోకం తీరు



అమెరికా నుంచి

వంట గ్యాస్!

● ఏటా 10% చొప్పున కొనుగోలు

● ఒప్పందం చేసుకున్న భారత్

న్యూఢిల్లీ, నవంబరు 17: అమెరికా నుంచి వంట గ్యాస్(ఎల్పీజీ) దిగుమతి చేసుకునే ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండో దశ పాలనలో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ఇదేనని కేంద్రం ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం.. ఎల్పీజీ దిగుమతుల్లో ఏటా 10 శాతం అమెరికా నుంచి భారత్ తీసుకుంటుంది. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేసినట్టు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సోమవారం తెలిపారు. దీనిని చరిత్రాత్మక ఒప్పందంగా ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని గల్ఫ్ తీరం నుంచి 2026 సంవత్సరానికి 22 లక్షల టన్నుల ఎల్పీజీని చమురు కంపెనీలు దిగుమతి చేసుకుంటాయని తెలిపారు. ఇది భారత్ ఏటా దిగుమతి చేసుకునే ఎల్పీజీలో 10% ఉంటుందని తెలిపారు. అమెరికాతో ఎల్పీజీ కొనుగోలు ఒప్పందం చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి అని మంత్రి చెప్పారు. కాగా, "ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్)కు చెందిన అధికారుల బృందం పలుమార్లు అమెరికాలో పర్యటించింది. ఆ దేశంలోని పలు పెద్ద సంస్థలతో చర్చలు జరిపింది. ఇదొక చరిత్రాత్మక ఒప్పందం." అని మంత్రి పురి అన్నారు. ఎల్పీజీ వినియోగించే దేశాల్లో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది ఎల్పీజీ ధరలు 60% మేర పెరిగాయని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. దీని ప్రకారం ఒక్కొక్క సిలిండర్ ధర రూ.1,100లకు చేరిందన్నారు. అయినా ఆ భారాన్ని ప్రజలపై వేయడం లేదని, రూ.40 వేల కోట్లకు పైగా సొమ్మును ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు.

రిజర్వేషన్లు 50% దాటొద్దు!

» మహారాష్ట్ర స్థానిక సంస్థలపై సుప్రీంకోర్టు

» తదుపరి విచారణ 19వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, నవంబరు 17: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు యాభై శాతం దాటరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి గతంలో తాము ఇచ్చిన తీర్పును మహారాష్ట్ర అధికారులు తప్పుగా అన్వయించారని వ్యాఖ్యానించింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు సహా అన్ని రిజర్వేషన్లు యాభై శాతం దాటకుండా చూడాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బాంటియా కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీ రిజర్వేషన్లను పెంచి అమలు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దాన్ని అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించగా సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. ఓబీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి 'ట్రిపుల్ టెస్ట్' పేరుతో మూడు షరతులు విధించింది. 1) రాష్ట్ర ప్రభుత్వం ఇదే అంశం మీద డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలి. కమిషన్ ఓబీసీల వెనుకబాటుతనం మీద ప్రతీ స్థానిక సంస్థ స్థాయిలో విశ్వసనీయమైన డేటాను సేకరించాలి. 2) ఆ డేటా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ కోటాను నిర్ణయించాలి. 3) కోటాను నిర్ణయించే క్రమంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాన్ని అనుసరించి మహారాష్ట్ర ప్రభుత్వం బాంటియా కమిషన్ వేసింది. కమిషన్ సూచన మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసింది. దాన్ని అమలు చేసే క్రమంలో రిజర్వేషన్లు 50 శాతం దాటాయంటూ ఇతరులు వేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ రాజ్యాంగ పరిధిలోనే ఉన్నట్లు ఎలా చెప్పగలరని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు కదా? అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ జనరల్ తుషార్ మెహతాకు గుర్తు చేసింది. రేపట్నుంచే నామినేషన్లు మొదలవుతాయని తుషార్ మెహతా ప్రస్తావించారు. ఎన్నికల షెడ్యూల్‌పై తమకు అవగాహన ఉందని, దాని పేరుతో రాజ్యాంగ వ్యవస్థలను పలుచన చేయలేమని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ముందు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రాతిపదిక అయిన బాంటియా కమిషన్ నివేదికను తాము అధ్యయనం చేయాల్సి ఉందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని, అయితే, 50 శాతం సీలింగ్‌ను దాటితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గతంలో మహారాష్ట్ర అంతటా జనాభా విస్తరణ తీరును పట్టించుకోకుండా 27 శాతం రిజర్వేషన్లను ప్రకటించారని, దాన్ని తాము కొట్టేశామని గుర్తు చేశారు. బాంటియా నివేదికకు ముందు, తర్వాత ఓబీసీ రిజర్వేషన్ల మీద రాష్ట్ర ప్రభుత్వ విధానంలో మార్పును నివేదిక రూపంలో సమర్పిస్తామని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఏ మార్పులు చేసినా రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన 50 శాతం గీత దాటకుండా చూడాల్సిందేనని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. "ఎలాగైనా ఎన్నికలు జరిగేలా చూస్తాం కానీ రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఉల్లంఘించేందుకు అనుమతించం" అని చెప్పారు. బాంటియా కమిషన్ నివేదిక ట్రిపుల్ టెస్ట్‌కు లోబడి ఉందా? లేదా చూస్తామని ప్రకటించారు. ఇక్కడ ఓబీసీ రిజర్వేషన్లనే చర్చిస్తున్నప్పటికీ మొత్తం వర్టికల్ రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీల్లేదని జస్టిస్ బాగ్చీ తేల్చిచెప్పారు. శుక్రవారం(21వ తేదీ) వరకు విచారణను వాయిదా వేయాలని సొలిసిటర్ జనరల్ కోరారు. అప్పటికి నామినేషన్ల ప్రక్రియ పూర్తవుతుందని, దాన్ని వాయిదా వేస్తే విచారణను వాయిదా వేస్తామని జస్టిస్ సూర్యకాంత్ మెలిక పెట్టారు. ఈ మధ్యకాలంలో జరిగే ప్రక్రియ మొత్తం సుప్రీంకోర్టు తుది ఆదేశాలకు లోబడి ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. దాంతో విచారణను బుధవారం(19వ తేదీ) వరకు వాయిదా వేశారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయగా హైకోర్టు జీవోపై స్టే ఇచ్చింది. స్టే నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి.

రష్యాతో వ్యాపారం చేస్తే 500% టారిఫ్

బిల్లు ప్రవేశపెట్టిన ట్రంప్.. భారత్‌పై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, నవంబరు 17: రష్యాతో వ్యాపారాలు చేసే దేశాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించుకున్నారు. రష్యా నుంచి వస్తువులను దిగుమతి చేసుకునే భారత్ వంటి కొన్ని దేశాలపై ఇప్పటికే సుంకాలను 25% వరకు పెంచారు. దానికితోడు మరో 25% జరిమానా విధించారు. దాంతో అమెరికా విధించే టారిఫ్ 50 శాతానికి పెరిగింది. అది చాలదన్నట్టుగా టారిఫ్‌ను ఏకంగా 500 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం సెనేట్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. అది ఆమోదం పొందితే రష్యాతో వ్యాపారం చేసే అన్ని దేశాలపై సుంకాలు పెంచే చట్టబద్ధ అధికారం అమెరికాకు లభిస్తుంది. దీనిపై ఉదయం మీడియాతో మాట్లాడుతూ 'రష్యాతో వ్యాపారం చేసే దేశమేదైనా సరే చాలా భారీగా ఆంక్షలు మోపుతామ'ని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై దాడి చేసిన దగ్గర నుంచి గత మూడేళ్లుగా పలు రూపాల్లో రష్యాపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ ప్రస్తుతం ఆ దేశంతో వ్యాపారాలు చేసే దేశాలపైనా మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఆ దేశాలు అమెరికాకు చేసే ఎగుమతులపై అతి భారీగా పన్నులు పెంచాలని నిర్ణయించారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడాన్ని నిలిపివేయాలని ఇప్పటికే భారత్‌కు గట్టిగా చెప్పారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా కొనుగోళ్లను నిలిపివేసిందని గత నెలలో ఆయన ప్రకటించారు. మరోవైపు ద్వైపాక్షిక వాణిజ్యంపై భారత్-అమెరికాల మధ్య జరుగుతున్న చర్చలు కీలక దశకు చేరుకున్న సమయంలో ట్రంప్ తీసుకొస్తున్న తాజా బిల్లు తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ కారణంగా భారత్ కొన్ని అంశాల్లో తగ్గాల్సిన పరిస్థితి ఎదురయింది. ప్రస్తుతం విధిస్తున్న 50 శాతం టారిఫ్‌ల కారణంగా గత అయిదు నెలల్లో భారత్ నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులు 37 శాతం పడిపోయాయి. క్రిస్మస్ పండగ కోసం పెట్టే దుస్తుల ఆర్డర్లలోనూ తగ్గుదల కనిపించింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో చర్చలు ద్వారా తగిన సర్దుబాట్లు చేసుకొని బయటపడాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ఒక్క రష్యానే కాకుండా, ఇరాన్‌తోనూ వ్యాపారాలు చేసే దేశాలపైనా ఇదేవిధంగా భారీగా ఆంక్షలు విధిస్తామని ట్రంప్ స్వయంగా చెప్పడం గమనార్హం.

ఢిల్లీలో ఎవరికి వారే!

» ప్రధానిని ఒంటరిగా కలిసిన కర్ణాటక ముఖ్యమంత్రి

» ఖర్గేతో డీకే, సిద్ధూ వేర్వేరుగా సంప్రదింపులు

బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. సీఎం సిద్దరామయ్య సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకుని, సాయంత్రం ప్రధాని మోదీని కలిశారు. 40 నిమిషాలపాటు చర్చించారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్ 3రోజులుగా ఢిల్లీలోనే ఉన్నా, సీఎం ఒంటరిగానే ప్రధానిని కలవడం గమనార్హం. డీకే శివకుమార్ ఢిల్లీ నుంచి 3 గంటలకు బెంగళూరు బయల్దేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో రాత్రి సిద్దరామయ్య భేటీ అయ్యారు. ఢిల్లీలో మూడు రోజులు గడిపిన డీకే శివకుమార్, తన తమ్ముడు సురేశ్‌తో కలసి ఆదివారం ఖర్గేతో భేటీ అయ్యారు. కాగా, సీఎం సిద్దరామయ్య శనివారం మధ్యాహ్నం రాహుల్‌గాంధీని కలిసిన విషయం తెలిసిందే. అప్పటికే ఢిల్లీకి డీకే శివకుమార్ కూడా చేరుకున్నారు. అయినా రాహుల్‌గాంధీని, ఖర్గేని సీఎం ఒంటరిగానే కలిశారు. మొత్తంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మూడు రోజులుగా ఢిల్లీలో ఎవరికి వారే అన్నట్లు వ్యవహరించారు.

సీబీఐ దర్యాప్తుపై స్టే జనవరి 5 వరకు

» నష్టపరిహారం ఇప్పించాలంటూ సుప్రీంలో సవీంద్రరెడ్డి రిట్ పిటిషన్



న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు సవీంద్రరెడ్డి కేసులో సీబీఐ దర్యాప్తుపై విధించిన స్టేను సుప్రీంకోర్టు పొడిగించింది. ఆ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై గతంలో విధించిన స్టే జనవరి 5 వరకు కొనసాగుతుందని పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబరు 22న ప్రత్తిపాడు పోలీసులు చిన కొండ్రుపాడులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న బత్తుల దీవెనబాబును విచారించగా తాను కుంచాల సౌందరరెడ్డి అలియాస్ సవీంద్రరెడ్డి నుంచి గంజాయి కొనుగోలు చేశానని అంగీకరించాడు. అదేరోజు పోలీసులు సవీంద్రరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వాహనం నుంచి దాదాపు కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే తన భర్తను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని చెబుతూ సవీంద్రరెడ్డి భార్య కె.లక్ష్మీప్రసన్న సెప్టెంబరు23న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. సవీంద్రరెడ్డిని విడుదల చేయాలని ఆదేశిస్తూ.. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు సెప్టెంబరు 26 తీర్పు ఇచ్చింది. దీనిపై ఈ నెల 5న ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. హెబియస్ కార్పస్ పిటిషన్ పరిధి కేవలం నిర్బంధం చట్టబద్ధమో కాదో చూడడం వరకే పరిమితమని, అలాకాకుండా సీబీఐ విచారణకు ఆదేశించడం, దర్యాప్తును నిలిపివేయడం వంటి ఆదేశాలివ్వడంపై ఆయన తన పిటిషన్‌లో అభ్యంతరం తెలిపారు. ఇరుపక్షాల వాదనల తర్వాత.. హైకోర్టు ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. సీబీఐ దర్యాప్తు నిలిచిపోయిన నేపథ్యంలో ఈ నెల 13న సవీంద్రరెడ్డి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినందుకు రాష్ట్రప్రభుత్వం నుంచి తనకు నష్ట పరిహారం ఇప్పించాలని.. ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై సుమోటోగా విచారించాలని కోరారు. ఈ పిటిషన్‌ను గతంలో సవీంద్రరెడ్డికి సంబంధించిన కేసులతో కలిపి సోమవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రాష్ట్రప్రభుత్వంతో పాటు డీజీపీ, ఎస్పీ, ఎస్‌హెచ్‌వోలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 5వ తేదీకి వాయిదా వేసింది.

శబరిమలలో జై జగన్ నినాదాలు!

వైసీపీ నాయకుల పైత్యం



పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శబరిమలలో అయ్యప్ప ఆలయానికి వెళ్లే సమయంలో మాలధారులంతా స్వామిని ధ్యానిస్తూ లీనమై పోతారు. అయితే అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన వైసీపీ నాయకులు మాత్రం శబరిమల అయ్యప్ప స్వామిగుడికి కాలినడకన వెళుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ బ్యానర్‌ను ప్రదర్శించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. కేరళలో పంప నుంచి సన్నిధానానికి వెళుతూ జగన్ 2.0 అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడంతోపాటు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పైగా దీన్ని వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసుకుంటున్నారు.

రాష్ట్రానికి ఎలక్ట్రానిక్స్ యూనిట్లు

» ఈసీఎంఎస్ రెండో దశ కింద ఏర్పాటు చేస్తాం

» దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 17 యూనిట్ల స్థాపన

» రైల్వే, ఐటీ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీం(ఈసీఎంఎస్) కింద 2వ విడతలో రూ. 7,172 కోట్ల పెట్టుబడితో 17 ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్లను నెలకొల్పనున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ యూనిట్లలో రూ. 65,111 కోట్ల విలువైన ఉత్పత్తి జరుగుతుందని, ప్రత్యక్షంగా 11,808 ఉద్యోగాలు లభిస్తాయని రైల్వే, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో ఆ 17 యూనిట్లను నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, గోవా, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో ఈ యూనిట్లను స్థాపిస్తామన్నారు. కాగా, ఇటీవల ఈసీఎంఎస్ తొలిదశ కింద రూ. 5,532 కోట్ల విలువైన ఏడు యూనిట్లకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా నాయుడుపేటలో రూ. 765 కోట్లతో మల్టీ లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ)ల తయారీ యూనిట్‌ను సైర్మా స్ట్రాటెజిక్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నెలకొల్పనుంది.



శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు

రేపు పుట్టపర్తికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

» హిల్ వ్యూ స్టేడియంలో సభకు ఏర్పాట్లు

పుట్టపర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి బుధవారం రానున్నారు. పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో ప్రధాని సభ కోసం చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని బుధవారం ఉదయం ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయం నుంచి ప్రశాంతి నిలయం, హిల్‌వ్యూ స్టేడియం దాకా భారీ భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, పలు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పుట్టపర్తికి ఈ నెల 22న రానున్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

» ఏపీ ఎన్‌జీజీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

అనకాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్‌జీజీవోల సంఘం నిరంతరం పోరాటాలు సాగిస్తుందని, ప్రతి ఉద్యోగి సంక్షేమమే ప్రధాన లక్ష్యమని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర కమిటీ సభ్యులు అనకాపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి శంకరన్ భవన్ వరకూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం శంకరన్ భవన్‌లో జరిగిన సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏపీఎన్‌జీజీవోల అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేసేందుకు ప్రతి ఉద్యోగి కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఉద్యోగి సంఘంలో సభ్యత్వం తీసుకొని కలిసి సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఇప్పటికే సంఘం ఉద్యోగుల తరపున పోరాడి అనేక విజయాలు నమోదుచేసిందని వివరించారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను సులభతరం చేయాల్సిన అవసరం ఉందని... 60 రోజుల్లో ఈహెచ్‌ఎస్‌ను మార్పు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించి ఒప్పించామని తెలిపారు.

చిన్నశేషుడిపై పద్మావతి విహారం

» తిరుచానూరులో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
» పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయ శాఖ మంత్రి ఆనం

తిరుచానూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. ఉదయం 6 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందుకు సాగగా.. వెనకే అమ్మవారికి అభిముఖంగా గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. ఉదయం 9.30 గంటలకు గజ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేయడంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించాక, రాత్రి చిన్నశేష వాహనంపై అమ్మవారు విహరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.

కల్తీ నెయ్యి, పరకామణి కేసుల్లో బాధ్యులపై చర్యలు: ఆనం రామనారాయణరెడ్డి

'గత 18 నెలలుగా దేవదాయ శాఖకు తిరుమలకు సంబంధించి పరకామణి, కల్తీనెయ్యి సమస్యలు ఎదురయ్యాయి. ఈ రెండు కేసుల విషయంలో ఇప్పటికే దర్యాప్తు వేగంగా సాగుతోంది. విచారణ తర్వాత బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటాం' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుచానూరులో పద్మావతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించాక ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రెండు కేసుల్లో ఫిర్యాదుదారులకు భద్రత అవసరమనుకుంటే ఆయా శాఖలిచ్చే నివేదికల ప్రకారం భద్రత కల్పిస్తామన్నారు.



చిన్న శేష వాహనంపై విహరిస్తున్న పద్మావతి అమ్మవారు



ధ్వజస్తంభంపైకి గజ పటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

దిగుబడి తగ్గి.. ధర లేక..
పత్తి రైతు చిత్తు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం రాష్ట్రంలో 62 జిన్నింగ్ మిల్లుల్లో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా సీసీఐ నిర్ణయం తీసుకుంది. అందులోభాగంగా గత నెల 29న రాష్ట్రంలోని పత్తి పండించే జిల్లాల్లో 30 కొనుగోలు కేంద్రాలను సీసీఐ ప్రారంభించింది. కానీ, కోస్తాంధ్రలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే ఉన్నాయి. రాయలసీమలో మాత్రమే కొనుగోళ్లు.. అదీ అరకొరగానే జరుగుతున్నాయి. అదికూడా కర్నూలు జిల్లాలోనే క్రయవిక్రయాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 వేల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. కోస్తా ప్రాంతంలో మొంథా తుఫాన్ దెబ్బకు, అంతకుముందు భారీ వర్షాలకు పత్తి పంట చాలా వరకు దెబ్బతిన్నది. దీంతో కొంత నాణ్యమైన పత్తి వస్తున్న రాయలసీమపైనే సీసీఐ దృష్టి పెట్టింది. వర్షాలకు నాణ్యత తగ్గిందన్న ఉద్దేశంతో కోస్తా ప్రాంతంలో పత్తి కొనుగోలుపై సీసీఐ శ్రద్ధ పెట్టట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా పత్తి కొనుగోళ్లు జరిగే ఆదోని మార్కెట్‌లో కూడా పత్తి ధర రూ.7,600 నుంచి రూ.7,300కు పడిపోయింది. దీంతో మద్దతు ధర లభించక రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవంగా ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఓవైపు గులాబీ పురుగు దాడి, మరోవైపు భారీ వర్షాల దెబ్బకు ఐదారు క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి నెలకొంది. అధిక వర్షాలు కురిసిన చోట 3-4 క్వింటాళ్లు కూడా రావట్లేదని రైతులు చెప్తున్నారు. ఎకరాకు రూ.50వేల దాకా ఖర్చు పెట్టినా.. పెట్టుబడి కూడా రావట్లేదని వాపోతున్నారు. గుడ్డి పత్తిగా మారితే క్వింటా రూ.4 వేలకు కూడా కొనట్లేదని, కాస్త బాగున్న పత్తికి రూ.ఐదారు వేలు పలుకుతోందని కోస్తా ప్రాంత రైతులు చెప్తున్నారు. రాయలసీమలోనూ సీసీఐ కేంద్రాల్లో తేమ పరీక్షతో ధర తగ్గించడం, శ్లాట్ బుకింగ్ విధానంతో వేచి చూడాల్సి వస్తుండటంతో చాలా మంది రైతులు స్థానిక వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.6-7 వేలు కూడా చెల్లించడం లేదు.

తేమ పేరిట ధర తగ్గింపు..

పత్తిలో తేమ 8% మించకపోతే పూర్తి మద్దతు ధర చెల్లిస్తామని, అంత కంటే ఎక్కువగా 12% వరకు ఉంటే.. మద్దతు ధర తగ్గించి ఇస్తామని సీసీఐ ప్రకటించింది. 12% కన్నా అధికంగా తేమ ఉంటే.. కొనుగోలుకు పూర్తిగా తిరస్కరిస్తున్నారు. కోస్తా ప్రాంతంలో పత్తిని ఆరబెట్టి తీసుకురావాలని సీసీఐ అంటుండటంతో.. కొందరు రైతులు స్థానిక వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. పత్తి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ ఆధారిత ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల నుంచి సీఎం యాప్ ద్వారా డిజిటలైజ్డ్ విధానాన్ని అమలు చేస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం కొత్తగా కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, సీసీఐ కేంద్రాల్లో శ్లాట్ బుకింగ్ చేసుకోవాలని నిబంధన పెట్టింది. కాపాస్ కిసాన్ యాప్‌ను సీఎంయాప్‌తో అనుసంధానం చేసినా కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నమై రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర జౌళి శాఖ మంత్రికి ఇటీవల లేఖ రాశారు. కాపాస్ కిసాన్ యాప్ నుంచి సీఎం యాప్‌కు రైతుల వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యే లా చూడాలని, రైతులు సమీప జిన్నింగ్ మిల్లుల్లో పత్తి అమ్ముకునేలా మ్యాపింగ్ చేయాలని, ఎల్ 1, 2, 3 జిన్నింగ్ మిల్లులను ఒకే సారి ప్రారంభించాలని కోరారు. తుఫాన్, భారీ వర్షాలకు పత్తి పంట తడిసి, దెబ్బతిన్నందున 12 నుంచి 18% వరకు తేమ ఉన్న పత్తిని, రంగుమారిన పత్తిని కూడా తక్కువ ధరకు అయినా కొనాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా కేంద్ర జౌళిశాఖ మంత్రితో ఇదే అంశంపై మాట్లాడారు. దీంతో 12% వరకు తేమ ఉన్న పత్తిని ధర తగ్గించి కొంటామని సీసీఐ ప్రకటించింది. కానీ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు, రంగుమారిన పత్తి విషయంలో ఎలాంటి చర్యలూ అమల్లోకి రాలేదు. కాపాస్ కిసాన్ యాప్ నిర్వహణ కోసం గుంటూరు సీసీఐ కార్యాలయంలో ప్రత్యేకంగా సాంకేతిక సిబ్బందిని నియమించారని, త్వరలో సమస్యలు పరిష్కార మవుతాయని అధికారులు చెప్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సోషలిజమే అసలైన ప్రత్యామ్నాయం: సీపీఎం

కదిరి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సమానత్వం, సమ సమాజం.. సోషలిజం లక్ష్యాలని, దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో 'అక్టోబరు విప్లవం.. విశిష్టత' అనే అంశంపై సోమవారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీనియర్ నాయకుడు జి.ఓబులు తదితరులు హాజరయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, 1947లో సంభవించిన మహత్తర రష్యన్ విప్లవం ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోచుకునే సమాజం సోషలిస్టు వ్యవస్థకు బీజం వేసిందని తెలిపారు. పాత సామాజిక విప్లవాలు మానవాళిని ఒక దోపిడీ వ్యవస్థ నుంచి మరో దోపిడీ వ్యవస్థకు నడిపిస్తే.. అక్టోబరు సోషలిస్టు విప్లవం దోపిడీని పూర్తిగా నిర్మూలించిందని వివరించారు. నేడు భారతదేశంలో మోదీ పాలన అసమానతలను పెంచేలా ఉందని విమర్శించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రజలకు అందించడం లేదని, కార్మిక చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూల మార్గాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాంభూపాల్ ఆరోపించారు. అక్టోబరు విప్లవం స్ఫూర్తితో రానున్న కాలంలో అన్ని రంగాలలో అసమానతలను తొలగించే విధంగా పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

భూమిని వాడుకున్నా, లేకున్నా వార్షిక కౌలు చెల్లించాల్సిందే

» గన్నవరం విమానాశ్రయానికి భూములిచ్చిన రైతుల పిటిషన్‌పై హైకోర్టు



అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. భూములు తీసుకున్న తర్వాత వాటిని వినియోగించుకున్నా, లేకున్నా వార్షిక కౌలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన తమకు వార్షిక కౌలు చెల్లించేలా సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కృష్ణా జిల్లా, అజ్జంపూడి గ్రామానికి చెందిన మన్నం కృష్ణమూర్తి, మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది ఉమేశ్ చంద్ర వాదనలు వినిపించారు.

నేడు టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం

» వైకుంఠ ద్వార దర్శనాలపై నిర్ణయం

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం మంగళవారం జరుగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా వైకుంఠ ద్వార దర్శనాలపై నిర్ణయం తీసుకోనున్నారు. టోకెన్లు, టికెట్ల కేటాయింపు, భక్తులకు ఏర్పాట్లు, దర్శన సమయాల పెంపు అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. కాగా, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల మూడోరోజు జనవరి 1వ తేదీ కావడంతో దర్శనాల ఒత్తిడి తీవ్రంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ మూడ్రోజులకు సంబంధించిన టికెట్లు, టోకెన్లు ఆన్‌లైన్‌లో కేటాయించి మిగిలిన రోజుల్లో టోకెన్ రహిత(నేరుగా వచ్చి దర్శనం) దర్శనాలు నిర్వహించాలనే ఆలోచనలో టీటీడీ ఉన్నట్టు తెలుస్తోంది. ఏ పద్ధతిని అమలుచేయాలనే అంశంపై బోర్డులో చర్చించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

తిరుపతిలో వైద్య విద్యార్థిని అదృశ్యం

» కేసు నమోదు.. నెల్లూరు, విజయవాడకు ప్రత్యేక బృందాలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ సీఐ మురళీమోహన్ కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థిని తిరుపతిలో ఎంబీబీఎస్ చదువుతోంది. గతంలో విజయవాడలో నీట్ కోచింగ్ తీసుకున్న సమయంలో నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన సహ విద్యార్థితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అప్పట్నుంచి వీరి మధ్య స్నేహం కొనసాగుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆదివారం రాత్రి కళాశాల హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీనిపై సిబ్బంది ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆమె తండ్రి సోమవారం తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేశారు. కాగా, నీట్ కోచింగ్ సమయంలో ఆమెకు పరిచయమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. కాగా, మెడికో ఆచూకీ కోసం విజయవాడ, నెల్లూరుకు ప్రత్యేక బృందాలను పంపినట్టు సీఐ చెప్పారు.

ఏపీలో ఏఎం గ్రీన్ 54 వేల కోట్ల పెట్టుబడులు

» గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్, బయో రిఫైనరీ ప్రాజెక్టులు
» కాకినాడ, ఉత్తరాంధ్రలో ప్లాంట్‌లు ఏర్పాటు



సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకుంటున్న ఏఎం గ్రీన్ గ్రూప్ ప్రతినిధులు

విజయవాడ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్, బయో రిఫైనరీ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ఏఎం గ్రీన్ గ్రూప్ ముందుకొచ్చింది. రూ. 44 వేల కోట్లతో కాకినాడలో 1 ఎంటీపీఏ (మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం)తో గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్, ఉత్తరాంధ్రలో 180 కేటీపీఏ (వేల వార్షిక టన్నుల సామర్థ్యం) సుస్థిర ఏవియేషన్ ఫ్యూయల్ ప్లాంట్‌తో కూడిన 2జీ బయోరిఫైనరీని రూ. 10 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ మేరకు రూ. 54 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగినట్లు సోమవారం ఓ ప్రకటనలో ఆ సంస్థ వెల్లడించింది. 2 గిగావాట్ల ఆర్‌ఈ-ఆర్‌టీసీ (రీ-ట్రాన్షిషన్ కెపాసిటీ) ఎనర్జీతో నడిచే అల్యూమినియం ప్లాంట్‌ను కాకినాడలో, 30 వేల కంటే ఎక్కువ మందికి లబ్ధి చేకూరే బయో రిఫైనరీ ప్లాంట్‌లను శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమలేశ్ మృతి

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్ (60) అనారోగ్యంతో సోమవారం విజయవాడలో కన్నుమూశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తిరుమలేశ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏసీ మిషన్‌లో గంజాయి పొట్లాలు!

» బ్యాంకాక్ నుంచి అక్రమంగా తరలింపు
» కస్టమ్స్ తనిఖీల్లో వెలుగులోకి.. మహిళ అరెస్టు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి శ్రీలంక మీదుగా చెన్నైకి అక్రమంగా తరలించిన రూ.3 కోట్ల విలువైన నాణ్యమైన గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, ఓ మహిళను అరెస్టు చేశారు. టూరిస్టు వీసాపై ఇటీవల థాయ్‌లాండ్ వెళ్లిన ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 35 ఏళ్ల మహిళ.. శ్రీలంక మీదుగా ఆదివారం సాయంత్రం చెన్నై వచ్చారు. ఆమె ఓ ఏసీ మిషన్‌ను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. ఆమె వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉన్నట్టు గుర్తించిన చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు.. ఏసీ మిషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, గంజాయి పొట్లాలు బయల్పడ్డాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని నిర్ణయించడానికి అక్కడి ట్రిబ్యునల్‌కు నూటముప్ఫైరోజులు సరిపోయింది. నూటముప్ఫైఐదు పేజీల చార్జిషీటు చేతధరించి ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ ఆమె ఎన్నిదుర్మార్గాలకు పాల్పడిందో ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నవారిని కాల్చిపారేయ మని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతా బలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించారంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు బాధ పడ్డారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం, మన దేశం పొరుగుదేశాన్ని పొగుడుతూనే, అసలు విషయాన్ని నాన్చి వేయడం చూస్తూనే ఉన్నాం.

ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు అని హసీనా కుమారుడు గతంలోనే వ్యాఖ్యానించారు. ట్రిబ్యునల్ విధించబోయేది మరణశిక్ష అని కూడా అన్నారు. హసీనా సైతం తీర్పుకు ముందు ఓ సందేశాన్ని విడుదలచేస్తూ, తీర్పు ఎలా ఉన్నా బాధపడవద్దని తన అవామీలీగ్ కార్యకర్తలను కోరారు. ఆ మాట అంటూనే, తనకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్ ఇవ్వబోయే ఏకపక్ష, అప్రజా స్వామిక తీర్పును నిరసించమని కూడా ఆమె ఆదేశించినమేరకు బంగ్లాదేశ్‌లో ఎంత నియంత్రించినా హింస జరిగింది. సరిగ్గా యాభై యేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదా

బంగ్లాకు మరో ఆయుధం!

జియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజిబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. గద్దెనెక్కిన ఐదేళ్ళలో మళ్ళీ దిగవలసి వచ్చింది కానీ, ఆ తరువాత అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం ఎలాగో ఆమెకు తెలిసొచ్చింది. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటి ఇస్లామిక్ ఛాందస శక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండా డారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరుతెచ్చుకుంది. కానీ, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆమె అనుసరించిన అనైతిక విధానాల మీద విమర్శలు కాదనలేనివి.

తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే.

ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించుకున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటి వరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజిబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోత కోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం.

ట్రిబ్యునల్ తీర్పు వరకూ ఆగకుండానే, యూనిస్ ప్రభుత్వం ఎప్పుడో ఆమె పార్టీని నిషేధించి ఎన్నికల్లో పాల్గొనకుండా చేసింది. అధికార వ్యవస్థలన్నీ కలసికట్టుగా ఆమెను భౌతికంగా అంతం చేయడానికి ఇప్పుడు సిద్ధపడుతున్నాయి. దేవుడు ఇచ్చిన ప్రాణాన్ని ఆయన మాత్రమే తీసుకోగలడు, అప్పటివరకూ ప్రజలకోసం పనిచేస్తాను అని హసీనా తన కార్యకర్తలకు ధైర్యవచనాలు చెబుతున్నారు కానీ, యాభైయేళ్ళ తరువాత, మళ్ళీ మన దేశంలో తలదాచుకున్న ఆమె, తిరిగి బంగ్లాలో కాలూని యుద్ధం చేయగల అవకాశం లేనేలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగింత కోరిన యూనిస్ ప్రభుత్వానికి మన మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది అంతే.

ఎర్రకోట ఘటన దేశానికి ఓ హెచ్చరిక

ఈ నెల 10న ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతంలో జరిగిన భయంకరమైన పేలుడుతో మన దేశం సహా, ఉగ్రవాదుల చర్యలతో సతమతమవుతున్న అన్ని దేశాలూ ఉలిక్కిపడ్డాయి. కొందరి పాశవిక ఆలోచనలతో కూడిన ప్రవర్తన వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతాయి. ఈ ఘటనపై ప్రభుత్వం సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేయించి, దీన్ని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కు అప్పగించింది. పేలుడు ఘటనకు కారణమైన కారు ఉమర్–ఉన్–నబీ అనే డాక్టర్‌దని, ఆయన కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందినవాడని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఎర్రకోటను మరొక డాక్టర్ ముజమ్మిల్ గనై సందర్శించాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అయితే, ఘటనకు ముందే (అక్టోబర్ 30న) ఉగ్రవాద అనుమానితుడిగా పేర్కొంటూ ముజమ్మిల్‌ను కశ్మీర్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరి ఫొటోలు దర్యాప్తు సంస్థలకు చిక్కాయి. ఈ ఇద్దరు డాక్టర్లు పుల్వామాకు చెందినవారే. వీరు అల్–ఫలాహ్ యూనివర్సిటీ (హర్యానా)లో పనిచేస్తున్నారు. ముజమ్మిల్, అతని సోదరుడు కొన్నేళ్ల క్రితం టర్కీని సందర్శించినట్లుగా ఆధారాలు ఉన్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ టెర్రరిస్టు సంస్థతో వీరికి ఒక హ్యాండ్లర్ ద్వారా సంబంధాలు ఏర్పడ్డాయని తెలుస్తోంది.

వీళ్ళిద్దరూ అల్–ఫలాహ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నంత మాత్రాన మొత్తం యూనివర్సిటీ వారందరినీ అనుమానితుల జాబితాలో చేర్చడం తప్పు. ఉగ్రవాదుల ముఖ్యోద్దేశ్యం కూడా అదే. ఏదోవిధంగా మతోన్మాదాన్ని రెండు వర్గాల మధ్య రగిల్చి, ఆ వర్గాలను వీడదీసి, తమ పబ్బం గడుపుకుందామనే. అది సాగనీయకుండా చేయటమే ప్రభుత్వాలు, పాలకులు, ప్రతిపక్షాలు, ప్రజల కర్తవ్యం. రాజకీయాలు ప్రవే శించనంత వరకూ మతానికి సంబంధించిన గొడవలు అడపాదడపా జరుగుతాయి కానీ – మూకుమ్మడిగా చంపుకోవటాలూ, గృహ దహనాలూ, పెచ్చరిల్లిన వైషమ్యాలు... వంటివన్నీ కొంతమంది స్వలాభం కోసం రాజకీయాల్లోకి ప్రవేశం చడం వల్లనే ఇవి జరుగుతున్నాయి. సమాజంలో వర్గాలు ఏర్పడి నప్పుడే అణచటానికి వీలులేని విధంగా గొడవలు విస్తరిస్తాయి.



ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కౌంటర్ టెర్రరిజం చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. మన చట్టాలను పటిష్ఠరీతిలో అమలుచేయటంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలను బలోపేతం చేసి, ఉగ్రవాద చర్యలకు కేంద్రం చాలావరకు చెక్ పెట్టిన మాట వాస్తవం.

ఈ దాడి మరింత వికృత రూపం దాల్చకుండా ఉండడానికి ఒక ప్రధాన కారణం డా. జీవీ సందీప్ చక్రవర్తి. ఈయన 2014 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన సమయస్ఫూర్తితో అత్యంత చాక చక్యంగా వ్యవహరించారని కథ నాలు వస్తున్నాయి. కొంతమంది పోస్టర్లు మాత్రమే చూస్తారు. సందీప్ చక్రవర్తి లాంటి పోలీసు అధికారులు ఆ పోస్టర్ వెనకాల 'ప్లాన్' కూడా కనిపెడతారు. కశ్మీర్‌లోని నవ్‌గాంలో జైషే మహ్మద్ పోస్టర్లు చూసిన వెంటనే సందీప్ ఎంక్వైరీ చేయించారు. దాంతో 2,900 కిలోల ఐఈడీ, స్లీపర్ సెల్స్ –నెట్‌వర్క్, ఇండియా మొత్తాన్ని కబళించే ఎత్తుగడలు బయట పడ్డాయి. 'అది కేవలం పోస్టర్' అని సందీప్ తీసిపారేసినట్లయితే ఈపాటికి దేశమంతటా ఎన్నో పేలుళ్లు సంభవించేవి. ఈ ఆఫీసర్ ఇప్పటికే ఆరు గాలంట్రీ అవార్డులు పొందారు. సందీప్ తెలుగువాడు కావటం మనందరికీ గర్వకారణం.

పూర్తి విచారణ తర్వాతే మిగిలిన చాలా అంశాలు వెలుగులోకి వస్తాయి. పేలుడులో చనిపోయిన డాక్టర్‌కు దేశంలో చాలా మందితో లింకులు ఉన్నాయని, వీరంతా 'టెర్రర్ స్ట్రయిక్స్' చేయటానికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే అదృష్టవశాత్తూ ఈ కుట్ర భగ్నమైందని తెలుస్తోంది. అందుకే భారత ప్రభుత్వం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తదితర సంస్థలు ఘటనకు సంబంధించి లోతైన దర్యాప్తును చేపట్టాయి. వార్తా సంస్థలు, ప్రతిపక్షాలు కూడా ఆచితూచి వ్యవహరిస్తేనే నిజానిజాలు శీఘ్రగతిన బయటకు వస్తాయి. లేకపోతే 'నిప్పొకచోట, నీళ్ళు మరో చోట' అన్నరీతిలో అనేక అవరోధాలు కల్పించినవారవుతారు. వ్యవస్థీకృత నేరాలు తరచూ జరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న మాట నిజం. అమెరికాలోని అధికార ప్రతినిధి– ఈ సందర్భంగా 'భారత్‌లోని దర్యాప్తు సంస్థలు క్రమపద్ధతిలో దర్యాప్తు చేస్తుండటం గమనార్హం' అని మీడియాకు చెప్పటం ఒక విధంగా ఉగ్రవాదుల చర్యలను పరోక్షంగా ఖండించినట్లే. భారతదేశ విదేశాంగమంత్రి జైశంకర్‌తో ఆ దేశపు డిఫెన్స్ సెక్రెటరీ మాట్లాడి, వివరాలు తెలుసు కోవటం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఆసక్తిదాయకంగానే కనపడుతోంది.

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కౌంటర్ టెర్రరిజం చర్యలు ప్రత్యేకంగా సత్ఫలితాలు ఇస్తున్నాయి. నిజానికి ఉగ్రవాదుల చర్యలు అనేక దేశాలను వణికిస్తున్నాయి. మన చట్టాలను పటిష్ఠరీతిలో అమలుచేయటంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలను బలోపేతం చేసి, ఉగ్రవాద చర్యలకు కేంద్రం చాలావరకు చెక్ పెట్టిన మాట వాస్తవం. ఇలాంటి ఘటనలు జరగడానికి అవకాశం ఉన్న రాష్ట్రాలను ముందుగానే కేంద్రం హెచ్చరించి ముందు జాగ్రత్త చర్యలను తీసుకొనే విధంగా వాటిని సంసిద్ధపరచడం ద్వారా కూడా చాలావరకు సమస్యలు సమసిపోయాయి. సంసిద్ధంగా పోలీసు వ్యవస్థలూ, ఎన్ఐఏ లాంటి విభాగాల వల్ల ఎన్నో ఘటనలు ఆదిలోనే అంతమవుతున్నాయి. అయితే ఎర్రకోట పేలుడు లాంటి ఘటన దేశంలో ఎక్కడైనా జరిగితే... దేశంలో ఆందోళనలతో పాటు, విపక్ష నేతలు, మీడియా కూడా కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలనూ తప్పుబట్టడానికి అప్పుడప్పుడూ ప్రయత్నం చేస్తుంటాయి. అది సరికాదని అందరూ గమనించి, ప్రభుత్వాలకు తగు సహకారం అందిస్తేనే కౌంటర్ టెర్రరిజం చర్యలు ఫలవంతమవుతాయి. ఈ ఘటన అనంతరం దేశంలో నలుమూలలా అనేక అరెస్టులు జరిగాయి. ఆయుధాలతో పాటు, పేలుడు పదార్థాలనూ వెలికితీయటం వల్ల ఎలాంటి అనర్థాలూ జరగలేదు. అందుకే దేశరక్షణకు అప్రమత్తతతో పాటు అందరి సహకారం అవసరం.

● రావులపాటి సీతారాంరావు

చైనా చెప్పే 'డిజిటల్' పాఠాలు

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ నెలకొల్పనున్న నేపథ్యంలో సహజంగానే ఈ విషయంలో చైనా అనుభవం ప్రస్తావనకు వస్తుంది. డిజిటల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌లో అభివృద్ధి సాధిస్తేనే అమెరికాతో పోటీలో నిలువగలనని చైనా చాలా ముందుగానే గ్రహించింది. తమ ఆర్థిక వ్యవస్థను "మధ్య–ఆదాయ ఉచ్చు" (Middle income trap) నుంచి బయటపడేసి, యావత్ ప్రపంచానికి చౌక సరుకులను ఉత్పత్తిచేసే "ప్రపంచ కర్మాగారం" అనే పేరును పోగొట్టుకుని, అత్యున్నత సాంకేతికత, మేధో సంపత్తులను సృష్టించే సంపన్న దేశం స్థాయికి చేరవలసిన అవసరాన్ని చైనా గుర్తించింది.

మిగిలిన ప్రపంచం ఇటీవల ట్రంప్ విధించిన సుంకాలతోను, అమెరికా రక్షిత ఆర్థిక విధానాలతోను మేల్కొన్నదిగానీ, చైనా అంతకంటే ముందే అప్రమత్త మయ్యింది. అప్రతిహత సాంకేతికతతో ప్రపంచ దేశాలపైన అమెరికా చెలాయిస్తున్న ఆధిపత్యం గురించి 2013లో ఎడ్వర్డ్ స్నోడెన్ వెల్లడించిన విషయాలను చైనా గుర్తించి జాగ్రత్తపడింది.

2017లో అమెరికా ఎగుమతి చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన పరిష్కార ఒప్పందాన్ని పాటించడంలో ప్రముఖ చైనీస్ కంపెనీ ZTE విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా వాణిజ్యశాఖ ఈ కంపెనీపై ఆంక్షలు విధించింది. ఆ తరువాత ప్రపంచ నెట్‌వర్క్ పరికరాల తయారీదారులలో అతిపెద్దది, 5జీ సాంకేతికతలోను, సెల్‌ఫోన్ల తయారీలోను అగ్రగామిగా ఉన్న హువావేతో పాటు అనేక ఇతర చైనీస్ కంపెనీలు 'ఎంటిటీ లిస్ట్'లో ఉన్నాయని 2019మే నెలలో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. ఈ జాబితాలో ఉన్న కంపెనీలు అమెరికాలో పనిచేసే ఏ సంస్థతోనూ వ్యాపారం చేయలేవు. దీని ప్రకారమే హువావేకు అకస్మాత్తుగా గూగుల్, క్వాల్కామ్, ఇంటెల్ వంటి అమెరికన్ కంపెనీలతో సంబంధాలు తెగిపోయాయి. హువావే సెల్‌ఫోన్లకు ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించటం కూడా వీలు కాకుండా పోయింది.

ఇదంతా జరగడానికి చాలా ముందుగానే 2015లో 'మేడ్ ఇన్ చైనా–2025 ఇనిషియేటివ్' పేరుతో చైనా కొన్ని లక్ష్యాలను ప్రకటించింది. వీటిలో ముఖ్యమైనవి– తదుపరి తరం ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) అభివృద్ధిలో సెమీ కండక్టర్ల తయారీ; 5జీ అభివృద్ధి; ఏఐలో అగ్రగాముల జాబితాలో చేరటం... మొదలైనవి. 2025 నాటికి 70శాతం స్వయం సమృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాల దిశగా ప్రయివేటు రంగాన్ని, విశ్వవిద్యాలయా లను, పరిశోధనాశాలలను సమన్వయం చేసే పక్కా ప్రణాళికను, దాని అమలు వ్యూహాన్ని చైనా రూపొందించింది. ముందుగా వందల బిలియన్ డాలర్ల విలువైన నిధులను సిద్ధం చేసింది. ఈ నిధులతో దేశీయ ప్రయివేటు కంపెనీలకు సబ్సిడీలు, ఈక్విటీ పెట్టుబడులు, తక్కువ వడ్డీ రుణాలు, పన్ను మినహాయింపులు, భూముల కేటాయింపులు జరిగేలా చూసింది. ఈ కంపెనీలు అభివృద్ధి చేసే సాంకేతికలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండేలా చూడడానికి 'చైనా స్టాండర్డ్స్–2035' ప్రణాళికను ప్రకటించింది.

విదేశీ కంపెనీలపై ఆధారపడటానికి బదులు దేశీయ ప్రయివేటు కంపెనీలను దిగ్గజాలుగా మార్చేందుకు ప్రయత్నించటం వల్ల చైనాలో పారిశ్రామిక అనుకూల వాతావరణం ఏర్పడింది. టెలీ కమ్యూనికేషన్ పరికరాలలో హువావే, ZTE; సెమీకండక్టర్ తయారీలో SMIC, NAND; ఫ్లాష్ మెమొరీలో యాంగ్జీ మెమొరీ టెక్నాలజీస్; డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డిజిటల్ సేవలలో బైడు, అలీబాబా, టెన్సెంట్ (BAT) వంటి ప్రయివేటు రంగ కంపెనీలు తమతమ క్షేత్రాలలో ప్రపంచ స్థాయి సాంకేతికతలను సాధించటానికి ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం ఒక సురక్షిత దేశీయ మార్కెట్‌ను సృష్టించింది. ఇక్కడ ఈ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా పోటీపడటానికి ముందు తగినంతగా వృద్ధి చెందుతాయి, ఆవిష్కరణలు చేస్తాయి.

మరోవైపు తమ కంపెనీలు మేధో సంపత్తిని సముపార్జించటం పైన కూడా చైనా దృష్టిపెట్టింది. విదేశీ కంపెనీలు విస్తారమైన చైనీస్ మార్కెట్‌ను ఉపయోగించుకోవడానికి ఒక షరతుగా వారు చైనీస్ భాగస్వాములతో జాయింట్ వెంచర్‌లను ఏర్పరచు కోవాలి, మేధో సంపత్తిని బదిలీ చేయాలి. అలాగే సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ విద్యపైన భారీగా చేస్తున్న వ్యయం వల్ల ఏటా ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్‌లను చైనా ఉత్పత్తి చేస్తున్నది. సాంకేతి కతలో అభివృద్ధి చెందిన దేశాలతో అంతరాలను వేగంగా తగ్గించటానికి విభిన్న సాంకేతికలపై పట్టున్న అనేక ఐరోపా, ఇజ్రాయెలీ కంపెనీలను చైనీస్ కంపెనీలు కొనుగోలు చేశాయి. ఇలా కొనుగోలు చేసిన సాంకేతికలను, బైడు, హువావే వంటి దేశీయ కంపెనీలు అభివృద్ధి చేసిన వాణిజ్య ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికలను చైనా తన రక్షణ పరిశ్రమలలో వినియోగిస్తుంది. పరిశోధన, నిధులు, ప్రతిభను సైనిక, పౌర రంగాలు పరస్పరం పంచుకుంటాయి. అలా రెండింటిలోనూ ఆవిష్కరణలను వేగవంతం చేస్తారు. అంతేకాకుండా చైనా నిర్మించిన బలమైన ఇంటర్నెట్ వ్యవస్థలో గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్‌లకు ప్రత్యామ్నాయంగా బైడు, విచాట్, అలీ బాబా ఆవిర్భవించాయి. ఈ దేశీయ కంపెనీలు అంతర్జాతీయ కంపెనీలుగా ఎదగడానికి, స్వదేశంలో ఆధిపత్యం చెలాయించడానికి కావలసిన రక్షణలతో పాటు నిధులను అందించి ప్రభుత్వమే వాటికి మార్గాన్ని సుగమం చేసింది. అంతేగాక కోట్లాది విని యోగదారులకు సేవలందించడం ద్వారా ఇ–కామర్స్, మొబైల్ చెల్లింపులు, ఏఐ అప్లికేషన్‌లకు అసమానమైన పరీక్షా క్షేత్రాన్ని చైనా ప్రభుత్వం అందించటంతో అభివృద్ధి వేగవంతమైంది.



> డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో చైనా అమెరికాతో సమవుజ్జీగా మారటం 21వ శతాబ్దంలో కీలకమైన పరిణామం. ఇది సాంకేతికత పరంగా ప్రపంచం బహుళ ధ్రువంగా మారడాన్ని సూచిస్తుంది. అమెరికా, చైనాల మధ్య కొనసాగుతున్న ఈ డిజిటల్ పోటీ రాబోయే దశాబ్దాలలో భారత్ వంటి వర్ధమాన దేశాలకు అనుకూలంగా మారుతుంది.

వర్తమానంలో యావత్ మానవాళి జీవన విధానాన్ని విప్లవాత్మకంగా మార్చగలిగే ఏఐ పైన, క్వాంటం కంప్యూటింగ్ పైన చైనా తన దృష్టిని కేంద్రీకరించి అమెరికాతో పోటీపడుతున్నది. ఒక దేశ కృత్రిమ మేధ (ఏఐ) నాణ్యత, క్వాంటం కంప్యూటర్‌ల అభివృద్ధి నేరుగా దాని డేటా, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలతో ముడిపడి ఉంటుంది. చైనా డేటా సెంటర్ల సామర్థ్యం ప్రపంచ డేటా సెంటర్ల వృద్ధి రేటుతో పోలిస్తే అత్యంత వేగంగా పెరుగుతోంది. చైనా డేటా సెంటర్ల ప్రస్తుత సామర్థ్యం 35 గిగావాట్లు (35వేల మెగావాట్లు). చైనా డేటా సెంటర్లు కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి అధునాతన సాంకేతి కతల ఏకీకరణపై దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి.

చైనాలో ప్రయివేటు, పబ్లిక్ భాగస్వామ్య వ్యవస్థ (పీపీపీ) చాలా విస్తృతమైనది. ప్రభుత్వం ఎదుర్కొం టున్న ఆర్థిక సమస్యలు, అప్పుల ఒత్తిళ్లకు ప్రతిస్పంద నగా చైనా మౌలిక సదుపాయాల పెట్టుబడిలో పీపీపీలు అనుబంధ పాత్రను పోషిస్తున్నాయి. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగ పెట్టుబడు లను ఆకర్షించడానికి చర్యలు తీసుకుంది. చైనాలో పీపీపీలు 2022కల్లా 16.5 ట్రిలియన్ ఆర్ఎమ్‌బి (దాదాపు 204 ట్రిలియన్ రూపాయలు. 1 ట్రిలియన్ అంటే 1 లక్ష కోట్లు) పెట్టుబడులతో 10వేల ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి.

చైనాలోని ప్రయివేటురంగం అంతర్జాతీయ స్థాయికి రావటానికి చైనా ప్రభుత్వ విధానాలు చాలావరకు కారణం. చైనా తన ప్రయివేటురంగ కంపెనీలను పెట్టుబడిదారీ దేశాలు కూడా ఊహించలేని స్థాయిలో ప్రోత్సహిస్తున్నది. ఉదాహరణకు 5జీఈ సాంకేతికతలో ప్రపంచంలో అగ్రస్థాయిలో ఉన్న హువాయే కంపెనీ అమెరికా ఆంక్షలతో కుదేలయిన స్థితిలోవుండగా, చైనా ప్రభుత్వం 75 బిలియన్ డాలర్ల (రూ. 6.5లక్షల కోట్లు) విలువైన ఆర్థిక సహాయం చేసింది. దీనిలో పన్నురాయితీలే 25 బిలియన్ డాలర్లు (రూ. 2 లక్షల 20వేల కోట్లు). ఇలా ఒక ప్రయివేటు కంపెనీని నిలబెట్టటం ఏ పెట్టుబడిదారీ దేశంలోనూ సాధ్య పడదేమో.

డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో చైనా అమెరికాతో సమవుజ్జీగా మారటం 21వ శతాబ్దంలో కీలకమైన పరిణామం. ఇది సాంకేతికతలో ఏక ధ్రువంగా వున్న ప్రపంచం బహుళ ధ్రువంగా మారడాన్ని సూచిస్తుంది. దీనితో గూగుల్, అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి అమెరికా బహుళజాతి కంపెనీలకు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలోనే కాకుండా, అభివృద్ధి చెందిన వాటిలో కూడా అలీబాబా, టెన్సెంట్, హువావే క్లౌడ్ వంటి చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతుంది. చైనాలో ఇక ఏ మాత్రం ప్రాసంగికత లేని పశ్చిమ దేశాల కంపెనీలు ఇప్పటికే అక్కడి నుంచి నిష్క్రమిస్తున్నాయి. ఈ పరిస్థితి భారత్, వియత్నాం, సౌదీ అరేబియా వంటి దేశాలకు లాభం చేకూరుస్తుంది. అమెరికా, చైనాల మధ్య కొనసాగు తున్న ఈ డిజిటల్ పోటీ రాబోయే దశాబ్దాలలో వర్ధమాన దేశాలకు అనుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.

■ నెల్లూరు నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్

కృత్రిమ మేధతో ముప్పు తప్పదా?

మనిషికి మనిషితో పోటీ అన్నది నిన్నటి మాట. మనిషికి కృత్రిమ మేధస్సు(ఏఐ)తోనే పోటీ అన్నది నేటి మాట. మనిషి ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న ఏఐ ఇప్పుడు మనిషి ఉనికికే సవాలు విసురుతోంది. ఒకవైపు కృత్రిమమేధతో మానవ సామర్థ్యాలు గణనీయంగా పుంజుకుంటాయనే అభిప్రాయాలు, మరోవైపు ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతాయన్న వాదనలు బలంగా వినిపిస్తు న్నాయి. మొత్తంగా మనిషి మనుగడే ప్రమాదంలో పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'కృత్రిమమేధ అణుబాంబు కంటే ప్రమాదకరం, ఆ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం అంటే ఇంకాస్త త్వరగా మానవాళి తన వినాశనానికి ముహూర్తం పెట్టు కోవడమే' అంటూ ప్రముఖ అంతరిక్ష పరిశోధకులు స్టీఫెన్ హాకింగ్స్ గతంలోనే హెచ్చరించారు. కృత్రిమమేధ ఇప్పటికే అనేక సమస్యలకు కారణమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల విషయంలోనూ అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. సాంకేతిక లోపాలతోనో, ఇంకేదో కారణంతోనో సదరు వాహనాలు కలిగించే ప్రాణ, ఆస్తి నష్టాలకు బాధ్యత ఎవరు తీసుకోవాలన్న విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. తమ లోపాల్ని తాము తెలుసుకునే యంత్రాలు వచ్చేదాకా ఇలాంటి ప్రశ్నలకు జవాబు దొరకదంటున్నారు నిపుణులు. కృత్రిమమేధతో రూపొందించిన రోబోలతో ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం మరింతగా పెరుగుతుందని ఐరాస ఇప్పటికే హెచ్చరించింది. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వల్ల మన దేశంలో 54శాతం మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాద ముందని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం' నివేదిక హెచ్చరించింది. ఏఐను నియంత్రించకుంటే వచ్చే రెండేళ్లలో మానవాళి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు టెక్నాలజీ రంగ నిపుణులు. ఒక సమూహంగా మానవాళి ప్రాణాలు తీయగల సైబర్, బయోలాజికల్ ఆయుధాలను సృష్టించే సామర్థ్యం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉందంటున్నారు. కృత్రిమమేధను అంతర్జాతీయ స్థాయిలో నియంత్రించకుంటే, ఆ తరువాత మానవుడు నియంత్రించ లేని అత్యంత శక్తిమంతమైన వ్యవస్థ ఏర్పడుతుందని హెచ్చరిస్తు న్నారు. ఏదేమైనా భవిష్యత్తులో ఏఐ కారణంగా మానవాళికి పెను ముప్పు తప్పదన్నది నిపుణుల ఆందోళన.

– ఎస్. అబ్దుల్‌ఖాలిక్

ఆటగాళ్ళకన్నా, అంపైర్ ముఖ్యం!

బిహార్ ఎన్నికల ఫలితాలు ఎన్డీయే ఎన్నికల వ్యూహరచన సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేశాయి. నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో పదోసారి ముఖ్యమంత్రిగా నవంబరు 20న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ఎన్నికలు ఇండియా బ్లాక్/ మహాగఠ్ బంధన్ బలహీనతల్నీ, తేజస్వీ యాదవ్ అత్యుత్సాహాన్నీ, రాహుల్‌గాంధీ మంద్రస్థాయి ప్రతిస్పందననీ మరోసారి చాటి చెప్పాయి. రాహుల్‌గాంధీ ఓట్ చోరీ ఉద్యమాన్ని సాగించినంత ఉధృతంగా బిహార్ ఓటర్లను ఆకట్టుకునే పని చేయలేకపోయారు.

సంఘపరివారంలో వందకు పైగా సంఘాలు ఉన్నాయి. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ వంటి ధార్మిక సంఘాలే గాక పసిపిల్లల నుంచి అంధుల వరకు అనేక రకాల సంఘాలు ఇందులో ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమూహాల్లో పని చేయడానికి కూడా వేరువేరు సంఘాలు ఉన్నాయి. వీటన్నింటి రాజకీయ వేదిక బీజేపీ. ఇవన్నీ ఏకశిలా సదృశ్యంగా మనసా వాచా కర్మణా ఒకే ఆలోచనతో, ఒకే లక్ష్యంతో తమతమ రంగాల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తుంటాయి. వాటికి అవసరానికి మించిన నిధుల్ని దేశంలోని మెగా కార్పొరేట్లు సరఫరా చేస్తుంటాయి. దేశంలో అత్యంత ధనిక పార్టీ బీజేపీ అనేది అందరికీ తెలిసిన విషయం. ఆ పార్టీ నడిపే సోషల్ మీడియాలు, వారి అభిమానులైన 'అన్–సోషల్ మీడియా హౌస్‌లు సహజంగానే విపక్షాలను అప్రతిష్ఠ పాలు చేయడం కోసం, బీజేపీని గెలిపించడం కోసం 24/365 రోజులు పనిచేస్తుంటాయి. ఇది సంఘపరివారం విజయ రహస్యం.

మరోవైపు, బీజేపీ ప్రత్యర్థులకు సిద్ధాంతపరంగా ఏక సమైక్యతా సూత్రం ఏమీ లేదు. వాళ్ళకు ఒక బైండింగ్ వైర్ లేదు. ఒక పదం కోసం, ఒక్కోసారి ఒక్క అక్షరం కోసం, ఒక్క సీటు కోసం ఆ పార్టీలు హోరాహోరీగా కొట్లాడుకుని వీధులకు ఎక్కుతుంటాయి. పైగా నాలు గున్నరేళ్ళు పూర్తి విశ్రాంతి తీసుకుని ఎన్నికలకు ఆరు నెలలు ముందు మాత్రమే మేలుకుంటాయి. వీటికి కూడా కొన్ని ప్రజాసంఘాలు ఉంటాయి. వాటిల్లో ఎక్కువ భాగం లెటర్ హెడ్ సంస్థలు. నేల మీద నిలబడి ప్రజల్లో పనిచేసేవి చాలా తక్కువ. బీజేపీ–ఎన్డీఏలను వ్యతిరేకించేవారు సహితం ఇండియా బ్లాక్/ మహాగఠ్ బంధన్ అంతఃకలహా లను చూసి అసహ్యించుకుంటారు.

తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీశ్ కుమార్ మీద సహజంగానే ఎంతో కొంత అసంతృప్తి ఉంటుంది. ఈసారి మహిళా ఓటర్లు గుర్రుగా ఉన్నారనే మాట బిహార్‌లో వినిపించింది. అంతే, 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద అక్టోబరు 6న ఒక్కో మహిళ అకౌంట్లో పది వేల రూపాయల చొప్పున వేసేశారు నితీశ్. ఈ పథకం కింద కోటి 40 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి రూ.14వేల కోట్లు జమ చేశారని అంచనా. నిజానికి, బిహార్‌లో అక్టోబరు 6 నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇది ఒక విధంగా 'ఓటుకు నగదు' పథకం. ఎన్నికల్లో ఇలాంటి అక్రమాలను ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలి. అలా జరగలేదు.

స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలను ప్రధాన ఆదర్శాలుగా ప్రకటించిన భారత రాజ్యాంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నెత్తిమీద పెట్టుకుంటారు. వీలున్నప్పుడల్లా "సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్" తమ విధానం అంటుంటారు. కానీ, వారి పార్టీ మాత్రం దేశం మొత్తం మీద ఒక్క సీటు కూడా ముస్లింలకు కేటాయించదు. ముస్లింలను అణచివేస్తున్నామనే సంకేతాలు ఇస్తే హిందూ సమాజంలోని ఛాందస సమూహం తమకు ఓటేస్తుందనేది ఆ పార్టీ ఎత్తుగడ. ఇది ఇటీవలి ఎన్నికల్లో ఆ పార్టీకి సానుకూల ఫలితాలను ఇస్తోంది.

మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీతో అంత హోరాహోరీగా పోరాడిన ఎంఐఎం పార్టీని మీడియా 'బీజేపీ–బీ టీమ్' అనడం విచిత్రం. ఈ నింద నుంచి బయటపడడానికి ఈసారి ఎంఐఎం బిహార్‌లో మహాగఠ్ బంధన్‌లో చేరడానికి చాలా ప్రయత్నించింది. కానీ ముస్లిం లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎంను తమలో చేర్చుకోవడానికి బీజేపీ వ్యతిరేక మహాగఠ్ బంధన్ (ఇండియా బ్లాక్) భయపడింది. ఎంఐఎంతో జతకడితే సంఘ పరివారం తమను మొత్తంగా 'గడ్డాలు, టోపీల కూటమి' అంటుందని దాని భయం. తమకు 6 సీట్లు ఇచ్చినా సర్దుకుంటామని ఎంఐఎం అభ్యర్థించినప్పటికీ, ఈ ప్రతిపాదనను ఆర్జేడీ తేజస్వీయాదవ్ గట్టిగా తిరస్కరించారు. ఫలితంగా ఎంఐఎం గ్రాండ్ డెమొక్రాటిక్ అలయన్స్ (జీడీఏ)ను ఏర్పాటు చేసింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇప్పుడున్న పద్ధతిలో ఎన్ని సీట్లు గెలుచుకు న్నారన్నదే ప్రామాణికంగానీ, ఏ పార్టీకి ఎంతమంది ఓటర్లు మద్దతు పలికార న్నది కొలమానం కాదు. ఆర్జేడీకి కోటి 80లక్షల ఓట్లు (23శాతం) వచ్చాయి గానీ సీట్లు 25 మాత్రమే వచ్చాయి. బీజేపీకి 96లక్షల ఓట్లు, అంటే ఆర్జేడీ కన్నా రెండున్నర శాతం తక్కువ ఓట్లు వచ్చినా 91 సీట్లు వచ్చాయి. జేడీయూకు 90 లక్షల ఓట్లు వచ్చాయి (19 శాతం) 84 సీట్లు వచ్చాయి. 9 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్‌కు 5 సీట్లు వస్తే, 5 శాతం ఓట్లు మాత్రమే వచ్చిన ఎల్‌జేపీకి 20 సీట్లు దక్కాయి. ఇక్కడ ఓట్లకూ సీట్లకూ పొంతన లేదు.


> బిహార్‌లో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓట్లేస్తారనే సమూహాలను జాబితానుంచి తొలగించారనీ, కూటమికి అనుకూలురైన వారిని కొత్తగా చేర్చారని ఆరోపణలున్నాయి. భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ ఈ వ్యూహాన్ని రచించి అమలు చేశారని రాహుల్‌గాంధీ గణాంకాలతో సహా చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణల్ని తేలిగ్గా కొట్టివేయలేం.



ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఏవో చాలామందికి గుర్తుండవు. సీబీఐ, ఈడీ, ఐటీ, ఎన్ఐఏ, ఎన్నికల కమిషన్‌లను మాత్రమేగాక, అవసరం అయితే సుప్రీంకోర్టును సహితం బీజేపీ తన భాగస్వామ్య పక్షంగా మార్చుకోగలదు. దాని సామర్థ్యం అపారం. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) బిహార్ ఎన్నికల ఫలితాల్లో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించింది. సరిగ్గా ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తీసేసింది. మరికొన్ని లక్షల మందిని కొత్తగా చేర్చింది. బిహార్‌లో ఎన్డీఏ కూటమికి వ్యతిరే కంగా ఓట్లేస్తారనే సమూహాలను జాబితా నుంచి తొలగించారనీ, ఎన్డీఏ కూటమికి అనుకూలురైన వారిని కొత్తగా చేర్చారని ఆరోపణ లున్నాయి. భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ ఈ వ్యూహాన్ని రచించి అమలు చేశారని రాహుల్‌గాంధీ గణాంకాలతో సహా చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణల్ని తేలిగ్గా కొట్టివేయలేం.

1980–90ల నాటి మాట. స్వదేశీ పిచ్‌ల మీద ఇండియా కన్నా పాకిస్థాన్ మెరుగైన ఫలితాలను సాధిస్తున్న కాలంలో ఒక స్పోర్ట్స్ ప్రతినిధి 'లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్‌ను ఒక చిత్రమైన ప్రశ్న వేశాడు. ఇండియా టీమ్‌లోకి పాకిస్థాన్ టీమ్ నుంచి ఒక ప్లేయర్‌ను తీసుకోవాల్సి వస్తే తన ప్రాధాన్యం ఎవరు? అని అడిగాడు. దానికి గవాస్కర్ అంతకన్నా చిత్రమైన సమాధానం ఇచ్చాడు. "నేను ఏ పాకిస్థానీ ఆటగాడినీ ఎంచుకోను. నిజానికి, నేను భారత జట్టులోకి పాకిస్థానీ అంపైర్‌ను తీసుకుంటాను!" అన్న అర్థం వచ్చేలా సమాధానం చెప్పాడు. 'ఆటగాళ్లకన్నా అంపైర్ల తప్పుడు నిర్ణయాలవల్లే పాకిస్థాన్ గెలుస్తున్నది' అని చెప్పడం గవాస్కర్ ఉద్దేశ్యం. బిహార్ ఎన్నికల ఫలి తాలను చూశాక గవాస్కర్ మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఇలాంటి ఎన్నికల ప్రధానాధికారులు ఉంటే చాలు మోదీజీ–అమిత్‌జీల జోడీ ఎన్ని విజయాలనైనా సాధించగలదు.

● డానీ
సమాజ విశ్లేషకులు





పత్తి పంటను పీకేస్తున్న రైతులు

- మొంథా తుఫాన్‌తో ఉరకెత్తి ఎండిన పంట
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

పెదనందిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పత్తి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. గత ఐదేళ్లుగా పత్తిరైతులు గులాబీ రంగు పురుగుతో పంటసాగు కత్తిమీద సాములా మారింది. ఈ ఏడాది మండలంలో.. ఖరీఫ్ పత్తి 700 ఎకరాల్లో సాగు చేశారు. పూత, పిందె దశలో పంట ఉండగా.. పత్తి రైతుల ఆశలను తుఫాన్ జలసమాధి చేసింది. పొలాల్లో నీటిని బయటకు పంపి నప్పటికీ.. ఉరకెత్తిన పైర్లు ఏమాత్రం ఎదుగుదల లేక క్రమేణా ఎండుముఖం పట్టాయి. దీంతో చేసేదేమి లేక రైతులు పంటను పీకేసేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని నాగులపాడులో రైతు కమ్మ సురేష్ తన ఏడు ఎకరాలలోని పత్తి పంటను సోమవారం కూలీలతో పీకించి, తగలబెట్టారు. పంట చేతికొచ్చే పరిస్థితి లేకనే పీకేస్తున్నట్లు రైతు సురేష్ తెలిపారు. రబీ సీజను ప్రారంభం కానుందని.. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించి ఆదుకోవాలని వేడుకొన్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం స్పందిస్తూ.. పంట పీకేసిన రైతు కమ్మ సురేష్ నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రైతుకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ అభ్యర్థులకు 'సివిల్ సర్వీసెస్'కు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.మయూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిసెంబర్ 5న సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విధానంలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలోని బీసీ భవన్‌లో శిక్షణతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పించి స్టడీ మెటీరియల్ అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 0863 2358071 నంబరుకు సంప్రదించాలని డైరెక్టర్ మయూరి తెలిపారు

పరిపూర్ణం.. భక్తిపారవశ్యం!



గుంటూరులో దీపారాధన చేస్తున్న మహిళ

కార్తిక మాసం చివరి సోమవారం శైవక్షేత్రాలు భక్త జన సంద్రంగా మారాయి. పవిత్ర మాసాంతం.. నియమ నిష్టలతో ఉన్న భక్తులు ఆలయాలకు భారీగా పోటెత్తారు. పుణ్య స్నానాలు ఆచరించి.. భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీప నైవేద్యం సమర్పించి.. ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం పఠిస్తూ.. స్వామిని దర్శించుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి.. మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ప్రథమ ఆరామం బాల చాముండికా సమేత అమ రేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తిక దీపాల కాంతిలో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. - గుంటూరు, పెదకాకాని



అమరావతి అమరేశ్వరాలయంలో కోటి దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు, అమరావతి అమరేశ్వరుడు





పెదకాకాని శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు



అమరావతి వద్ద కృష్ణానదిలో భక్తుల పుణ్య స్నానాలు



అరండల్‌పేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బ్యాడిగి మిర్చి రైజింగ్

- మలేషియా డిమాండ్ అంచనాతో స్టాకిస్టుల కొనుగోలు
- క్వింటాల్ రూ. 18,500.

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ఒక వెలుగు వెలిగిన బ్యాడిగి రకం మిర్చి.. మళ్లీ గత వైభవం దిశగా వెళ్తోంది. రోజురోజుకు మార్కెట్‌లో దీనికి డిమాండ్ పెరుగుతోంది. ఘాటు తక్కువగా ఉండి ఎరుపు రంగులో మిలమిల మెరిసే మిర్చి రకం కావడంతో మలేషియా నుంచి డిమాండ్ అధికంగా ఉంటుంది. మరికొద్ది రోజుల్లో ఆ దేశం నుంచి ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ వస్తాయన్న అంచనా వేస్తూ స్టాకిస్టులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు)లో బ్యాడిగి మిర్చిని కొనుగోలు చేసి స్టాకు పెట్టుకొంటున్నారు. ఈ కారణంగా ధర పెరుగుతూ పోతోంది. రెండు వారాల వ్యవధిలోనే బ్యాడిగి మిర్చి క్వింటాల్ ధర రూ.20 వేలు దాటొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సోమవారం మిర్చి యార్డులో క్వింటాల్ బ్యాడిగి మిర్చి రూ.18,500 గరిష్టంగా అమ్ముడైంది.

రెండేళ్ల క్రితం ధర ఇలా..

రెండేళ్ల క్రితం గుంటూరులోనే కాకుండా కర్నూలు, బళ్లారిలోనూ బ్యాడిగి మిర్చికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అప్పట్లో క్వింటాల్ రూ.30 వేల వరకు ధర పెట్టి స్టాకిస్టులు కొనుగోలు చేశారు. ఇందుకు కారణం కొన్ని దేశాల నుంచి ఎక్కువగా ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ రావడమే. ఏ కారణంతోనో 2024, 2025 సీజన్‌లలో బ్యాడిగి మిర్చికి డిమాండ్ తగ్గిపోయింది. దాంతో క్వింటాల్ ధర ఒక దశలో రూ.11 వేలకు దిగి వచ్చింది. ఈ రకం మిర్చి సాగు చేస్తే బాగా గిట్టుబాటు అవుతుందని భావించి పంట వేసిన రైతులు మార్కెట్‌లో డిమాండ్ లేని కారణంగా నష్టాలను చవి చూస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు స్థిరంగా ఉన్న బ్యాడిగి మిర్చి ధరలు ఒక్కసారిగా పెరగడం ప్రారంభించాయి. ఐదు నెలల్లో దాదాపుగా 50 శాతం ధర పెరిగింది.

ప్రకృతి విపత్తులతో దెబ్బతిన్న పంట

బ్యాడిగి మిర్చిని ఎక్కువగా కర్ణాటక, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో పండిస్తుంటారు. అయితే ఈ ఏడాది ప్రకృతి విపత్తులు కారణంగా పంట దెబ్బతింది. దీంతో కొత్త దిగుబడి మార్కెట్‌కి రావడంలో ఆలస్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కచ్చితంగా డిమాండ్ ఏర్పడుతుందన్న ఉద్దేశంతో.. స్టాకిస్టులు బ్యాడిగి మిర్చిని కొనుగోలు చేసి నిల్వ చేసుకొంటున్నారని కమీషన్ వ్యాపారులు తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను పాత గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఆళ్ల అనిల్‌కుమార్ అలియాస్ అనిల్, చింతల శ్రావణచంద్ర ప్రసాద్ అలియాస్ బెంజిమన్, ఏటీ అగ్రహారం 4వ లైనుకు చెందిన షేక్ రోషన్, షేక్ నవీద్ సల్మాన్ అలియాస్ నవీద్, మానిగినేటి గురు మహారాజు అలియాస్ గురు, మేడ రితేష్ అనే ఆరుగురి నుంచి ప్రమాదకరమైన 17 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పాత గుంటూరు సీఐ వెంకటప్రసాద్.. అందిన సమాచారం మేరకు బుడంపాడు బైపాస్ వద్ద గల అన్నపూర్ణ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఓపెన్ ప్లాట్స్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించారన్నారు. ఈ సందర్భం గా ఆరుగురు యువకులు పట్టుబడ్డారని వెల్లడించారు. కొప్పురావూరుకు చెందిన అనిల్, ఆర్టీసీ కాలనీకి చెందిన బెంజిమన్ వ్యసనాలకు అలవాటు పడి.. ఈజీ మనీ కోసం.. బెంగళూరు నుంచి ఎండీఎంఏ(మెత్) మత్తు పదార్థాన్ని తీసుకొచ్చి విక్ర యిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు శ్రావణ చంద్రకు పరిచయస్తుడైన షేక్.రోషన్ స్నేహితుడు షేక్ నవీద్ సల్మాన్‌ను సంప్రదించారన్నారు. అతని ద్వారా అక్కడ ఫరాజ్‌ఖాన్ అనే వ్యక్తికి రూ.34,500లు ఆన్‌లైన్‌లో చెల్లించి, ఎండీఎంఏను కొను గోలు చేశారని చెప్పారు. రోషన్, నవీద్ సల్మాన్ కూడా ఒక ప్యాకెట్‌ను గుంటూరుకి తీసుకొచ్చారన్నారు. కొప్పురావూరుకు చెందిన మనికినేటి గురు మహారాజు, నంబూరుకు చెందిన మేడ రితేష్‌కు అనిల్ కుమార్ తన స్నేహితులు శ్రావణ చంద్ర, రోషన్, నవీద్ సల్మాన్‌తో కలిసి మత్తు పదార్థాన్ని విక్రయిస్తుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వివరించారు. గంజాయిని కూకటి వేళ్ల సహా.. పెకలించేందుకు.. పోలీస్‌స్టేషన్‌స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి, ఈగల్ టీంతో సమన్వయం చేసుకుంటూ కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ వెంకట ప్రసాద్, ఎస్ఐలు ప్రసాద్, రెహమాన్, సిబ్బంది నూరుద్దీన్, మురళి తదితరులను ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

ఈకేవైసీ లేదంటే పేర్లు తొలగింపే!

- నెలాఖరు వరకు అవకాశం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైస్ కార్డుల ఈ- కేవైసీ ప్రక్రియ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. మెజారిటీ కార్డుదారులు ఈకేవైసీ పూర్తి చేయించుకున్నప్పటికీ 52 వేల మందికి మాత్రం అది పెండింగ్ ఉంది. కానీ వారిని వెతికి పట్టుకుని ఈకేవైసీ చేయించడం మాత్రం అధికారులకు, రేషన్ డీలర్లకు తలకు మించిన పనిగా పరిణమించింది. దీంతో ఈ కేవైసీ అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. నవంబరు 30లోగా ఈకేవైసీ చేయించని వారిని అనర్హులుగా భావించి తొలగిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

- గుంటూరు జిల్లాలో 16,69,681 మంది రైస్ కార్డు సభ్యులు ఉన్నారు. వీరిలో 16,16,748 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. 52,933 మంది చేయించుకోవాల్సి ఉంది. కుటుంబ సభ్యుల్లో నలుగురు ఉంటే ముగ్గురికి ఈకేవైసీ పూర్తయ్యి.. ఒకరిది పెండింగులోనే ఉంది. ఆ కార్డు సభ్యులు ఉన్నత విద్య కోసమో, ఉద్యోగం కోసమే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉండడంతో నమోదు చేసుకోలేకపోతున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే అలాంటి వారికి కూడా ఆధార్ అథెంటికేషన్ ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేసుకునే అవకాశం కల్పించారు. నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోకుంటే.. వారి పేరు కార్డు నుంచి తొలగిస్తారు.

స్మార్ట్ కార్డులు తీసుకోండి..

నెలాఖరులోగా స్మార్ట్ రైస్ కార్డులు పొందాలని జిల్లా పౌర సరఫరాల అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,85,000 స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 5,36,406 కార్డుదారులకు పంపిణీ పూర్తి అవగా.. ఇంకా 49,209 కార్డులు పంపిణీ కాకుండా సచివాలయాల వద్ద ఉన్నాయి. కార్డులో ఉన్న సభ్యులలో ఎవరైనా వేలిముద్ర వేసి స్మార్ట్ కార్డు పొందవచ్చు.

వసతిపై.. వీడిన గ్రహణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఎట్టకేలకు వర్సిటీ పాలక మండలి సమావేశం
- రూ.19.60 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం
- పూర్తికానున్న ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు కాకినాడ జేఎన్‌టీయూలో పాలక మండలి సమావేశం జరిగింది. ఇందులో నరసరావుపేట కళాశాల అభివృద్ధిపై చర్చించారు. వీసీ సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. నిధుల కొరతతో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రూ.19.60 కోట్ల నిధులు విడుదలకు సమావేశంలో తీర్మానించినట్లు సమాచారం. నిధుల కొరతతో కాంట్రాక్టర్లు వసతి గృహాల నిర్మాణ పనులు నిలిపివేశారు. దీనిపై.. వీసీ హామీ హుళక్కి.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించి.. పాలకమండలి సమావేశం నిర్వహించి.. నిధుల కేటాయింపుపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నెల రోజుల్లో పనులు ప్రారంభం

పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో ఉన్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు 1,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి వసతి లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు తుది దశలో నిలిచిపోయాయి. దాదాపు ఏడాదిన్నరగా వర్సిటీ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వసతి గృహాల నిర్మాణానికి ఈసీ సమావేశంలో రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. బాలికల వసతి గృహం ప్రహరీకి రూ.1.10 కోట్లు, రహదారుల అభివృద్ధి, ప్రధాన గేటు ఏర్పాటు వంటి పనులకు రూ.8.50 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. దీంతో నెల రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. కళాశాల భవనంలో మరో ఫ్లోర్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు గతంలో రూ.31.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ నిర్వహించాల్సి ఉంది. రూ.16 కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులు చేపట్టగా ఇవి నత్తనడకన సాగు తున్నాయి. అలాగే కళాశాలలో ఆధ్యాపకుల కొరతపై చర్యలు చేపట్టనున్నారు. కాంట్రాక్ట్ విధానంలో అధ్యాపకులను నియ మించాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి వేగవంతం చేస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరుతాయి.



బాలికల వసతి గృహ భవనాలు

సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ 6
ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల
ఏఎన్‌యూలో ఆటల పోటీలు
వెలలేనివి వీరి సేవలు
● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు 8

సీసీఐ పత్తిబంధకాలు

ఎన్ని విజ్ఞప్తులు చేసినా..

ఏపీలో పత్తి రైతులను ఆదుకునేందుకు.. తేమ శాతంలో మార్పులు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కేంద్రానికి లేఖ రాశారు. గత వారం గుంటూరు జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదు.



కొనుగోలు కేంద్రాల్లో పాస్‌కాని పత్తి

- సీసీఐ నిబంధనలతో బయ్యర్ల తిరస్కరణ
- బయట దళారులకు రూ.5 వేలకే విక్రయం
- వాతావరణ మార్పులతో రైతుకు తప్పని కంట'తడి'
- తేమశాతం పెంచితేనే.. కర్షకులకు ప్రయోజనం

పత్తి రైతులకు సాగు మొదలుకుని.. కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయం వరకు కంటతడి తప్పడం లేదు. సాగు సమయంలో పంటపై ప్రకృతి పగబడితే.. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిబంధనలు మద్దతు ధర పొందడానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. తేమ శాతం అధికంగా ఉందని కొనుగులు కేంద్రాలకు వచ్చిన పత్తి పంటను బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో కేంద్రాలు ఆరంభించి అధికారికంగా పది రోజులు దాటినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టుమని పది కేజీల పత్తి కూడా కొన్న దాఖలాలు కనిపించడం లేదు. సీసీఐ నిబంధనల మూలాన రైతులు కేంద్రాలకు తెస్తున్న పత్తి పాస్ అవ్వడం లేదు.

గుంటూరు సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి తీత జోరుగా సాగుతోంది. మొన్నటి దాకా తుఫాన్ ప్రభావంతో పత్తిలో నెమ్ము ఎక్కువగా కనిపించింది. ఇప్పుడు వాతావరణం పూర్తిగా మారిపోయి పగటి వేళ కూడా చల్ల గాలులు వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో రైతులు హడావిడిగా పత్తి తీయిస్తున్నా.. పంటలో తేమ శాతం 18 నుంచి 22 వరకు ఉన్నట్లు తెలుతోంది. సీసీఐ నిబంధనలు ప్రకారం తేమ శాతం 8 నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి.

దళారుల పంట పండుతోంది..

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దే దళారుల పంట పండుతోంది. కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం చూసిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

20 నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తక్కెళ్లపాడులోని రిజర్వాయర్‌కి వెళ్లే ప్రధాన పైప్ లైన్ లీకుల మరమ్మతుల కోసం ఈ నెల 20న ఉదయం నుంచి హెడ్ వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ పాయింట్‌ని నిలిపివేయడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో 22వ తేదీ వరకు మూడు రోజులు నగరంలో తాగునీటి సరఫరాకి అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా.. నగరంలోని నెహ్రూ నగర్, శారదా కాలనీ, వసంతరాయపురం, హెచ్ఎల్ఆర్, హనుమయ్య నగర్, స్తంభాల గరువు, శ్యామలానగర్, గుజ్జనగుండ్ల, కోర్ట్ కాంపౌండ్, ఏటి అగ్రహారం, మార్కెట్ యార్డ్, హౌసింగ్ బోర్డ్, బీఆర్‌స్టేడియం, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, కేవీపీ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్, తారకరామ నగర్ పరిధిలో తాగునీటి సరఫరా ఉండదన్నారు. 22వ తేదీ సాయంత్రం పాక్షికంగా, ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో ఆటల పోటీలు


క్రీడాకారులతో ఫార్మసీ అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ప్రతి సంవత్సరం నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్-ఫార్మసిస్ట్ యాజ్ ఎడ్యుకేటర్ ఆఫ్ వాక్సినేషన్ అనే థీమ్‌తో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. వారం రోజులపాటు ఈ పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ షేక్.మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, దివ్య భార్గవి, రేణుక పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ యోగ నాలుగో సంవత్సరం ఫలితాలను సోమవారం విడుదలయ్యాయి. ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ రావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ పెట్టుకోదలచిన వారు ఒక్కొక్క పేపర్‌కు రూ.1860 చెల్లించి ఈ నెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొంది పరిచామని పేర్కొన్నారు.

సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి కాకినాడ-చెంగల్‌పట్టు/పుదుచ్చేరి మధ్యన రాకపోకలు సాగిస్తోన్న సర్కారు ఎక్స్‌ప్రెస్ సంక్రాంతి పండగ రోజు నుంచి కొత్త రూపును సంతరించుకోబోతోంది. ఇప్పటివరకు ఐసీఎఫ్ బోగీలతో రాకపోకలు సాగిస్తోన్న ఈ రైలు ఇకపై కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనుంది. చెంగల్‌పట్టు నుంచి జనవరి 14వ తేదీన, పుదుచ్చేరి నుంచి జనవరి 15వ తేదీన ఈ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది.

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము-గుంటూరు

ఆర్.సి.నం. 2613/2025/జి4 తేది. 17-11-2025.

షార్ట్ టెండర్ ప్రకటన

జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్, కస్తూరిబా గాంధీ, ఆదర్శ, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ మరియు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి చదువుచూ మార్చి-2026 నందు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్ సరఫరా చేయుటకుగాను ఇంగ్లీషు మీడియంలో 32,276 పుస్తకములు ఎ4 సైజుతో ఇంగ్లీషు మీడియం పుస్తకముల స్పెసిఫికేషన్ మేరకు డి.టి.పి మరియు ప్రింటింగ్ చేయించి జిల్లాలోని 6 ఉప విద్యాశాఖాధికారుల వారీగా వారి వారి కార్యాలయములకు తదుపరి సూచనల మేరకు సొంత ఖర్చులతో సరఫరా చేయుటకుగాను ఆసక్తిగల సరఫరాదారుల నుండి షార్ట్ టెండర్స్ ఈ దిగువ తెలిపిన ప్రకారము ఆహ్వానించడమైనది. 1. టెండర్ షెడ్యూల్ ఖరీదు రు.5,000/-, 2. EMD రూ.1,00,000/-లు, 3. టెండర్ షెడ్యూల్ పొందుటకు చివరి తేది. 25.11.2025 మధ్యాహ్నం గం.12.00ల వరకు., 4. టెండర్ షెడ్యూల్ దాఖలు చేయవలసిన తేది. 25.11.2025 మధ్యాహ్నం గం.1.00 వరకు. 5. టెండర్ షెడ్యూల్ తెరువబడు తేది. 25.11.2025 సాయంత్రం గం.4.00 లకు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం, గుంటూరు. టెండర్ దారుడు టెక్నికల్ బిడ్ నందు అర్హత పొందిన తదుపరి మాత్రమే ఫైనాన్సియల్ బిడ్‌కు అర్హత పొందుదురు. టెండరు పై అంతిమ అధికారము శ్రీయుత ముఖ్యకార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, గుంటూరు వారికి కలదు. ఏ కారణము తెలుపకనే టెండర్స్ తిరస్కరించుట గాని రద్దు పరచుట గాని వారికి పూర్తి అధికారము కలదు. టెండర్ షరతులకు కార్యాలయపు పనిదినములలో "జి కక్ష్య పర్యవేక్షకుల" వారిని సంప్రదించగలరు.

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లాప్రజా పరిషత్, గుంటూరు.

మెరుగైన సేవలే ఏపీ గ్రామీణ బ్యాంకు లక్ష్యం

● చైర్మన్ కే ప్రమోద్‌కుమార్ రెడ్డి ● కర్లపాలెంలో నూతన కార్యాలయం ప్రారంభం

కర్లపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రూ.128 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ బ్యాంకు లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కర్లపాలెంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ బి.రామకృష్ణ రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ళ శ్రీనివాస్, ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎం.ఎం.భాస్కర్‌రావుతో కలిసి సోమవారం ప్రమోద్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ ఆర్.అన్నపురెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాష్ట్రంలో 1,351 శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తోందన్నారు. ప్రభుత్వ రంగంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్ రాష్ట్రంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు దీటుగా ఆంధ్రప్రదేశ గ్రామీణబ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. అనంతరం మేనేజర్, సిబ్బంది రూమ్‌లను, లాకర్లను ప్రారంభించారు. డ్వాక్రా మహిళలకు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. కర్లపాలెం చైతన్యగ్రామీణా బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత మేనేజర్‌లు వెంకన్నచౌదరి, ఏసుపాదం, విద్యాసాగర్, మద్దుల సత్యనారాయణ, భవన యజమాని మంతెన సత్యనారాయణరాజును చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కెసాని మానసా, ఖాతాదారులు దుండి చలపతి రెడ్డి, పిట్టు మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు రూ.2కోట్ల చెక్కును అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు: యరపతినేని

మాచవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ప్రపంచస్థాయి సీఐఐ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో పలు కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తపాలెం గ్రామంలో జమ్మిగుంపుల నాగేశ్వరరావు, వర్దనమ్మలు సుమారు రూ.8 లక్షల సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, మాచవరం గ్రామంలో మండల సమాఖ్య పరిధిలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిని ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఆర్థికంగా దిగజారి పోయి విధ్వంస మయిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నా రన్నారు. దీనిలో భాగంగానే విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో సుమారు రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు, ఇతర దేశాలతో ఒప్పందాలు కుదిరాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఏకగ్రీవం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు.


మాచవరంలో కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

సీఐఐతో మారనున్న పెట్టుబడుల దిశ

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు నాయుడు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారని, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారని చెప్పారు. ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుంటే ఆంధ్రప్రదేశ్ అందుకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండడంతో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కట్టాయన్నారు. జగన్ మోహన్‌రెడ్డి విధ్వంసక విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్ళిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఏబీసీ వంటి కంపెనీలు తిరిగి రాష్ట్రానికి రావడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, ముంద్రకోటి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రకాశం బ్యారేజీ వద్ద స్వల్పంగా వరద ఉధృతి

● దిగువకు 400 క్యూసెక్కుల నీటి విడుదల


ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 9,938 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,211 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,101 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 586.10 అడుగులు ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,034 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 14,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 14,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.22 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుందని చెప్పారు. పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

ఏఎన్‌యూలో వేతనాల మాయాజాలం

● అతిథి అధ్యాపకుల జీతాల చెల్లింపులో గోల్‌మాల్ ● బ్యాంకు ఉద్యోగులను నిలదీసిన అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల్లో కొందరికి వేతనాలు జమ చేసి, మరికొందరికి జమ చేయకపోవడంపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వేతనాల చెల్లింపుకు సంబంధించిన నగదు చెక్కును ఓ అతిథి అధ్యాపకుడి చేతికి ఇవ్వటంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు అక్టోబరు నెల వేతనాలు చెల్లించేందుకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేకపోయినప్పటికీ ఓ అతిథి అధ్యాపకుడు అకౌంట్స్ విభాగం నుంచి కొంత నగదుతో కూడిన చెక్కును విశ్వవిద్యాలయంలోని యూనియన్ బ్యాంకుకు ఈ నెల 13న తీసుకెళ్లారు. అతిథి అధ్యాపకులందరి వేతనాలకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేనప్పుడు జాబితాను తిరిగి అకౌంట్స్ విభాగానికి పంపాల్సిన యూనియన్ బ్యాంకు ఉద్యోగి ఆ అతిథి అధ్యాపకుడికి జాబితా ఇచ్చి ఎవరెవరికి వేతనాలు వేయాలో నిర్ధారించమన్నట్లు తెలిసింది. దీంతో అతను తనకు అనుకూలంగా ఉండే 30 మంది పేర్లను జాబితాలో చేర్చి ఇవ్వగా, వారందరి అకౌంట్లో బ్యాంకు సిబ్బంది ఈ నెల 13న వేతనాలు జమ చేశారు. మిగతా మెజారిటీ అతిథి అధ్యాపకులకు వేతనాలు సోమవారం మధ్యాహ్నం వరకు జమ కాలేదు. ఈ వేతనాల చెల్లింపు మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సోమవారం అతిథి అధ్యాపకులు యూనియన్ బ్యాంకుకు వెళ్లి ముందుగా ఎంపిక చేసిన వారికి మాత్రమే ఏ నిబంధనల ప్రకారం వేతనాలు జమ చేశారని నిలదీశారు. ఓ అతిథి అధ్యాపకుడి మాట లను ఎలా పరిగణనలోకి తీసుకున్నారంటూ బ్యాంకు సిబ్బందితో పాటు బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించారు. అనంతరం అకౌంట్స్ అధికారిని కలిసి కొంత మందికి మాత్రమే వేతనాల చెల్లింపుల చెక్కును ఎలా రాసి ఇచ్చారని ప్రశ్నించారు. చివరకు రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్‌తో పాటు రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో రెక్టార్ శివరాం ప్రసాద్ ఫైనాన్స్ అధికారిని పిలిచి వేతనాలు జమకాని అతిథి అధ్యాపకులకు వెంటనే జమ చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు బాధ్యతగా బ్యాంకులో అప్పజెప్పాల్సిన నగదు చెక్కును అతిథ్యాపకుడి చేతికి ఎలా ఇచ్చారని, ఇక ముందు అలా ఇవ్వొద్దని హెచ్చరించారు.



రుజువైన రైజింగ్ ఆంధ్రా సత్తా: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సుతో వెల్లువెత్తిన పెట్టుబడుల సునామీతో రైజింగ్ ఆంధ్రా సత్తా మరోసారి రుజువైందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన బ్లూప్రింట్ ఇచ్చిన ఇలాంటి కార్యక్రమాన్ని ఆయు దేశంలో పైసా తీసుకురాని వైసీపీ నాయకులు విషం కక్కడం విషాదకరమని మండిపడ్డారు. 12 ప్రధాన రంగాల్లో 13.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డని పేర్కొన్నారు. పెట్టుబడుల సదస్సుతో రాష్ట్ర ఆర్థిక జీవనాడిగా ఉన్న విశాఖ బలమైన పునాది వేసిందని, పెట్టుబడిదారుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం లక్షల కోట్ల పెట్టుబడులేనని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర విధానాలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఇదే వేగంతో కొనసాగితే ఏపీ దేశంలోనే పెట్టుబడులకు నంబర్ వన్ డెస్టినేషన్ అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయల సీమ ప్రాంతాల ప్రత్యేకతలకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి సమతుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న ఇద్దరుని పెదకాకాని పోలీసులు సోమవారం అదుపులో తీసుకున్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పెదకాకాని భ్రమరాంబ ఫ్యాన్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసులు పథకం ప్రకారం వారిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం

మంగళగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కురగల్లు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందాడు. మంగళగిరి పట్టణానికి చెందిన ఎ.మురళీ (33) ర్యాపిడో బైకు రైడర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మురళీ తన ద్విచక్ర వాహనంపై సోమవారం కురగల్లు నుంచి నిడమర్రు వైపు వెళుతుండగా బైకు అదుపు తప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న టిప్పర్ మురళీ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు మహిళా కూలి మృతి

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన ఒక మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ ఘటన చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జటావతు ప్రియంతి బాయి (26) పత్తి తీత పనికి వెళ్ళింది. పొలంలో పని చేస్తుండగా ఆమె ఎడమ కాలుకు రక్తపింజర కాటు వేసింది. తోటి కూలీలు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రియంతి బాయి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త గణేష్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చినఅగ్రహారంలో మరో వ్యక్తి

పిడుగురాళ్ల: మండలంలోని చినఅగ్రహారం గ్రామానికి చెందిన ఆవుల సాంబశివరావు (42) ఆదివారం గడ్డివాము దగ్గరకు వెళ్లగా పాము కరిచి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పం

● నేడు విట్ వర్సిటీలో కార్యక్రమం ప్రారంభం ● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు "సంకల్పం" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా తొలుత జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం విట్ యూనివర్సిటీ ప్రాంగణంలో గుంటూరు జిల్లా పోలీస్, విట్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో "సంకల్పం" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని కాలేజీల్లో విద్యార్థులతో కలిపి ఈగల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి, పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తాము ప్రారంభిస్తున్న సంకల్పం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

సీసీఐ పత్తిబంధకాలు!

(5వ పేజీ తరువాయి)

బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో బయట అదే పత్తిని దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంటను వెనక్కి తీసుకెళ్తే.. రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని భావించిన రైతులు.. అయినకాడికి పత్తిని అక్కడే తెగ నమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్వింటాల్ పత్తి రూ.5 వేలకు అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అదే పత్తి సీసీఐ కొనుగోలు చేస్తే రైతుకు క్వింటాల్ కు రూ.రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత) లభిస్తుంది. దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర దక్కేది.

జీవోను అమలు చేయడం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 843 ను సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్ సీఎండీకి లేఖ రాశారు. జీవోలోని 23వ నిబంధన ప్రకారం రైతుల పత్తి పంటను ఇష్టం అయిన చోట అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఐ మాత్రం తాము చెప్పిన చోటే అమ్ముకోవాలని చెబుతోంది. దీనిపై ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు సీసీఐ మేనేజర్‌ను కలిసి రైతుల సౌలభ్యం కోసం జీవోను అమలు చేయాలని కోరినా.. పెద్దగా స్పందించకపోవడంతో తో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

37,951 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,942 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,951 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,689 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17600
నెంబరు. 5	10000	16000
273	----	---
341	10000	17200
4884	----	----
సూపర్ 10	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	18000
దేవనూరు డీలక్స్	10500	17000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	10000	16500
341	10500	18000
4884	11000	14500
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500
బ్యాడిగి	10000	18500
దేవనూరు డీలక్స్	10500	17500
తాలుకాయలు	5000	9000

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

● పీజీఆర్ఎస్‌కు 247 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 247 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్జీల పరిష్కారంలో కింది స్థాయిలో సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతులు మార్చుకోవాలని, స్వయంగా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీపీవో బీవీ నాగ సాయికుమార్, పశు సంవర్ధక శాఖ జేడీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈవో రేణుక, డీటీసీ సీతారామిరెడ్డి, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● మొంథా తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలకు ఎకరాకు వరుసగా రూ.30 వేలు, రూ.50 వేలు, రూ.75 వేలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి పరిహారం వారికే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ రాష్ట్ర కార్యదర్శి యు.గనిరాజు, ఎన్‌వి కృష్ణ, రెడ్డి శ్రీను, ఎన్.పోతురాజు, దూపాటి శ్రీను తదితరులు ఉన్నారు.

● స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఎన్నికల తేదీ, విధి, విధానాలను ప్రకటించాలని కోరుతూ టీడీపీ నాయకుడు బెల్లకొండ సురేష్ అర్జీ అందజేశారు. ఆగస్టు 18న ఎన్నికలను నిర్వహిస్తామని చెప్పి, నేటి వరకు ఈ ప్రక్రియ జరగలేదని వివరించారు. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఎన్నికలను వాయిదా వేసినట్టు అధికారులు చెబుతున్నారని, తదుపరి ఎన్నికల తేదీ, ఇతర వివరాలను ప్రకటించాలని కలెక్టర్‌ను కోరారు.

● ప్రభుత్వం అందించిన స్థలాన్ని ఆక్రమించుకున్నారని, స్థానిక అమరావతి రోడ్డులోని వేళంగినగర్‌కు చెందిన బేతాల రాజేశ్వరీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చింతల రవి అనే వ్యక్తి దౌర్జన్యంగా తమ ఇళ్లను ఖాళీ చేపించాడని, కరెంటు, పన్ను బిల్లులను వేరే పేరుకు మార్చుకున్నాడని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

● ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్ పనులను ప్రారంభించాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అర్జీ అందజేశారు. బడ్జెట్‌ను కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో దారా అంబేద్కర్ తదితరులు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని, ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను విభాగాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువు మేరకు పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు.

కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 20 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మేయర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంపై జీఎంసీ, పీఎంయూ బృందం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజీఆర్ఎస్ ద్వారా 26 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కలుషిత తాగునీరు

● రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో కార్పొరేషన్ తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తుందని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి తెలిపారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలకు నేరుగా శుద్ధి చేసిన కృష్ణా నదీ జలాలను పైపు లైన్ ద్వారా తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ సగానికి పైగా మంగళగిరి ఓపెన్ ఛానల్ నుంచి కలుషితమైన నీటిని తీసుకుంటున్నారని తెలిపారు. నగర పరిధిలో గల 62 ఈఎల్ఎస్ఆర్‌లు, సంపులను ప్రతి నెలా శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, నగరంలో పై కప్పులు ఊడిపోయి వాడేందుకు పనికిరాని 8 ఓవర్ హెడ్ ట్యాంకులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రేట్ పేయర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది సేవలను వినియోగించుకోకుండా ప్రత్యేక ఏజెన్సీని నియమించి ఒక్కో ఓవర్ హెడ్ ట్యాంక్ క్లీనింగ్‌కు సుమారు రూ.లక్షన్నర వరకు ఖర్చు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో రేట్ పెయర్స్ అసోసియేషన్ సభ్యులు కనపర్తి రాఘవరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, అసోసియేషన్ సభ్యులు వల్లూరి సదాశివరావు, చావా శివాజీ, అందుగుల గోపి, వి.మోహన మురహరిరావు, ఆర్.రామ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక




కే బసవలింగారావు మహమ్మద్ ఖాలీద్

గుంటూరు (విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెల 16న జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కే.బసవలింగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు(గుంటూరు) మహమ్మద్ ఖాలీద్ (మంగళగిరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న రెండు సంవత్సరాలు నూతన కమిటీ పని చేయనుంది. ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు ఉపాధ్యక్షుడిగా పి.నాగశివన్నారాయణ(గుంటూరు), పుట్టా జనార్ధనరావు (తెనాలి), పూడుమల్లి పార్వతి(పెదనందిపాడు), గుడిపాటి దాస్ (గోగులమూడి) ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యదర్శులుగా పి.లక్ష్మీనారాయణ(తాడికొండ), గడ్డిపాటి శివరామకృష్ణయ్య(పొన్నూరు), చక్కా వెంకటేశ్వరావు(ఫిరంగిపురం), పచ్చల శివరామకృష్ణ(గుంటూరు), కుంబా శ్రీనివాసరావు(ప్రత్తిపాడు), రాష్ట్ర కౌన్సిలర్లుగా మునగా వెంకటేశ్వరావు (చేబ్రోలు), బి.సాయిలక్ష్మి (వట్టిచెరుకూరు), కేసన రమేష్ (మేడికొండూరు), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యూ.వందనం (పెదనందిపాడు), సభ్యులుగా డి.శివశంకర్రావు (కంతేరు), షేక్ సిద్దిక్(పొన్నెకల్లు), కంచర్ల ఆదినారాయణ (కాకుమాను), ఆర్.బాలరాజు(గుంటూరు రూరల్), కె.శివశంకర్‌నాయక్ (పొన్నూరు) తదితరులు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు, కృష్ణా జిల్లా, ఎన్నికల పరిశీలకులుగా మక్కెన శ్రీనివాసరావు వ్యవహరించారు.

శతాబ్ది మహాసభలను జయప్రదం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరరావు

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ స్థాపనకు వందేళ్లు పూర్తైన సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే శతాబ్ది మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన జిల్లా సాధారణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయలేదని గుర్తుచేసుకున్నారు. దీంతో నిరుద్యోగ యువత, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరులను బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి నెట్టివేస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, చిన్న తిరుపతయ్య, మేడా హనుమంతురావు, పుప్పాల సత్యానారాయణ, చెరుకుపల్లి సింగారావు, ముప్పాళ్ల శివశంకరరావు, రామిశెట్టి అందేశ్వరరావు, పరుచూరి రాజేంద్రబాబు, రావులు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు అశాస్త్రీయం : సీపీఐ

తిరుపతిలో వెంకటేశ్వర స్వామి గర్భాలయంలో దెబ్బ తగిలి రక్తం కారడం, ఆ రక్తం శేషాచలాలపై పడటంతో ఎర్రచందనం మొలిచిందన్న డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు శాస్త్రీయ ఆధారాలు లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య స్పష్టం చేశారు. అవాస్తవ వ్యాఖ్యలతో ప్రజలను గందరగోళానికి గురి చేయొద్దని సూచించారు. గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ భావజాలానికి విరుద్ధమని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధి స్థాయిలో మాట్లాడే వారికి మరింత బాధ్యత అవసరమన్నారు. వృక్ష శాస్త్రం చదివిన ఎవరైనా చెట్లు ఎలా పుడతాయి, ఏ పరిస్థితుల్లో పెరుగుతాయి అనేది స్పష్టంగా చెప్పగలరని అన్నారు. అవాస్తవాలు ప్రచారం చేయకుండా, ప్రజలకు సరికొత్త ఆలోచనలను అందించే విధంగా వ్యవహరించాలని ఇదే పవన్ కల్యాణ్‌కి మా ఉచిత సలహా అని అన్నారు.

వైద్య రంగంలో ఫార్మసీ నిపుణుల పాత్ర ఎంతో కీలకం

● చిప్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర



మాట్లాడుతున్న డాక్టర్ సూర్యదేవర విద్యాధర

గుంటూరు (విద్య) నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ఫార్మసీ నిపుణుల పాత్ర ఎంతో కీలకమని చేబ్రోలు హనుమయ్య ఫార్మా సూటికల్ సైన్సెస్(చిప్స్) ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మసీ నిపుణులు మెరుగైన ఔషధాలు తయారు చేసేందుకు పరిశోధనలు చేయాలని సూచించారు. చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకొని వైద్య రంగంలో మెరుగైనసేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాక్సియేషన్‌లో ఫార్మసీ నిపుణుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు

విద్యుత్ ఆపరేషన్, విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 271 మందికి రూ.6.69 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డి 6 సెక్షన్ పరిధిలో సోమవారం విద్యుత్ ఆపరేషన్, విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ నేతృత్వంలో విజిలెన్స్ (డీపీఈ) ఈఈ కేఏ కరీమ్, గుంటూరు టౌన్-1 ఈఈ టి.శ్రీనివాసబాబు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో 4599 సర్వీసులు తనిఖీలు చేశారు. సెక్షన్ పరిధిలోని నగరం పాలెం, ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, అంకమ్మనగర్, శ్రీనివాసరావుపేట ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అనుమతించిన కేటగిరీ కాక ఇతర కేటగిరీల్లో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురికి రూ.15 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వినియోగిస్తోన్న 269 మందికి రూ.6.54 లక్షలు మొత్తం రూ.6.69 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. తనిఖీ ల్లో ఆపరేషన్ డిప్యూటీ ఈఈ బి.రాజమోహన్‌రావు, డీపీఈ ఈఈ కె.రవికుమార్, ఎన్ మల్లికార్జునప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఆపరేషన్ ఏఈ సాంబశివరావు, డీపీఈ ఏఈఈలు కె కోటేశ్వరరావు, శివశంకర్ తదితరులున్నారు.

అర్హులైన బ్రాహ్మణులకు రుణాలు మంజూరు చేయాలి

● బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద బ్రాహ్మణులకు రుణాలు మంజూరులో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ సూచించారు. గుంటూరులోని బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ శాఖను సోమవారం ఆయన పరిశీలించారు. సొసైటీలో బ్రాహ్మణులకు ఇంటి, బంగారంపై ఇచ్చే రుణాలు, అర్చకమిత్ర, పురోహిత మిత్ర పథకం ద్వారా వారికి అందే రుణాలపై అధికారులతో ఆయన చర్చించారు. అంతేగాక క్రెడిట్ సొసైటీ బలోపేతం, సభ్యత్వాలు పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలుపై పలు సూచనలిచ్చారు. అనంతరం గంగాధర్‌ను సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, బ్రాంచ్ మేనేజర్ పవన్, చలపతి, బీజేపీ నాయకులు పాలపాటి రవికుమార్, ఈమని మాధవరెడ్డి జితేంద్ర గుప్తా, ప్రతాప ప్రసాద్, జంధ్యాల సాయిరాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీశ్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ మాజీ ఏవీఎస్వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని ఏపీ కుమ్మర శాలి వాహన సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొరెళ్ల బసవేశ్వరరావు డిమాండ్ చేశారు. సతీశ్ మృతి కేసు విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీఐ వాగ్మూలం ఇస్తే తమ పేర్లు ఎక్కడికి బయటకి వస్తాయోనని అప్పటి ప్రభుత్వ పెద్దలలో భయం నెలకొందని, ఈ నేపథ్యంలో ఆయనను హత్య చేశారని ఆరోపించారు. సతీశ్ కుమార్ హత్యకు అసలైన నిందితుల్ని గుర్తించి కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఇందుర్తి శివన్నారాయణ, పిడతల నాగమల్లేశ్వరరావు, పోరళ్ల సాంబశివరావు, మామిళ్లపల్లి సుబ్బారావు, అంగిరేకుల వరప్రసాదు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు

గుంటూరు (విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని నలుగురు ఉర్దూ ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. తాడేపల్లి ఎంపీపీ ఎస్‌బీఆర్ పురానికి చెందిన ఎం.బురాన్, చేబ్రోలు మండలానికి చెందిన సిరాజ్ బేగం, గుంటూరుకి చెందిన షేక్ అర్షతుల్లా, మేడికొండూరు మండలానికి చెందిన లాలీమూన్ అవార్డులు అందుకున్నట్లు రేణుక తెలిపారు. ఉపాధ్యాయులను సోమవారం డీఈవో కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎస్‌కేఎండి కాశీం తదితరులు పాల్గొన్నారు.

రిలైబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని దాదాపు 400 మందికి నిత్యావసర సరుకులను అందజేస్తున్న రిలైబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని నల్లపాడు పీఎస్, ఎస్ఐ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని సీఆర్‌నగర్ ప్లాట్స్‌లో రిలైబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన రిలైబుల్ ట్రస్ట్ ట్రస్టీ తుపాకుల రవిసత్యానందం తన ఉదారతను చాటుకుని సీఆర్ కాలనీలోని పేదలకు నిత్యావసరాలను అందించటం సంతోషకరమని తెలిపారు. ట్రస్ట్ ట్రస్టీ రవి సత్యానందం మాట్లాడుతూ తన తోటి స్నేహితులతో కలిసి ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వీరామ్స్, సంసోన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బీరువాలోని నగలు, నగదు మాయం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన బీరువాలో ఉంచిన నగలు, నగదు మాయమయ్యాయని బాధిత దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. సంజీవయ్యనగర్ ఒకటో లైన్‌కు చెందిన పాతర్ల రవికుమార్ పారిశుధ్య కార్మికుడిగా పని చే స్తున్నారు. శుభకార్యానికి వెళ్లి 30వ తేదీ రాత్రి ఇంట్లోనే గదిలో ఉన్న బీరువా లాకర్‌లో 25 గ్రాముల బంగారం, 30 వేల నగదు దాచుకున్నారు. 31న బీరువా తెరిచి చూడగా లాకర్‌లో నగలు, నగదు కనిపించలేదు. దీనిపై అరండల్ పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా తమకు ఎటువంటి న్యాయం జరగలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాంకులో ఉద్యోగం ఇస్తానని మోసం

తన కుమారుడుడికి ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని తన అల్లుడు రూ.2లక్షలు తీసుకొని మోసం చేశాడని కాకాని రోడ్డులోని నవభారత్ కాలనీ ఒకటవ లైన్ కు చెందిన జొన్నలగడ్డ విజయ కుమారి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తన పెద్ద కుమారుడు ప్రశాంత్‌కు హైదరాబాద్‌లోని ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకుని ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే విడతల వారీగా 42 వేలు తిరిగి ఇచ్చాడని, మిగిలిన డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యాపారం పేరుతో డబ్బు తీసుకొని మోసం

తన క్లాస్‌మేట్ అయిన దేవరకొండ జాన్‌పాల్ తనతో వ్యాపారం ప్రారంభించి భాగస్వామిగా ఉంటూ తనను మోసం చేశాడని బుచ్చయ్యతోట 5వ లైనుకు చెందిన తుమ్మల హరీష్ అనే దివ్యాంగుడు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. తన క్లాస్‌మేట్ అయినా జాన్‌పాల్ ఇరువురం కలిసి వ్యాపారం చేద్దామని చెప్పి అరండల్‌పేట 9/2లో విశ్వతేజ అపార్ట్మెంట్లో గది అద్దెకు తీసుకున్నామన్నారు. ఇందుకుగాను తాను రూ.2 లక్షల 27 వేలు పెట్టుబడి పెట్టానని కొద్ది కాలం తర్వాత జాన్ పాల్ తనను దూరం పెడుతూ వచ్చాడన్నారు. దీంతో తన డబ్బు తిరిగి ఇవ్వమని కొత్తపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా లక్షా78 వేలు ఇస్తానని ఒప్పుకుని ఇవ్వలేదని దివ్యాంగుడు తన ఫిర్యాదులో వాపోయారు.

ఎలుకల మందు తిని వాచ్‌మన్ మృతి

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పండరీపురం రెండో లైన్లో గల అపార్ట్మెంటుకు వాచ్‌మన్‌గా పనిచేస్తున్న శిఖరం సంసోను (42) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసరావుపేట పరిధిలోని కేసానిపల్లికి చెందిన సంసోను కొద్ది సంవత్సరాలుగా భార్య, ఇరువురు పిల్లలతో బతుకుదెరువు కోసం గుంటూరు వచ్చాడు. ఈనెల 14న రాత్రి ఎలుకల మందు తీసుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పట్టాభిపురం పోలీసుల విచారణలో చెప్పాడు. అప్పటి నుంచి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుమారుడు చార్లెస్ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏ సమస్య ఉన్నా పోలీస్‌స్టేషన్లో సంప్రదించండి : వెస్ట్ డీఎస్పీ

వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీస్ స్టేషనను సంప్రదించి తన న్యాయం పొందాలని వెస్ట్ డీఎస్పీ అరవింద్ సూచించారు. సోమవారం రాత్రి నగరం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావు తోట 60 అడుగుల రోడ్డులో ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. సమావేశంలో నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు

ఆస్తి వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎన్టీఆర్ కాలనీకి చెందిన మూడావత్ సాంబశివరావు కుటుంబానికి, అతని మేనత్త కుటుంబానికి పూర్వీకుల ఉమ్మడి ఆస్తి విషయమై తగాదాలు జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం మేనత్త, మరి కొందరు కలిసి సాంబశివరావు, అతని తండ్రిపై రాళ్లతో దాడి చేసి కొట్టి గాయపరిచారు. ఇదే విషయమై మూడావత్ సాంబశివరావు, మరికొందరు కలిసి మేనత్తను కొట్టినట్టు ఇరువురి ఫిర్యాదులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ద్విచక్ర వాహనాలు దహనం

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవి తక్కెళ్ళపాడు టిడ్కో గృహాల వద్ద ఆదివారం అర్ధరాత్రి రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో దగ్ధమయ్యాయి. బాధితుడు కర్రా సింధు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింధు ఈ నెల 16న రాత్రి ఇంటికి వచ్చిన బి6 బ్లాక్ ఎదురుగా ఆటో పార్క్ చేసి ఇంటికి వెళ్ళాడు. అక్కడే ఆయన భార్య యాక్టివా కూడా పార్క్ చేసి ఉంది. అర్ధరాత్రి దాటిన గుర్తు తెలియని వ్యక్తులు దురుద్దేశంతో నిప్పు పెట్టినట్లు బాధితులు వాపోయారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవాలు



రవీంద్రనగర్ శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

గుంటూరు(తూర్పు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తికమాస ముగింపు సందర్భంగా సోమ వారం భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలు, యువ తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నగరంలోని రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు, బృందావన్‌గార్డెన్స్, సంపత్‌నగర్ ఇతర ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

ఆకట్టుకున్న కుమార సంభవం నృత్యరూపకం

గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కార్తికమాసం సందర్భంగా గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో కుమార సంభవం కూచిపూడి నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, గుళ్ళపల్లి సుబ్బారావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంస్థ వారు భాగవతుల వెంకటరామశర్మ దంపతులను, శిష్యబృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను సేవాసంస్థ కన్వీనర్ రాఘవరావు పర్యవేక్షించారు.

సీఐఐ సమ్మిట్‌తో పెట్టుబడులు, ఉద్యోగాల వెల్లువ

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సక్సెస్ అవ్వడంతో రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాల వెల్లువ రాబోతోందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి కారణంగానే సదస్సు అంత గొప్పగా విజయవంతమైందన్నారు. రాక్షస పాలన అంతం అవ్వడంతో పారిశ్రామికవేత్తల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగి పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద ఎత్తున క్యూ కట్టారని, సదస్సుల్లో 613 ఎంవోయూలు ద్వారా రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రాగా 16 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశం లభిస్తుందని చెప్పారు. అభివృద్ధిని రాష్ట్రమంతటా విస్తరిస్తూ అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాజధాని అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమౌతోందన్నారు. ప్రతిష్టాత్మకమైన క్వాంటం వ్యాలీని అమరావతిలోనే ఏర్పాటు చేయడాన్ని ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. రైట్ ప్లేస్, రైట్ పీపుల్, రైట్ ఇండస్ట్రీ పద్ధతిలో ప్రభుత్వం పెట్టుబడులను ప్రాంతాల వారీగా విభజించి వికేంద్రీకరణ చేయడం గమనార్హమన్నారు. ట్రైలర్‌కే జగన్ వెన్నులో వణుకు మొదలయ్యిందని ఎమ్మెల్యే మాధవి ఎద్దేవా చేశారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం కలిచివేసింది

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ తీవ్ర దిగ్భ్రాంతి



ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సౌదీలో రోడ్డు ప్రమాద ఘటనపై తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పవిత్ర హజ్ యాత్రకు కుటుంబాలతో కలిసి సంతోషంగా బయలుదేరిన వారు మధ్యలోనే విగతజీవులుగా మారడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 45 మంది హైదరాబాద్ వాసులే కావడం, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలను విషాదంలో ముంచెత్తిందన్నారు. మృతుల్లో 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 18 మంది మృత్యువాత పడ్డారని, ఇది తనను కుంగదీసిందని ఆవేదన చెందారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వంతోపాటు సౌదీ ప్రభుత్వం కూడా అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. మృతి చెందిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. తమ కుటుంబ సభ్యులు, ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

మక్కా యాత్రికుల బస్సు ప్రమాదం బాధాకరం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మక్కా యాత్రకు వెళ్ళిన హైదరాబాద్ వాసులు బస్సు ప్రమాదానికి గురై 42 మంది మృతి చెందటం బాధాకరమని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మక్కా యాత్రలో బస్సు ప్రమాదం జరగటం తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని, మృతుల కుటుంబ సభ్యులకు తాను ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు.

19న హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్

గుంటూరు (విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఆదర్శ పేరుతో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ పీఎం ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ డాక్టర్ పీఎం ప్రసాద్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సుష్మ తదితరులు సోమవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. స్పోర్ట్స్ ఫెస్ట్‌లో ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ చెరువు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

పర్యావరణంపై బాలికలకు వ్యాసరచన పోటీలు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వీబీ ప్రసాద లింగం, చావా బోస్

గుంటూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న మహిళా గ్రంథాలయంలో పర్యావరణంపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి శిశు సంక్షేమ శాఖ మాజీ సూపరింటెండెంట్ వీబీ ప్రసాద లింగం, విద్యాశాఖ మాజీ అధికారి చావా బోస్, మాజీ ఉపాధ్యాయుడు ఎన్.రామారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58 వారోత్సవాలు నగరంలో ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక బృందావన్ గార్డెన్స్, గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు చావ బోసు, విశ్రాంత స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వి.బి. ప్రసాద్ లింగంను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత, గ్లోబల్ వార్మింగ్ అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి. శకుంతల, సిబ్బంది పి. కోటేశ్వరి పి. సుధాకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పట్టాభిపురం శాఖ గ్రంథాలయంలో ఇమ్రాన్ ఖాన్ న్యాయ నిర్ణేతగా పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి పి.సత్య శిరీష గ్రంథాలయ ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎస్ ప్రియ, హరి తదితరులు పాల్గొన్నారు. ఎస్వీఎన్ కాలనీ గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్ని గ్రంథాలయాధికారి పి.సుభాషిణి పర్యవేక్షించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

గుంటూరు (విద్య) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలు సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగం విద్యార్థులకు భారత రాజ్యాంగ దినోత్సవం అనే అంశంపై, సీనియర్స్ విభాగం వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై, కళాశాల స్థాయి విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు 20న బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ తెలిపారు.



వెలలేనివి వీరి సేవలు

● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో, నవమాసాలు మోసి కన్న బిడ్డ మనో వైకల్యంతో పుడితే ఏ తల్లి గుండె బద్దలు కాకుండా ఉంటుంది.. ఆమె గుండె కోతను మాన్పడం ఎవరి తరమౌతుంది. అదుగో అలాంటి కడుపుకోతను ఈ అమ్మలు అనుభవించారు. తమ బిడ్డ అందరిలా లేడని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. కానీ అది తమ సమస్యకు పరిష్కారం కాదని గ్రహించారు. తామే టీచర్లుగా మారి తమ బిడ్డతో పాటు మరెంతోమంది మనోవైకల్యంతో బాధపడుతున్న పిల్లల్లో మార్పు కోసం కృషి చేస్తున్నారు. అమ్మే ఆదిగురువు అని నిరూపిస్తున్నారు. మనోవైకల్యంతో ఉన్న పిల్లలకు వెలలేని సేవలు అందిస్తున్నారు. పట్టణంలోని పెద్ద చెరువులో ప్రత్యేక అవసరాల కోసం ఉన్న ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌లో పట్టణానికి చెందిన కొంతమంది మనోవైకల్యంతో ఉన్న తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి వచ్చారు. తర్వాత తమ బిడ్డకు ఉపయోగపడుతుందని స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొంది, ఇప్పుడు ఇదే పాఠశాలలో టీచర్లుగా చేరి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన చేస్తున్నారు.

అందరూ ఓర్పుతో సేవ చేస్తున్నారు



ఇక్కడ పనిచేసే టీచర్లలో ఎక్కువ మంది అలాంటి పిల్లల తల్లులే. వాళ్ల బాబును చేర్పించడానికి వచ్చి టీచర్లుగా మారారు. మా కాలేజీలోనే వాళ్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ ఇప్పించి టీచర్‌గా రిక్రూట్ చేసుకున్నా. వాళ్ల బాబుతో పాటు ఇక్కడి పిల్లలకు ఎంతో ఓర్పుతో సేవ చేస్తున్నారు. అలాంటి టీచర్లు పది నుంచి పదిహేను మంది దాకా ఉన్నారు.

-ఇందిర, ప్రిన్సిపాల్, ఇంటిగ్రేటెడ్ హైస్కూల్

బాబులో మార్పు వస్తోంది

● శివపార్వతి, టీచర్

మాది మేనరిక వివాహం. బాబు పుట్టిన సంవత్సరం దాకా ఎలాంటి మార్పు లేకపోవడంతో డాక్టర్లకు చూపించాం. డాక్టర్లు సెరిబ్రల్ పాల్సీ అని చెప్పారు. అప్పుడు మేము పడ్డ బాధ పగవాడికి కూడా వద్దు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. దేవుడు మాకే ఎందుకిలా చేశాడని బాధ పడ్డాం. తర్వాత తెల్సినవాళ్లు చెబితే ఇక్కడ చేర్పించాం. నేను డిగ్రీ చదివా. స్పెషల్ ఎడ్యుకేషన్ చేస్తే బాబుకు ఉపయోగపడుతుందని భావించా. ఇప్పుడు ఇక్కడే టీచర్‌గా చేస్తూ మా బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేస్తున్నా. బాబులో మార్పు వచ్చింది. బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.





దేవుని సేవ చేస్తున్నట్లుంది

● వింధ్యారాణి, టీచర్

నా పేరు వింధ్యారాణి. మావారు గవర్నమెంట్ టీచర్. నాకు ఇద్దరు బాబులు. పెద్దబ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా రెండో అబ్బాయికి సెరిబ్రల్ పాల్సీతో ఎదుగుదల ఆగిపోయింది. మొదట మేం చాలా బాధ పడ్డాం. మెల్లగా బాధను మర్చిపోయి ఇక్కడ చేర్పించాం. నేను ఎమ్మెస్సీ ఎంఈడీ చేశాను. రోజూ మా బాబు కోసం ఇక్కడకు వస్తున్నప్పుడు నేనే స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి నా బాబుతో పాటు ఇంకొంతమంది పిల్లలకు సేవ చేయొచ్చుకదా అనిపించింది. కోర్సు కంప్లీట్ చేసి ఇక్కడే టీచర్‌గా ఉంటూ మా బాబుతో పాటు ఇలాంటి పిల్లలకు బోధిస్తున్నాను. ఇలాంటి పిల్లలకు బోధించడం దేవుని సేవ చేస్తున్నట్లుగా ఉంది.

బాబు కోసం ఫిజియో థెరపిస్టుగా మారా

● కోమలి, అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

మా బాబుకు సెరిబ్రల్ పాల్సీ రావడంతో కదలికలు సరిగ్గా చేయలేకపోయేవాడు. ఫిజియోథెరపీ చేయించడానికి ఇక్కడికి తీసుకొచ్చేదాన్ని. థెరపీ చేయించాక కొంచెం మార్పు కన్పించింది. రోజూ వస్తున్నప్పుడు ఫిజియోథెరపీలో శిక్షణ పొందితే బాబుకు ఉపయోగపడుతుందని, ట్రైనింగ్ పొందా. తర్వాత ఇక్కడే అసిస్టెంట్‌గా చేరా. ఇప్పుడు బాబుతో పాటు మిగతా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్నా. బాబులో మార్పు వస్తుంది.





మల్కాపురం చెరువు కట్ట పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

మల్కాపురం చెరువు ప్రక్షాళన

● ఏడీసీ ఆధ్వర్యంలో పనులు

తుళ్లూరు (మల్కాపురం), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రాజధాని గ్రామం మల్కాపురం చెరువు ప్రక్షాళనకు ఏడీసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఎస్టీ కాలనీ చెంతనే ఈ చెరువు నెలకొని ఉంది. పూర్వం కాకతీయులు కాలంలో రాణిరుద్రమ్మ దేవి ఏలుబడిలో మందడం (మందారం) మల్కాపురం ప్రాంతాలుండేవని చరిత్ర చెబుతోంది. ఇప్పుడు ఉన్న ఎస్టీ కాలనీలో శివాలయం, రాణి రుద్రమ్మ దేవి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా శాసనం ఇప్పటికీ ఉన్నాయి. అక్కడే కోనేరుండేదని చెబుతున్నారు. ఇప్పుడు ప్రక్షాళన చేస్తున్న చెరువే.. ఆ కోనేరని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాలక్రమంలో కోనేరు కాస్త మురుగు చెరువుగా మారింది. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్, పక్కన ఎస్టీ కాలని వాసుల ఇళ్లలోని మురుగు నీరు ఈ చెరువులోకి చేరి దుర్గంధం వెదజల్లుతుండేది. దశాబ్దాల కాలంగా సమస్య అలాగే ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు శివాలయం శిలాశాసనం సందర్శించి చెరువును ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత ఎన్నికల సమయం దగ్గర పడటంతో విషయం మరుగున పడింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మురుగు చెరువు ప్రక్షాళనకు అడుగులు పడ్డాయి. మురుగు నీరు అంతా బయటకు పంపి చుట్టూ కట్టలను బలంగా వేస్తున్నారు. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్ చెరువులోకి రాకుండా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) వారు అమరావతి నగర బ్యూటిఫికేషన్ కింద మల్కాపురం చెరువును ఆహ్లాదకరంగా మలచనున్నారు.

వినుకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

● మరో డాక్టర్‌కు షోకాజ్ నోటీసులు

వినుకొండటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయనను వైద్యశాఖ డైరెక్టర్ చక్రధర్ బాబు సస్పెండ్ చేసినట్లు సోమవారం వైద్యశాల సిబ్బంది తెలిపారు. గతంలో శ్రీనివాసరెడ్డిపై మహిళా డాక్టర్లు పలు ఆరోపణలు చేస్తూ వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ ప్రసూన వినుకొండ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందచేశారు. దాని ఆధారంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. మరొక డాక్టర్ సుధాకర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చారిత్రక శాసనాలపై అధ్యయనం



వెలుగుచూసిన రాగిశాసనాలు

(బాపట్ల, చెరుకుపల్లి-ఆంధ్రజ్యోతి)

చారిత్రక శాసనాలను రక్షించడంతో పాటు వాటిపై అధ్యయనం చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ (మైసూర్) మునిరత్నం రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని అగ్రహారంలో వెలుగుచూసిన రాగిశాసనాల సాఫ్ట్ కాపీ ప్రతులు ఆయా వంశస్థుల దగ్గర నుంచి అందినట్లు ఏఎస్ఐ డైరెక్టర్ ధ్రువీకరించారు. శాసనాలు సంస్కృతం, తెలుగు లిపిలో రాసి ఉన్నట్లు ఆయన వివరించారు. అష్టాంగ ఆయుర్వేద వైద్యం గురించి ఓ శాసనంలో తెలిపినట్లు గుర్తించామన్నారు. వాటిని డీ కోడింగ్ చేయడంపై కసరత్తు జరుగుతోందని, చారిత్రక శాస నాల సమాచారం ఏదైనా అందుబాటులో ఉంటే వెంటనే ఆర్కియాలజీ విభాగానికి తెలపాలన్నారు. త్వరలోనే పొన్నపల్లి గ్రామ అగ్రహారాన్ని పు రావస్తుశాఖ అధికారుల బృందం సందర్శించడంతో పాటు ఆ శాసనాలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరుగుతుందని డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు.

● అగ్రహారానికి చారిత్రక నేపథ్యం

చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్ పూర్వీకులు 14వ శతాబ్దంలో కొండవీడును పరిపాలించిన రెడ్డి రాజుల ఆస్థానంలో వేద పండితులుగా, ఆయుర్వేద వైద్యులుగా సేవలందించారు. కొండపల్లి అగ్రహారాన్ని దానంగా పొందిన వారసుల్లో ఒకరు విద్యాభాస్కర్ కాగా, ప్రస్తుతం రాగి శాసనాలను వెలుగులోకి తెచ్చి వాటిపై అధ్యయనం చేయాలని ఆర్కియాలజీ విభాగాన్ని కోరుతూ వివరాలందించారు. 700 ఏళ్ల తర్వాత కూడా ఆ నాటి రాగి శాసనాలు చెక్కుచెదరకుండా గత వైభవానికి ప్రతీకలుగా నిలవడం గమనార్హం.

సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం



లంకా సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తిరుపతిలోని ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం - ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా చేపట్టిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్ అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పాండ్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు. గ్రంథాలయానికి, పుస్తక విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాబోయే తరానికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సాహిత్యవేత్తలు కోట పురుషోత్తం, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభీషణ శర్మ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు, లంకా సూర్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

● కార్తికమాసం చివరి సోమవారాన భారీగా తరలివచ్చిన భక్తులు



భక్తులతో పోటెత్తిన పెదకాకాని శివాలయం

అమరావతి/పెదకాకాని/బాపట్ల/నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి సోమవారాన జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పెదకాకాని మల్లన్న సన్నిధికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి, భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగంలో ప్రదక్షిణలు చేసి కార్తిక మాస దీపారాధనలు చేశారు. అనంతరం శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండ ఆలయ ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయం ద్వారా రూ.9 లక్షల 10 వేల ఆదాయం వచ్చిందని ఉపకమీషనర్ తెలిపారు. కాగా, స్వామి వారిని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని దంపతులు దర్శించుకున్నారు.

భక్తజన సంద్రంగా అమరేశ్వరాలయం

కార్తికమాసం చివరి సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు వెలిగించిన కార్తికదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి నదీ తీరంలో కార్తిక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. సాయంత్రం వరకు భక్తుల రాకతో క్యూలైన్‌లు రద్దీగానే ఉన్నాయి. ఆలయంలో ఏర్పాట్లను ఈవో రేఖ పర్యవేక్షించారు.

జనసంద్రంగా సూర్యలంకతీరం

కార్తికమాసం చివరి సోమవారం సూర్యలంకతీరం జనసంద్రంగా మారింది. భక్తులు తెల్లవారుజామునే సముద్రస్నానాలు ఆచరించి సూర్యనమస్కారాలు చేసి ఇసుకతో శివలింగాలు అలంకరించారు. కార్తికదీపాలు వెలిగించి మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, గజఈతగాళ్ళు తీరంలో గస్తీ నిర్వహించారు.

● ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తిక మాస చివరి సోమవారం భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



అమరావతి : క్యూలో బారులు దీరిన భక్తులు

కోటి దీపోత్సవం

రాజధాని అమరావతి నిర్మాణం పూర్తిచేసుకుని వెలుగొందాలని ఆకాంక్షిస్తూ అమరేశ్వరాలయంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హిందూ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జ్ఞానతి, వైష్ణవి, పుణ్యవతి, లక్ష్మీ ప్రణతి కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు.



రోడ్డు ప్రమాదాల అడ్డుకట్టకు ప్రణాళిక

● హైవేపై 12 కీలక ప్రమాద ప్రాంతాలు గుర్తింపు ● ఎన్‌హెచ్‌ఏఐకు నివేదిక ● సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌత్ సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సౌత్ డీఎస్పీ భానోదయ వెల్లడించారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలో 28 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారి ఉందన్నారు. ఇందులో 12 కీలకమైన ప్రమాద ప్రాంతాలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఇందుకు గాను క్షేత్ర స్థాయిలో పర్యటించడంతో పాటు నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అందుకు గల కారణాలను విశ్లేషించామన్నారు. దీనిలో భాగంగా సోమవారం సౌత్ సబ్-డివిజన్ పరిధిలోని నల్లపాడు, ప్రతిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై అధికారుల బృందం సమగ్ర పర్యటన నిర్వహించింది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలు (బ్లాక్‌స్పాట్స్)ను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాద నివారణ చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు ప్రారంభించామన్నారు. ఈ మేరకు ఆయా ప్రమాద స్థలాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే హెచ్చరిక బోర్డులు, సూచిక చిహ్నాలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రమాద ప్రాంతాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారి రూపకల్పనలో అవసరమైన ఇంజనీరింగ్ మార్పులపై సాంకేతిక అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. పాదచారుల భద్రత కోసం పాదచారి మార్గాలు, జీబ్రా క్రాసింగ్‌లు, అవసరమైతే ఫుట్ ఓవర్ బ్రిడ్జీల ఏర్పాటుకు పరిశీలించాల్సి ఉందన్నారు. అధిక ట్రాఫిక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరంపై చర్చించారు. ఈ అధ్యయనం ఆధారంగా ఒక ప్రత్యేక సాంకేతిక నివేదికను తయారు చేసి, దాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు సమర్పించనున్నట్లు డీఎస్పీ భానోదయ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా రహదారి భద్రతా చర్యలు మరింత వేగంగా అమలులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి, ఎన్‌హెచ్‌ఏఐ సీనియర్ ఇంజనీర్ దత్తాత్రేయ, నల్లపాడు సీఐ వంశీధర్, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నల్లపాడు స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్

సమాజాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

● విశాఖ కో-ఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం

వట్టిచెరుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సహకార సంఘాలు కీలక సేవలు అందిస్తున్నాయని కోఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. భారత ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు భారతీయ సహకార సంఘాల వారోత్సవాలను ప్రకటించిన నేపథ్యంలో.. వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట సమీపంలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కోఆపరేటీవ్ బిల్డ్ ప్రాస్పరిటీ ఫర్ ఆల్ అనే అంశంపై పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ది విశాఖపట్నం కో-ఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ గుంటూరు శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు హాజరై సహకార సంఘాల పాత్రలను వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ సహకార సంఘ బ్యాంకులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు, చిరు వ్యాపారులకు సరళమైన రుణాలు అందిస్తున్న విధానాలను వివరించారు. బ్యాంక్ సిబ్బంది పీజీ విద్యార్థులతో కలసి సహకార సంఘాల వారోత్సవాల లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి కల్యాణ చక్రవర్తి, ఎంబీఏ, ఎంసీఏ అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ది విశాఖపట్నం కోఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులును సన్మానిస్తున్న మలినేని యాజమాన్యం



ఆయుర్వేదం

చలికాలంలోని చల్లని వాతావరణం జీర్ణశక్తిని బలపరిచినా, వాత పిత్త, దోషాల మధ్య సంతులనానికి సవాలు విసురుతుంది. ఫ లితంగా తలెత్తే ఆరోగ్య సమస్యల మీద ఓ కన్నేసి ఉంచి, వాటిని సకాలంలో పరిష్కరించుకుంటూ ఉండాలి.

చలిలో చక్కని ఆరోగ్యం

చలికాలం వాతాన్ని (పొడి, చలి), కఫాన్నీ (భారం, కఫం) పెంచుతుంది. జీర్ణాగ్ని అయిన అగ్ని పోషణకూ, పునరుజ్జీవానికీ చలికాలమే అనువైన సమయం. అయితే పెరిగిన జీర్ణాగ్ని, శక్తిని సక్రమంగా సంతులనం చెందనప్పుడు, కీళ్ల నొప్పులు, సైనస్ సమస్యలు, నిస్సత్తువ రూపాల్లో సంతులనం తలెత్తుతుంది. కాబట్టి మన శరీరం, మనసు సంతులనంగా ఉండడం కోసం ఏడు సూత్రాలను పాటించాలి. అవేంటంటే...

- **ఆహారం:** వేడిగా ఉండే పోషకాహారం తీసుకోవాలి. నెయ్యి జోడించి తినొచ్చు. చిరుధాన్యాలు, సూప్స్, కూరగాయలు తినాలి. చల్లని, చద్ది పదార్థాలకు దూరంగా ఉండాలి. వీటితో వాత, కఫాలు దెబ్బ తింటాయి
- **నీళ్లు:** రోజంతా గోరువెచ్చని నీళ్ల తాగుతూ ఉండాలి. వేడి నీళ్లతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరం నుంచి విషాలు బయటకు వెళ్లిపోతాయి. చల్లని నీళ్ల అగ్నిని బలహీనపరుస్తాయి కాబట్టి చల్ల నీళ్లకు దూరంగా ఉండాలి
- **శ్వాస:** అనులోమ విలోమ శ్వాస ప్రక్రియలు సాధన చేయాలి. భ్రమరి ప్రాణాయామంతో ఊపిరితిత్తులు బలపడి, నాడీ వ్యవస్థ నెమ్మదిస్తుంది
- **శరీర శోధన:** నూనెతో మర్దన చేసుకునే అభ్యంగ, మూలికలను స్క్రబ్‌గా వాడుకునే ఉద్వర్తనం, ఆవిరి చికిత్స అయిన స్వేదనలతో రక్తప్రసరణ మెరుగ్గా ఉండి శరీరం నుంచి విషాలు బయటకు వెళ్లిపోతాయి
- **మనస్శుద్ధి:** ప్రతి రోజూ ధ్యానం చేయాలి. ప్రశాంతమైన మనసుతో వ్యాధినిరోధకశక్తిని పెరుగుతుంది
- **ఆత్మ పోషణం:** ప్రకృతితో అనుసంధానం కావాలి. ఎండలో గడపడం, ఆధ్యాత్మిక సాధనలు అంతర్గత ప్రశాంతతను, సంతృప్తినీ పెంచుతాయి
- **అభ్యాస:** క్రమశిక్షణతో మెలగాలి. సమయానికి భోజనం, నిద్ర తప్పనిసరి. నిబద్ధతగా నడుచుకోవాలి.

వ్యాధుల బెడద

ఈ కాలంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా పిల్లలు, పెద్దలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, ఊపిరితిత్తుల సమస్యలున్నవాళ్లు ఈ కాలంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి

- **పెద్దలు:** రక్తప్రసరణ బలహీనంగా ఉండడం వల్ల వీరిలో కీళ్లు బిగుసుకుపోతాయి
- **పిల్లలు:** వ్యాధినిరోధకశక్తి పెరుగుతున్న దశలో ఉండే పిల్లలు సులభంగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు
- **రోగులు:** మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వ్యక్తులు సులభంగా చలి ప్రభావానికి లోనవుతారు



- **ఆస్తమా, సైనస్, ఆర్థ్రయిటిస్:** ఈ కాలంలో ఈ కోవకు చెందినవాళ్ల కఫ, వాత దోషాలు పెరుగుతాయి.

కాబట్టి ఈ కోవలకు చెందిన వాళ్లు గోరువెచ్చని నూనెతో మర్దన చేసుకుంటూ, సమతులాహారం తీసుకుంటూ, సరిపడా విశ్రాంతిలో గడుపుతూ ఉండాలి.

ఈ ఔషధాలు అందుబాటులో...

- **చ్యవనప్రాశం:** వ్యాధినిరోధకశక్తి, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది
- **దశమూలారిష్ఠ:** దగ్గు, జలుబు, నిస్సత్తువలు తగ్గుతాయి
- **త్రిఫల చూర్ణం:** జీర్ణశక్తి పెరుగుతుంది, విషాలు విరుగుడవుతాయి
- **రస్నాది చూర్ణం:** సైనస్, తలనొప్పులు అదుపులోకొస్తాయి
- **అమృతారిష్ఠం:** జ్వర నివారిణి
- **అను తైలం** (ముక్కులో వేసుకునే చుక్కల మందు): చల్లగాలితో సోకే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ దక్కుతుంది

శీతాకాల కషాయాలు

శీతాకాలంలో చోటుచేసుకునే కఫ, వాత దోషాలను హరించే కషాయాలు ఇవే!

- **దశమూల కషాయం:** కీళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు అదుపులోకొస్తాయి
- **త్రికటు కషాయం:** జీర్ణశక్తి, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతాయి
- **కాంతాకారి కషాయం:** ఉబ్బసం, దగ్గు తగ్గుతాయి

మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే?

ఈ కాలంలో మధుమేహులు, అధిక రక్తపోటు కలిగినవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

మధుమేహులు ఇలా...

- తీపి పదార్థాలు, నూనెలో వేయించిన పదార్థాలు మానేయాలి
- మెంతులు, ఉసిరి, పసుపు, గుర్మర్ తీసుకోవాలి
- ఎండలో నడవాలి, సరిపడా గోరువెచ్చని నీళ్ల తాగుతూ ఉండాలి

అధిక రక్తపోటు ఉంటే...

- తీవ్రమైన చలికీ, మానసిక ఒత్తిడికీ దూరంగా ఉండాలి
- ప్రాణాయామం సాధన చేయాలి. ప్రత్యేకించి అనులోమ, విలోమ, భ్రమరి సాధన చేయాలి
- అర్జున, అశ్వగంధ, సర్పగంధ, బ్రహ్మి మొదలైన మూలికలు సంతులనాన్ని పెంచుతాయి

ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలుంటే?

ఆయుర్వేదం ఈ సమస్యలను.. చల్లదనంతో పెరిగే కఫ, వాత సమస్యలుగా పరిగణిస్తుంది. వీటిని అధిగమించడం కోసం....

- తులసి, వాస లేదా యూకలిప్టస్ ఆకులు వేసి మరిగించి, ఆవిరి పట్టాలి
- అగస్త్య రసయానం, వాసవలేహ, కాంతకారి కషాయాలు ఊపిరితిత్తులను బలపరుస్తాయి
- చల్లదనం, పాల ఉత్పత్తులు, ఫ్రిజ్ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
- ఉదయం నీరెండలో ప్రాణాయామం చేయగలిగితే, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది
- ప్రతి రోజూ ధన్వంతరం తైలంతో అభ్యంగనం చేస్తే, రక్తప్రసరణ, రోగ నిరోధకశక్తి పెరుగుతాయి.

డాక్టర్ శ్రీవర్మ
శ్రీవర్మ ఆయుర్వేద, చెన్నై.



లిప్‌స్టిక్‌లో విషాలు

కొన్ని ప్రముఖ లిప్‌స్టిక్స్, లిప్‌గ్లాస్‌ల్లో ఆరోగ్యాన్ని దెబ్బతీసే మోతాదుల్లో విషపూరిత లోహాలు ఉంటున్నట్టు యుసి బెర్క్లీ అధ్యయనంలో వెల్లడైంది.

లిప్‌స్టిక్స్, లిప్‌గ్లాస్‌ల్లో సీసం, క్యాడ్మియం, క్రోమియం, అల్యూమినియం ఇతరత్రా లోహాల అవశేషాలు ఎక్కువ మోతాదుల్లో ఉంటున్నట్టు శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఎంతో అరుదుగా ఈ సౌందర్య సాధనాలను వాడేవారితో పోలిస్తే, తరచూ వీటి మీద ఆధారపడేవారిలో క్యాన్సర్ కారకమైన క్రోమియం, నాడీ వ్యవస్థను దెబ్బతీసే మాంగనీసు ముప్పు ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. వీటికి పదే పదే బహిర్గతమవడం మూలంగా నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. 24 ప్రముఖ లిప్‌స్టిక్స్‌లో సీసం, నిర్దేశిత మోతాదులకు మించి ఎంతో ఎక్కువగా ఉంటుందనీ, ఈ లిప్‌స్టిక్స్‌ను మరీ ముఖ్యంగా పిల్లలు ఉపయోగించడం వల్ల వారికి ముప్పు కూడా అంతే ఎక్కువగా ఉంటుందనీ శాస్త్రవేత్తలు అంటున్నారు. యూరోపియన్ యూనియన్, ఇలాంటి లిప్‌స్టిక్స్ మీద నిషేధం విధించింది. ఇదే తరహా ప్రమాణాలను ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి తీసుకురావడం మంచిదనీ, లిప్‌స్టిక్ లాంటి సౌందర్య సాధనాలను క్రమబద్ధీకరించవలసిన అవసరం ఉందనీ యుసి బెర్క్లీ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మీకు తెలుసా?

పురోగతి

జీన్ థెరపీతో బరువు తగ్గొచ్చు



శరీరం స్వయంగా జిఎల్‌పి-1 హార్మోన్‌ను ఉత్పత్తి చేసుకునేలా శరీరాన్ని రీప్రోగ్రామ్ చేయగలిగే మార్గాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఫ్రాక్టైల్ హెల్త్, రెన్‌బయో అనే రెండు బయోటెక్ స్టార్టప్స్, కణాలను జిఎల్‌పి-1 కర్మాగారాలుగా మార్చే జీన్ థెరపీ విధానాలను పరీక్షిస్తున్నాయి. ఎలుకల్లో ఈ చికిత్స సత్ఫలితాలను అందించి, బరువు తగ్గిస్తోంది. అవి మూడు వారాల వ్యవధిలో శరీరంలో 20% బరువును కోల్పోవడాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అదే సమయంలో అధిక కొవ్వు ఆహారాన్ని తిన్నప్పటికీ ఆ ఎలుకల్లో రక్తంలో చక్కెర మోతాదులు అదుపులోకొచ్చి, బరువు అదుపులో ఉంటున్నట్టు కూడా శాస్త్రవేత్తలు కనిపెట్టడం జరిగింది. జిఎల్‌పి-1 మందుల ప్రభావాలను, ప్రయోజనాలను కనిపెట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రయోగాల ద్వారా బరువు తగ్గడంతో పాటు, రక్తంలో చక్కెర మోతాదు నియంత్రణ, గుండెకు రక్షణ దక్కడం అనే అంశాల మీద శాస్త్రవేత్తలు దృష్టి పెడుతున్నారు. అయితే జన్యు చికిత్సతో కొన్ని ముప్పులు పొంచి ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారానికోసారి తీసుకునే ఇంజెక్షన్లతో పోలిస్తే, ఈ చికిత్సలు తిరిగి సరిదిద్దే వీలు కల్పించవనీ, పాంక్రియాస్‌కు దీర్ఘకాలిక ముప్పులు తెచ్చిపెడతాయనీ హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఈ ప్రయోగాలు విజయవంతమైతే, మధుమేహం, ఊబకాయాలకు అందించే చికిత్సల్లో సమూల మార్పులొస్తాయి. ఈ రుగ్మతలకు దీర్ఘకాలిక మందులతో అందించే చికిత్సలకు బదులుగా అంతర్గత హార్మోన్ పునరుత్పత్తి చికిత్సలు అందుబాటులోకొస్తాయి.

వృద్ధాప్యం

మలి వయసులో...

పైబడే వయసుతో జీవితం బరువైపోకుండా ఉండాలంటే వయసురీత్యా వేధించే అస్వస్థతలను, అసౌకర్యాలను ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ ముందుకు సాగాలి! అప్పుడే వృద్ధాప్యం భారం కాకుండా ఉంటుంది.

అజీర్తికి అడ్డుకట్ట

పెరిగే వయసుతోపాటు అరుగుదల క్షీణిస్తుంది. కాబట్టి తేలికగా అరిగే పదార్థాలు తీసుకోవాలనే విషయం అందరికీ తెలిసిందే! 60 ఏళ్లు దాటినవాళ్లలో జీర్ణరసాలు తగినంత తయారు కావు. దాంతో ఆకలి కూడా తగ్గుతుంది. అలాగని సమతులాహారం తీసుకోకుండా ఉండిపోతే శరీర జీవక్రియలకు సరిపడా శక్తి అందదు. కాబట్టి ప్రొటీన్లు తక్కువగా, పిండిపదార్థాలు మధ్యస్తంగా, పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాలు, పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. తాజా పండ్లు, మజ్జిగ ప్రతిరోజూ తీసుకోవాలి. భోజనవేళలు క్రమంతప్పక పాటించాలి. రాత్రి భోజనం ఏడు గంటలలోపే ముగిస్తే అజీర్తి సమస్య తలెత్తదు. అలాగే రాత్రి భోజనం తేలికగా అరిగేదై ఉండాలి. నూనెలు, మసాలాలు లేని సాత్వికాహారం తినాలి. తీపి, కారం తగ్గించాలి. ఉడకబెట్టిన కూరగాయలతో రాత్రి భోజనం ముగిస్తే ఛాతీలో మంట, పుల్లని త్రేన్పులు లాంటి అజీర్తి సమస్యలు వేధించవు.

నిద్ర కంటి నిండా...

పెరిగే వయసుతో నిద్ర తరిగిపోవడం సహజమే! అయితే ఆ కొన్ని గంటలైనా కంటి నిండా నిద్ర పడితే ఫర్వాలేదు. కానీ కొందరికి నిద్రే పట్టకుండా పోతుంది. ఇలాంటివాళ్లు అందుకు అడ్డుపడుతున్న అంశాలను లోతుగా విశ్లేషించాలి. అనారోగ్యం కారణంగా నిద్ర కరవవుతుంటే ఆ విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి. మానసిక ఒత్తిడి, ఆందోళన ఉన్నా వాటిని పడగ్గది బయటే వదలేయడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు వరకూ పుస్తకం చదవడం, శ్రావ్యమైన సంగీతం వినడం చేయాలి. పడగ్గదిలో టీవీ, సెల్‌ఫోన్ తీసేయాలి. మనవలు, మనవరాళ్లతో కబుర్లు చెప్పడం, నచ్చిన పనులు చేయడం వల్ల మనసు తేలికై నిద్ర పడుతుంది. బాత్రూమ్ పడగ్గదిలోనే ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరం. అలాగే పడగ్గది కూడా సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి. లైట్, ఫ్యాన్ స్విచ్‌లు మంచానికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

కీళ్ల నొప్పులు లేకుండా...

కీళ్ల నొప్పులు లేకుండా వృద్ధాప్యాన్ని దాటలేం! అయితే అవి ఏ రకం కీళ్ల నొప్పులో తెలుసుకుని అందుకు తగిన వైద్య సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి. పెద్ద వయసులో ఈ నొప్పులు సహజమే అని ఊరుకోకుండా అవసరమైన మందులు వాడడం వల్ల నొప్పులు నియంత్రణలో ఉండి, జీనవ నాణ్యత దెబ్బతినకుండా ఉంటుంది. కొందరికి ఆర్థ్రయిటిస్, మరికొందరికి ఆస్టియో ఆర్థ్రయిటిస్... ఇలా రకరకాల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. ఈ నొప్పులను అదుపుచేసే మందులు వాడక తప్పదు. అయితే ఆ మందుల వల్ల మూత్రపిండాలు దెబ్బతినకుండా చూసుకోవాలి. వాడుతున్న మందులు ఎంత సురక్షితమో వైద్యులను



అడిగి తెలుసుకోవాలి. ఈ నొప్పినివారణ మాత్రలతోపాటు క్యాల్షియం సప్లిమెంట్లు కూడా వాడాలి. సోఫాలో కూర్చోవడం, పీట మీద కూర్చుని పూజ చేయడం, మోకాళ్లను వంచే పనులు చేయడం మానేయాలి. అలాగే నడక వల్ల కీళ్ల మధ్య బిరుసుతనం తగ్గుతుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం అరగంటపాటైనా నడవడం అలవాటు చేసుకోవాలి.

జ్ఞాపకశక్తి బలంగా....

పెద్ద వయసులో మతిమరుపు మామూలే అనుకోకూడదు. అందుకు కేంద్రమైన మెదడును చురుగ్గా ఉంచగలిగితే మతిమరుపును దూరం పెట్టవచ్చు. మరీ ముఖ్యంగా మెదడు కణాలు క్షీణించే అల్జీమర్స్ వ్యాధికి గురికాకుండా ఉండాలన్నా, మెదడును చురుగ్గా ఉంచే పనులు చేయాలి. ఇందుకోసం పజిల్స్ పూరించడం, నోటి లెక్కలు వేయడం లాంటివి చేస్తూ ఉండాలి. చేతిలో ఖాళీ సమయం బోలెడంత ఉంటుంది కాబట్టి అభిరుచులను సాధన చేయాలి. బొమ్మలు వేయడం, కథలు రాయడం, తోటపని చేయడం లాంటి పనులు చేయవచ్చు. వాల్‌నట్స్ మెదడు కణాలను బలోపేతం చేస్తాయి. కాబట్టి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే పండ్లు, నట్స్ ఎక్కువగా తింటూ ఉండాలి. పిల్లలతో కలిసి సరదాగా బ్రెయిన్ గేమ్స్ ఆడుతూ ఉండాలి. దగ్గరి వ్యక్తుల పేర్లు, తరచుగా తిరిగే దారులు మర్చిపోతున్నట్టు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి. ఈ లక్షణాలు అల్జీమర్స్ కావచ్చు. ఈ వ్యాధికి ఎంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే అంత మేలు!

వ్యాయామం అవసరమే!

ఓపిక లేదనే సాకుతో వ్యాయామం చేయడం మానకూడదు. ఈ వయసులో చమటలు కక్కేలా వ్యాయామం చేయనవసరం లేదు. కీళ్లు, కండరాలు కదిలేలా 30 నిమిషాలపాటు తేలికపాటి వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. ఇందుకోసం నడక ఎంచుకోవచ్చు. అయితే కాళ్లకు మెత్తని షూ వేసుకోవాలి. చెప్పులతో నడక శ్రేయస్కరం కాదు. నడిచే చోటు కూడా ఎత్తుపల్లాలు లేకుండా చదునుగా ఉండేలా చూసుకోవాలి. రద్దీ తక్కువగా ఉండి వాహనాలు లేని ప్రదేశాన్ని ఎంచుకోవాలి. తోడుగా ఎవరినైనా వెంటబెట్టుకుని వెళ్లడం మరింత క్షేమకరం! వ్యాయామానికి గంట ముందు, గంట తర్వాత ఎలాంటి ఘనపదార్థాలూ తీసుకోకూడదు. నీళ్లు ఎక్కువగా తాగాలి. శీతల పానీయాలు తీసుకోకూడదు.

స్వీయ రక్షణ ముఖ్యం!

పెద్ద వయసులో ఎముకలు విరిగితే అతుక్కోవడం కొంత కష్టం. పైగా ఈ వయసులో ఆస్టియోపొరోసిస్ కారణంగా ఎముకలు గుల్లబారి తేలికగా విరిగిపోతూ ఉంటాయి. కాబట్టి ఇంట్లో, బయటా నడకకు గ్రిప్ ఉండే చెప్పులే వాడాలి. మరీ ముఖ్యంగా బాత్రూమ్‌లో జారకుండా ఉండే టైల్స్ వేయించుకోవాలి. రాత్రివేళ మంచం పక్కనే టార్చిలైటు ఉంచుకోవాలి. మెట్లకు రైలింగ్ ఏర్పాటు చేసుకోవాలి.

లంగ్ కేర్



పావురాళ్లతో... పలురకాల ఊపిరితిత్తుల సమస్యలు

మనం మూగజీవాల పట్ల ఆపేక్ష కనబరుస్తూ ఉంటాం. బాల్కనీలో గూళ్లు కట్టుకునే పావురాళ్లను చూసి ముచ్చట పడిపోతాం. వాటికి ఆహారం, నీళ్లు అందిస్తూ, ఆదరిస్తాం. అయితే ఇలా పావురాళ్లకు ఆశ్రయం కల్పించడం వల్ల, వాటి విసర్జకాలు, ఈకల ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు

సాధారణంగా పైకప్పులు, బాల్కనీలు పావురాళ్లకు ఆశ్రయాలుగా మారిపోతూ ఉంటాయి. అలా ఇంటి పరిసరాల్లోకి చేరుకునే పావురాళ్ల ఆకలి తీర్చడాన్ని మనం మన బాధ్యతగా భావిస్తూ ఉంటాం. అయితే హానికరంగా కనిపించని ఈ చర్యలతో కంటికి కనిపించని ఆరోగ్య ముప్పు పొంచి ఉంటుంది. పదే పదే పావురాళ్ల విసర్జకాలు, దుమ్ము, ధూళితో కూడిన వాటి ఈకలకు బహిర్గతమైతే, తీవ్రమైన ఊపిరితిత్తుల జబ్బులు సోకుతాయి. మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్, ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్‌లు పెరుగుతాయి.

పావురాళ్లతో వ్యాధులు ఎందుకు?

పావురాళ్ల విసర్జకాలు, ఈకలు, గూళ్లు కట్టుకోడానికి ఉపయోగించే పదార్థాలు, భవనాల పైకప్పులు, బాల్కనీల్లో పేరుకుపోతూ ఉంటాయి. కొంత కాలానికి అవన్నీ ఎండిపోయి, కంటికి కనిపించని ధూళి రేణువులుగా మారిపోతాయి. పావురాళ్ల విసర్జకాల్లో, ఈకల్లో... హిస్టోప్లాస్మోసిస్, క్రిప్టోకోకోసిస్ అనే ఫంగల్ స్పోర్స్‌తో పాటు, బ్యాక్టీరియా, వైరల్ వ్యాధికారక సూక్ష్మక్రిములు, అలర్జీలను కలిగించే పక్షుల ప్రొటీన్లు ఉంటాయి. గాలితో పాటు వీటిని పదే పదే పీల్చుకున్నప్పుడు ఈ అలర్జెన్స్, స్పోర్స్‌కు ఊపిరితిత్తులు స్పందిస్తాయి. హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్‌లో, వ్యాధినిరోధక వ్యవస్థ, ఊపిరితిత్తుల కణజాలం మీద దాడి చేసి, ఊపిరితిత్తుల సహాయక కణజాలమైన, ఇంటర్‌స్టిషియమ్ వాపుకు దారితీస్తుంది. ఈ పరిస్థితి ఊపిరితిత్తులు గట్టిపడే ఫైబ్రోసిస్‌కు దారితీస్తుంది. ఇలా పావురాళ్ల విసర్జకాలు, ఈకలకు పదే పదే బహిర్గతమవుతూ, ఊపిరితిత్తులకు జరుగుతున్న నష్టాన్ని సకాలంలో కనిపెట్టలేకపోతే, అంతిమంగా తిరిగి సరిదిద్దలేనంతగా ఊపిరితిత్తులు దెబ్బతిని, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో ప్రతి శ్వాసకూ ఆక్సిజన్ మీద ఆధారపడే పరిస్థితి తలెత్తి, ఊపిరితిత్తుల మార్పిడి అవసరమవుతుంది.

ముప్పు ఎవరికి?

హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్ ముప్పు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ముందు నుంచే ఊపిరితిత్తులు దెబ్బతిన్నవాళ్లకు ఈ ముప్పు మరింత ఎక్కువ. పిల్లలు, వయసు పైబడిన పెద్దలు, వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్న వాళ్లకు, ప్రత్యేకించి వ్యాధినిర్ధారణ ఆలస్యమైనవాళ్లకు ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది. నెలలు, ఏళ్ల తరబడి పదే పదే పావురాళ్ల విసర్జకాలు, ఈకలు, ధూళిలకు బహిర్గతమైన వాళ్లకు కూడా ముప్పు ఎక్కువగానే ఉంటుంది. హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్ వల్లే దాదాపు 50% ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్‌లు సోకుతున్నట్టు భారతీయ ఐఎల్‌డి రిజిస్ట్రీ సూచిస్తోంది. పావురాళ్లకు బహిర్గతమవడం మూలంగా హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్ కారణంగా, ఊపిరితిత్తుల మార్పిడికి దారితీసే సందర్భాలతో పాటు, పావురాళ్ల సంబంధిత ఊపిరితిత్తుల వ్యాధులు క్రమేపీ పెరుగుతున్నట్టు నగర నివేదికలు కూడా సూచిస్తున్నాయి. పావురాళ్లతో ముడిపడి ఉన్న ప్రమాదాలను అరికట్టడం కోసం, ఢిల్లీ, ముంబయిల్లోని ప్రభుత్వ సంస్థలు, పావురాళ్లకు మేత వేసే ప్రదేశాల మీద నిషేధం విధిస్తూ, తగిన నియంత్రణ చర్యలను పాటిస్తున్నాయి.

భద్రతా చర్యలు ఇవే!

ప్రత్యేకించి నివాస ప్రాంతాలు, బాల్కనీలు, పైకప్పుల దగ్గరకు చేరుకునే పావురాళ్లకు ఆహారం తినిపించడం మానేయాలి. ఇలా ఆహారం అందించడం వల్ల పావురాళ్లు భారీ సంఖ్యలో ఆయా ప్రదేశాలకు చేరుకోవడం మొదలుపెడతాయి. దాంతో వాటి విసర్జకాలకు బహిర్గతమయ్యే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి వాటికి జాగా దొరికే వీల్లేకుండా ఈ జాగ్రత్తలు పాటించాలి.

సత్వరమే అప్రమత్తం

ఆగని దగ్గు, ఊపిరి పీల్చుకోలేకపోవడం, తెలియని అలసట లాంటి లక్షణాలు వేధిస్తున్నా, పావురాళ్లకు బహిర్గతమయ్యే ప్రదేశాల్లో నివసిస్తూ, ఈ లక్షణాలు తలెత్తినా, తక్షణమే వైద్యులను కలవడంతో పాటు, పావురాళ్లకు బహిర్గతమవుతున్న విషయాన్ని తెలియపరచాలి. హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్ సమస్యను ప్రారంభంలోనే గుర్తించడం ఎంతో ముఖ్యం. ఇలా ప్రారంభంలోనే గుర్తించడం వల్ల, సమస్యను రివర్స్ చేయడంతో పాటు, మరింత తీవ్రమవకుండా నిలువరించవచ్చు.



- గూళ్లు కట్టుకునే వీల్లేకుండా, బాల్కనీల్లో బర్డ్ స్పైక్స్ లేదా మెష్ నెట్స్ ఏర్పాటు చేయాలి
- పావురాళ్లు ఒదిగి కూర్చునే వీల్లేకుండా, బహిరంగ పైకప్పులు, కిటికీలకు తెరలు ఏర్పాటు చేయాలి
- పావురాళ్ల విసర్జకాలను శుభ్రం చేయడం కోసం ముందుగా ఆ ప్రదేశాన్ని నీళ్లతో తడపాలి. ఇలా తడపడం వల్ల ధూళి గాల్లో కలిసిపోకుండా ఉంటుంది. ఆ తర్వాత ముఖానికి ఎన్95 మాస్కు, చేతులకు గ్లోవ్స్ తొడుక్కుని ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసి, వ్యర్థాలను సంచుల్లో వేసి సీల్ చేసి, చెత్త బుట్టలో పారేయాలి.
- ఇంట్లోకి గాలి వీచేలా చూసుకోవాలి. వీలైతే ఇంటి లోపల గాలిని వడగట్టే హెపా ఫిల్టర్స్ వాడుకోవాలి

డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రహ్మణియన్
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్

స్పోర్ట్స్

అనయ అదరగొట్టింది..

బధిర ఒలింపిక్స్ షూటింగ్

- ప్రపంచ రికార్డుతో స్వర్ణం
- ప్రాంజలికి రజతం



న్యూఢిల్లీ: యువ షూటర్ అనయ ప్రసాద్ అదరగొట్టింది. పుట్టిన రోజును మరపురానిదిగా చేసుకుంది. టోక్యోలో జరుగుతున్న బధిర ఒలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో అనయ ప్రసాద్ ప్రపంచ రికార్డు స్కోరు (241.1 పాయింట్లు)తో పసిడి పతకం కొల్లగొట్టగా, భారత్‌కే చెందిన మరో షూటర్ ప్రాంజలి ప్రశాంత్ ధూమల్ రజతం (236.8 పాయింట్లు)తో మెరిసింది. ప్రాంజలి 572 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పింది. ఇక పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో 18 ఏళ్ల అభినవ్ దేశ్వాల్ 235.2 పాయింట్ల స్కోరుతో రజతం అందుకున్నాడు. అంతకుముందు అభినవ్ 576 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో ప్రపంచ రికార్డును తన పేరిట నమోదు చేశాడు. కాగా..కొరియా, క్రొయేషియా షూటర్లు స్వర్ణ, కాంస్య పతకాలు గెలుపొందారు.

అర్జున్ తొలి గేమ్ డ్రా

చెస్ వరల్డ్‌కప్

పనాజీ: ఫిడే చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి క్వార్టర్ ఫైనల్స్ తొలి గేమ్‌ను డ్రాగా ముగించాడు. సోమవారం జరిగిన రౌండ్-8లో చైనా జీఎం వీ యితో మొదటి క్లాసిక్ గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. నల్లపావులతో ఆడిన అర్జున్ 31 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. జవోకిర్ షిండోవ్ (ఉజ్బెకిస్థాన్)తో జో మార్టినెజ్ (మెక్సికో), సామ్ షెంక్లాండ్ (అమెరికా)తో ఆండే ఎసిపెంకో కూడా పాయింట్ పంచుకొన్నారు. అయితే, అలెగ్జాండర్ డెష్‌చెంకో (జర్మనీ)పై నొడిర్‌బెక్ యాకుబొయేవ్ (ఉజ్బెకిస్థాన్) గెలిచి 1-0 ఆధిక్యంలో నిలిచాడు.

గుర్‌ప్రీత్‌కు రజతం

షూటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్



కైరో: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ గుర్‌ప్రీత్ సింగ్ త్రుటిలో స్వర్ణం చేజార్చుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 25మీ. సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో తను ప్రిసిషన్, ర్యాపిడ్ దశలో మొత్తంగా 584 పాయింట్లు సాధించాడు. అయితే ప్రత్యర్థి పావ్లో కొరోస్టిలో (ఉక్రెయిన్) సైతం అన్నే పాయింట్లు సాధించినప్పటికీ.. ర్యాపిడ్ రౌండ్‌లో 29 సార్లు ఇన్నర్ టెన్‌తో పాటు ఫైనల్ రౌండ్‌లో పర్‌ఫెక్ట్ 100 స్కోరు సాధించాడు. దీంతో గుర్‌ప్రీత్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓవరాల్‌గా భారత్ మూడు స్వర్ణాలు, ఆరు రజతాలు, నాలుగు కాంస్యాలతో 13 పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంతో టోర్నీని ముగించింది. చైనా (21), కొరియా (14) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

కమిన్స్‌కే సన్‌రైజర్స్ పగ్గాలు

హైదరాబాద్: ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా పేసర్ ప్యాట్ కమిన్స్ కొనసాగనున్నాడు. వరుసగా మూడో సీజన్‌కు కూడా అతడికే సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్టు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ నెట్‌లో పోస్టు చేసింది. 2024 వేలంలో కమిన్స్‌ను రూ. 20.50 కోట్లకు కొనుగోలు చేసిన హైదరాబాద్ అతడికే నాయకత్వ బాధ్యతలు అప్పగించింది.

ఒత్తిడికి చిత్తవుతున్నాడా?

వర్క్‌లోడ్‌తో గిల్‌కు ఇబ్బందులు

ఊపందుకొన్న కెప్టెన్సీ విభజన అంశం



ఆ భారాన్ని మోయలేకపోతున్నాడా?

న్యూఢిల్లీ: సీనియర్ ఆటగాళ్ల వీడ్కోలు పలికిన సంధి దశలో.. భారత నవయువ సారథిగా 'జెన్-జడ్' శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్‌లో మూడు ఫార్మాట్లలోనూ అతడిని టీమిండియా కెప్టెన్‌గా నియమించాలనేది బీసీసీఐ, టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహం. అయితే, సొంతగడ్డపై తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో భారత జట్టుకు దిమ్మతిరిగింది. దీంతోపాటు తొలి ఇన్నింగ్స్‌లో స్లాగ్ స్వీప్ ఆడే క్రమంలో గిల్ (4) మెడ పట్టేయడంతో మళ్లీ బరిలోకి దిగలేక పోయాడు. రెగ్యులర్ కెప్టెన్ లేకపోవడంతో మ్యాచ్ ఏ దిశగా సాగుతుందో కూడా అర్థం కాలేదు. అంతిమంగా గెలవాల్సిన టెస్టులో టీమిండియా చతికిలబడడం సదరు అభిమానికి మింగుడు పడడం లేదు. ఈ క్రమంలో 26 ఏళ్ల గిల్‌పై వర్క్‌లోడ్ ఎక్కువైపోయిందన్న చర్చసాగుతోంది. ఆయా ఫార్మాట్లకు తగ్గట్టుగా సారథ్యాన్ని విభజించాలన్న డిమాండ్ ఊపందుకొంది.

యువకుడే కావచ్చు.. కానీ మితిమీరిన పనిభారం శుభ్‌మన్ గిల్ కెరీర్‌ను దెబ్బతీస్తోందని మాజీలు విమర్శిస్తున్నారు. శుభ్‌మన్ సారథ్యంలో హోరాహోరీగా సాగిన ఇంగ్లండ్ టూర్‌లో ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేసింది. నాయకుడిగా గిల్ బ్యాటింగ్‌లో జట్టును ముందుండి నడిపించాడు. ఒకరకంగా విషమ పరీక్ష పాసయ్యాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకొన్నారు. ఆ తర్వాత వెస్టిండీస్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్‌ను 2-0తో గెల్చుకొన్న భారత్.. పరిమిత ఓవర్ల సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లింది. వన్డే సారథిగా శుభ్‌మన్‌కు బాధ్యతలు అందించిన బీసీసీఐ.. టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా నియమించింది. త్వరలో పొట్టి ఫార్మాట్ జట్టును కూడా అతడి చేతిలోనే పెట్టాలనుకొంది. కోచ్ గంభీర్ కూడా గట్టిగా మద్దతు పలుకున్నాడు. అయితే, కీలక టెస్టు సిరీస్‌లో అతడు గాయపడడంతో బీసీసీఐ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో జట్టు భవిష్యత్ కోసం వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు కెప్టెన్లను నియమించడమే సరైనపని అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టెస్టుల్లో జట్టును నడిపిస్తాడనుకొన్న శుభ్‌మన్.. ఒత్తిడికి చిత్తవుతున్నాడని భారత మాజీ ఆటగాడు అభినవ్ ముకుంద్ అన్నాడు. అంతేకాకుండా బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారాల్సిన గిల్ భవిష్యత్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని కెప్టెన్సీని విభజించడం ఎంతో తెలివైన పని అని సలహా ఇచ్చాడు.

టర్నింగ్ వికెట్ కావాలా?



రెండో టెస్టు పిచ్‌పై సర్వత్రా ఆసక్తి

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అనుకున్నదొక్కటి..అయినది ఒక్కటి..అన్నట్టుగా మారింది ఈడెన్ గార్డెన్స్‌లో టీమిండియా పరిస్థితి. తొలి టెస్టు కోసం కోరి మరీ తయారు చేయించుకున్న స్పిన్ పిచ్‌పై ఆడలేక భారత బ్యాటర్లు ప్రత్యర్థి స్పిన్నర్లకు దాసోహమయ్యారు. ఛేదనలో జట్టు కనీసం వంద పరుగులైనా చేయలేకపోవడం తీవ్రంగా నిరుత్సాహపరిచింది. అస్థిర బౌన్స్‌కు తోడు బంతి ఎటువైపు టర్న్ అవుతుందో అర్థం కాక టపటపా వికెట్లు సమర్పించుకున్నారు. వాస్తవానికి 124 పరుగుల లక్ష్యం అసాధ్యమేమీ కాదు. గతంలో స్పిన్నర్లపై ఆధిపత్యం చూపడంలో భారత బ్యాటర్ల తర్వాతే ఎవరైనా అనే పేరుండేది. కానీ ప్రస్తుత ఆటగాళ్లు మాత్రం టర్నింగ్ వికెట్‌పై నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కోలేక బేజారెత్తుతున్నారు. పుజార, రహానె, విరాట్ ఇలాంటి పిచ్‌లపై సుదీర్ఘ సమయం క్రీజులో నిలిచేవారు. నేటితరం బ్యాటర్లు టీ20 మోజులో పడి టెస్టు ఫార్మాట్‌లో ఓపిక, టెక్నిక్‌ను ప్రదర్శించడంలో విఫలమవుతున్నారు. ఈ బలహీనతతోనే గతేడాది న్యూజిలాండ్‌పై భారత జట్టు 0-3తో వైట్‌వాష్ అయింది.

ఏం అడుగుతారో..?

సిరీస్‌లో భాగంగా ఆఖరిదైన రెండో టెస్టును గువాహటిలోని బర్సపార స్టేడియంలో ఆడనున్నారు. భారత కెప్టెన్, కోచ్ ఇక్కడ తమకు ఎలాంటి పిచ్ కావాలని కోరుకుంటున్నారో తెలియాల్సివుంది. ఏరికోరి తయారుచేయించుకున్న ఈడెన్ పిచ్‌పై బోల్తాపడిన నేపథ్యంలో గువాహటి పిచ్‌పై ఆసక్తి నెలకొంది. స్వదేశంలో భారత్ నిలకడగా విజయాలు సాధించాలంటే బ్యాటర్లు చెలరేగి 300-400 పరుగులైనా స్కోరుబోర్డుపై ఉంచాలి. కానీ ప్రస్తుత జట్టుకు ఇది అసాధ్యంగా మారుతోంది. నిజానికి బుమ్రా, సిరాజ్ రూపంలో టీమిండియాకు అత్యుత్తమ పేసర్లున్నారు. ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు పరిమితం చేయగల సత్తా వీరికుంది. నాలుగో ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్లు తమ తడాఖా చూపగలిగితే పోటీ సమతూకంతో ఉంటుంది. ఈ రీతిన ముందుకెళితే భారత్ స్వదేశంతో పాటు విదేశాల్లోనూ విజయాలు దక్కించుకుంటుంది. ఆసీస్, ఇంగ్లండ్ ఎక్కువగా బ్యాటింగ్ పిచ్‌ల వైపే మొగ్గు చూపుతున్న విషయం గుర్తుంచుకోవాలి. విండీస్‌తో సిరీస్ సందర్భంగా తమ జట్టు టర్నింగ్ వికెట్లపై కాకుండా బ్యాలెన్సింగ్ వికెట్‌పైనే ఆడాలనుకుంటోందని కెప్టెన్ గిల్ చెప్పాడు. కానీ ఈడెన్‌లో మాత్రం కెప్టెన్ మాటలకు వ్యతిరేకంగా జరగడం గమనార్హం.

అతడి స్థానంలో ఎవరు?

మెడ నొప్పితో బాధ పడుతున్న కెప్టెన్ గిల్ ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఆదివారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అతను కోల్‌కతాలోనే జట్టు హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడి విషయంలో రిస్క్ తీసుకోవద్దనే ఆలోచనలో బీసీసీఐ ఉంది. దీంతో రెండో టెస్టులో ఆడేది సందేహంగా మారడంతో తన స్థానంలో సాయి సుదర్శన్ లేక దేవ్‌దత్ పడిక్కళ్‌లలో ఒకరు బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే మాత్రం సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఒకవేళ దేవ్‌దత్‌ను తీసుకుంటే టాప్-5లో రాహుల్ మినహా అంతా లెఫ్ట్ హ్యాండర్లే అవుతారని, అప్పుడు రోజంతా సైమన్ హార్మర్ బౌలింగ్‌కు దిగుతాడేమో అని కామెంట్ చేశాడు. మరోవైపు బుమ్రా, సిరాజ్, షమిలాంటి బౌలర్లను నమ్ముకోవాలని కోచ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ గంగూలీ సూచించాడు.



సాయి సుదర్శన్

అభిషేక్ సెంచరీ

- ఆంధ్ర 224/2
- రాణించిన భరత్, రషీద్
- జార్ఖండ్ 328

జంషెడ్‌పూర్: అభిషేక్ (103 బ్యాటింగ్) అజేయ శతకంతో అదరగొట్టడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీలో ఆంధ్ర భారీ స్కోరు దిశగా సాగుతోంది. మ్యాచ్‌కు రెండో రోజైన సోమవారం తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 224/2 స్కోరు చేసింది. ఆట ముగిసేసరికి అభిషేక్‌తోపాటు త్రిపురాన విజయ్ (6) క్రీజులో ఉన్నాడు. హాఫ్ సెంచరీ చేసిన ఓపెనర్ శ్రీకర్ భరత్ (51)ను అనుకూల్ ఎల్బీ చేయగా.. రషీద్ (58)ను మనీష్ వెనక్కిపంపాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 259/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన జార్ఖండ్ 328 పరుగులకు ఆలౌటైంది. సాహిల్ రాజ్ (50) అర్ధ శతకం చేశాడు. జార్ఖండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు ఆంధ్ర ఇంకా 104 పరుగులు వెనుకంజలో నిలిచింది. కాగా, గ్రూప్-డిలో జమ్మూతో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 121 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూ 275/4 స్కోరు చేసింది.

రాజస్థాన్ రాయల్స్ కోచ్‌గా సంగక్కర



జైపూర్: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్‌గా మరోసారి కుమార సంగక్కర నియమితుడయ్యాడు. ఈ ఏడాదే రాహుల్ ద్రవిడ్ అతడి స్థానంలో వచ్చినా.. ఇటీవలే ఆ పదవి నుంచి వైదొలిగాడు. దీంతో ఆర్ఆర్ తిరిగి సంగక్కర వైపే మొగ్గు చూపింది. తన శిక్షణలో జట్టు 2022లో ఫైనల్‌కు చేరగా, 2024లో ప్లేఆఫ్స్‌లో ఆడింది.

ఒంటరితనం భరించలేకున్నా..

- చనిపోవాలనిపిస్తోంది!
- యువీ తండ్రి యోగ్‌రాజ్ నిర్వేదం



న్యూఢిల్లీ: కుటుంబ సభ్యులెవరూ తోడుగాలేని జీవితాన్ని భరించలేకపోతున్నానని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ వాపోయాడు. ఒంటరి జీవితాన్ని తట్టుకోలేకపోతున్నానని, చనిపోవాలనిపిస్తోందని 62 ఏళ్ల యోగ్‌రాజ్ ఓ ఇంటర్వ్యూలో నిర్వేదం వ్యక్తంజేశాడు. 'స్వస్థలంలో ఒక్కడినే ఉంటున్నా. ఎవరో ఒకరు వచ్చి అన్నం పెట్టి వెళ్తున్నారు. ఆహారం కోసం నేనెవర్నీ ఇబ్బంది పెట్టడంలేదు. నా తల్లిని, పిల్లలను, మనవళ్లను ఎంతో ప్రేమిస్తా. కానీ వారిని ఏదీ అడగను. నా జీవితం పూర్తయ్యింది. చావుకి సిద్ధంగా ఉన్నా. భగవంతుడు అనుకున్నప్పుడు నన్ను తీసుకుపోవచ్చు' అని యోగ్‌రాజ్ అన్నాడు. యోగ్‌రాజ్ తొలుత షబ్నమ్ కౌర్‌ను వివాహమాడాడు. వారికి యువరాజ్, జొరావర్ పుట్టారు. షబ్నమ్‌తో విడాకుల అనంతరం నీనా బుందేల్‌ను పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె జన్మించారు. తానెంతగానో ప్రేమించేవ్యక్తులు తననెందుకు వీడారో అర్థం కావడంలేదని వాపోయాడు.

తెలుగు రాష్ట్రాల్లో ఎలక్ట్రిక్ కార్లకు భలే డిమాండ్

మెర్సిడెస్ ఈవీ విక్రయాల్లో ఏపీ, తెలంగాణ టాప్

- మొత్తం విక్రయాల్లో 10% వాటా
- త్వరలో విశాఖలో కొత్త షోరూమ్
- వచ్చే ఏడాది సీఎల్ఏ ఈవీ కారు విడుదల
- మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ)కు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా వెల్లడించింది. మెర్సిడెస్ కార్ల విక్రయాల్లో ఈ రెండు రాష్ర్టాలు చాలా కీలకంగా ఉన్నాయని సంస్థ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బీఈవీ విభాగంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉందని ఆయన చెప్పారు. దేశంలో ఏటా 50,000 పైగా లగ్జరీ కార్ల విక్రయాలు నమోదవుతున్నాయని, ఇందులో మెర్సిడెస్ బెంజ్ వాటా 45 శాతంగా ఉందన్నారు. కాగా కంపెనీ లగ్జరీ కార్ల విక్రయాల్లో తెలుగు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉండగా బీఈవీ అమ్మకాల్లో 10 శాతంగా ఉందని ఆయన చెప్పారు. భారత్‌లో మొత్తం ఈవీ విక్రయాల్లో కంపెనీ వాటా సగటున 8 శాతం ఉండగా తెలుగు రాష్ట్రాల్లో అంతకు మించి ఉండటం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ కార్లకు సంబంధించి సానుకూల పన్ను విధానాలు, చార్జింగ్ మౌలిక సదుపాయాలతో పాటు అధికాదాయ వర్గాల (హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్, హెచ్ఎన్ఐ) వారు ఎక్కువగా ఉండటంతో అమ్మకాలు భారీగా ఉంటున్నాయని అయ్యర్ వెల్లడించారు.

హైదరాబాద్‌లో తొలి మేబాక్ లాంజ్: మెర్సిడెస్ బెంజ్ టాప్ ఎండ్ లగ్జరీ కార్లకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ప్రత్యేకంగా మేబాక్ లాంజ్‌ను ఏర్పాటు చేసినట్లు సంతోష్ అయ్యర్ తెలిపారు. ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్‌కు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం కీలక మార్కెట్లుగా ఉన్నాయని, ఇక్కడ మొత్తం 10 సేల్స్, సర్వీస్ పాయింట్లను నిర్వహిస్తున్నట్లు అయ్యర్ తెలిపారు. విస్తరణలో భాగంగా త్వరలో విశాఖపట్నంలో మూడో ఫ్రాంచైజీ భాగస్వామిని నియమించుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

జనవరి త్రైమాసికంలో సీఎల్ఏ ఈవీ

మెర్సిడెస్ బెంజ్ భారత పోర్టుఫోలియోలో మొత్తం 25 కార్లు ఉండగా అందులో 11 కార్లను స్థానికంగా పుణెలో ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు అయ్యర్ వివరించారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ కార్లను ఇక్కడే తయారు చేస్తున్నట్లు చెప్పారు. కాగా వచ్చే రెండేళ్లలో మెర్సిడెస్ ప్రపంచవ్యాప్తంగా 40 కొత్త మోడళ్లను విడుదల చేయనుండగా అందులో 11 మోడళ్లను భారత్‌లోనే తయారు చేసే అవకాశం ఉందన్నారు. మరోవైపు వచ్చే జనవరి త్రైమాసికంలో ఎంట్రీ లెవల్ కారు సీఎల్ఏ విభాగంలో ఎలక్ట్రిక్ కారును భారత మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. సుమారు రూ.50 నుంచి 60 లక్షల ధర ఉండే ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 800 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుందన్నారు.

ఏటా 20,000 కార్ల తయారీ: మహారాష్ట్ర, పుణె సమీపంలోని చకన్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన మెర్సిడెస్ ప్లాంట్‌లో ఏటా 20,000 కార్లను ఉత్పత్తి చేస్తున్నట్లు అయ్యర్ తెలిపారు. గత ఏడాది కంపెనీ విక్రయాలు 19,500 యూనిట్ల వరకు ఉన్నాయని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉంటాయని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీ 2.0తో అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరిగాయని తెలిపారు. అయితే యూరో మారకంలో రూపాయి బలహీనపడటంతో వచ్చే ఏడాది జనవరి నుంచి ధరలు పెంచాలని నిర్ణయించినట్లు అయ్యర్ వెల్లడించారు.

మురుగప్పా గ్రూప్ మాజీ చైర్మన్ అరుణాచలం కన్నుమూత

న్యూఢిల్లీ: మురుగప్పా గ్రూప్ మాజీ చైర్మన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గౌరవ చైర్మన్ అరుణాచలం వెల్లాయన్ (72) మరిక లేరు. దీర్ఘకాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన సోమవారం ఉదయం కన్నుమూసినట్టు మురుగప్ప గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ భారతదేశంలో మురుగప్పా గ్రూప్‌ను ప్రముఖ పారిశ్రామిక సంస్థగా తీర్చిదిద్దడంలో అరుణాచలం కీలక పాత్ర పోషించారు. వివిధ వ్యాపారాల్లోకి విస్తరించిన మురుగప్పా గ్రూప్‌నకు వ్యూహాత్మక మార్గదర్శనం చేయడంలోనూ ఆయనది కీలక పాత్ర. ఆయన నేతృత్వంలో మురుగప్పా దేశంలోని అత్యంత విశ్వసనీయ పారిశ్రామిక గ్రూపుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. మురుగప్పా గ్రూప్ కంపెనీలతో పాటు కనోరియా కెమికల్స్, ఎగ్జిమ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బోర్డుల్లోనూ ఆయన డైరెక్టర్‌గా వ్యవహరించారు.

బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ (బీఈఎల్).. మహారాష్ట్ర స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ (మహాజెన్‌కో) నుంచి రూ.465 కోట్ల ఆర్డర్‌ను దక్కించుకుంది. ఆర్డర్‌లో భాగంగా బీడ్ జిల్లాలో కంపెనీ 100 మెగావాట్ల ఏసీ సామర్థ్యం గల సౌర విద్యుత్పత్తి ప్రాజెక్టును ఈపీసీ పద్దతిలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది

- బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.299.5 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.48 కోట్లు)తో పోల్చితే లాభం 21.3% పెరగగా ఆదాయం 34.4% వృద్ధి చెందింది.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,970 ▼	1,14,550 ▼	1,73,000 ▼
విజయవాడ	1,27,000 ▼	1,20,000 ▲	1,59,000 ▼
విశాఖపట్నం	1,26,860 ▼	1,14,650 ▼	1,73,000 ▼
రాజమండ్రి	1,25,400 ▲	1,14,950 ▲	1,58,000 ▲
ప్రొద్దుటూరు	1,24,000 ▼	1,14,080 ▼	1,59,000 ▼
ముంబై	1,22,924 ▼	1,12,598 ▼	1,54,933 ▼

అమెరికాకు తగ్గిన భారత ఎగుమతులు

భారత విదేశీ వాణిజ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు గణనీయ ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు మన వస్తు ఎగుమతులు వరుసగా రెండో నెలా తగ్గాయి. గతనెలలో 8.58 శాతం క్షీణించి 630 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.55,811 కోట్లు) పడిపోయాయి. అమెరికా నుంచి దిగుమతులు మాత్రం వార్షిక ప్రాతిపదికన 13.89 శాతం పెరిగి 446 కోట్ల డాలర్లకు (రూ.39,511 కోట్లు) చేరాయి.

పసిడి దిగుమతులు మూడింతలు



40 % స్విట్జర్లాండ్ నుంచే

- అక్టోబరులో రికార్డు స్థాయికి.. రూ.1.30 లక్షల కోట్లకు చేరిక
- పండగలు, పెళ్లిళ్ల సీజన్ గిరాకీయే ప్రధాన కారణం

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో భారత పసిడి దిగుమతుల విలువ మూడింతలు పెరిగి సరికొత్త రికార్డు స్థాయి 1,472 కోట్ల డాలర్లకు (రూ.1,30,404 కోట్లు) చేరుకున్నాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో బంగారం గిరాకీ భారీగా పుంజుకోవడం ఇందుకు కారణమని గత నెల విదేశీ వాణిజ్య గణాంకాల విడుదల అనంతరం కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అన్నారు. 2024 అక్టోబరులో బంగారం దిగుమతులు 492 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. దేశం మొత్తం దిగుమతుల్లో పసిడి వాటా 5 శాతానికి మించిపోయింది. ప్రపంచంలో చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద పసిడి వినియోగదారు.

ఏడు నెలల్లో రూ.3.65 లక్షల కోట్ల దిగుమతులు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26).. గడిచిన 7 నెలల్లో (ఏప్రిల్-అక్టోబరు) మొత్తం పసిడి దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 21.44 శాతం పెరుగుదలతో 4,123 కోట్ల డాలర్ల (రూ.3,65,256 కోట్లు)కు చేరాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి దిగుమతులు 3,400 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ధరలు ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్న తరుణంలోనూ బంగారం గిరాకీ పెరుగుతూ పోతుండటం విశేషం. ప్రస్తుతం దేశీయంగా తులం బంగారం రూ.1.30 లక్షల చేరువలో ఉంది.

వెండి దిగుమతుల్లో 529 శాతం పెరుగుదల: గత నెలలో వెండి దిగుమతులు ఏకంగా 528.71 శాతం పెరిగి 271 కోట్ల డాలర్లు (రూ.24,007 కోట్లు)గా నమోదయ్యాయి. వెండిని ఆభరణాలు, వంట, పూజ సామాగ్రి తయారీతో పాటు ఎలక్ట్రానిక్స్, ఆటో, ఫార్మా వంటి పరిశ్రమల్లోనూ వినియోగిస్తారు.

గతనెల పసిడి దిగుమతుల్లో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే సరఫరా జరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వాటా 16 శాతంగా, దక్షిణాఫ్రికా వాటా 10 శాతంగా ఉంది. గత నెలలో స్విట్జర్లాండ్ నుంచి దిగుమతులు 403.67 శాతం పెరిగి 508 కోట్ల డాలర్లకు చేరాయి. గడిచిన ఏడు నెలల్లో దిగుమతులు 10 శాతానికి పైగా పెరిగి 1,540 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

డిసెంబరు కల్లా రిఫండ్స్ పూర్తి

సీబీడీటీ చైర్మన్ రవి అగర్వాల్

న్యూఢిల్లీ: సక్రమంగా ఉన్న ఐటీ రిటర్న్‌లపై రిఫండ్స్ చెల్లింపులు ఈ నెలాఖరు లేదా వచ్చే నెలాఖరు కల్లా పూర్తవుతాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ ప్రకటించారు. కొంతమంది రిఫండ్స్ కోసం తప్పుడు డిడక్షన్స్ క్లెయిమ్ చేయడంతో వాటన్నిటిని పరిశీలించి క్లియర్ చేయాల్సి రావడంతోనే ప్రస్తుతం రిఫండ్స్ ఆలస్యమవుతోందన్నారు. ఇప్పటికే ఫైల్ చేసిన రిటర్న్‌లో ఏవైనా విషయాలు మర్చిపోతే సవరించిన రిటర్న్ ఫైల్ చేయాలని కూడా పన్ను చెల్లింపుదారులకు లేఖలు రాసినట్టు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రిఫండ్స్‌లోనూ ప్రతికూల వృద్ధి కనిపిస్తోందన్నారు. రిఫండ్స్ క్లెయిమ్స్ తగ్గడం ఇందుకు కారణమని అగర్వాల్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన రూ.25.20 లక్షల కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో 'లోరియల్' జీసీసీ!

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయబోతోంది. ప్రముఖ అంతర్జాతీయ సౌందర్య పోషక ఉత్పత్తుల సంస్థ 'లోరియల్' ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. అయితే కంపెనీ ఈ వార్తలపై అధికారికంగా నోరు మెదపడం లేదు. లోరియల్ కంపెనీకి ఇప్పటికే మన దేశంలోని ముంబై, బెంగళూరు నగరాల్లో పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే జీసీసీ ద్వారా భారత్‌ను తన టెక్నాలజీ, నిర్వహణ కార్యకలాపాలకు కేంద్రంగా వాడుకోవాలని ఈ ఫ్రెంచ్ దిగ్గజం భావిస్తోంది.

అజిముత్ ఏఐ-సైయెంట్ నుంచి 'అర్కా జీకేటీ-1 చిప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫస్ట్ జెనరేషన్ ఇంటలిజెంట్ పవర్ ప్లాట్‌ఫామ్-ఆన్-ఏ-చిప్‌ను దేశీయంగా అభివృద్ధి చేసినట్టు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సైయెంట్ సెమీకండక్టర్, అజిముత్ ఏఐ కంపెనీలు ప్రకటించాయి. 'అర్కా జీకేటీ-1' పేరుతో అభివృద్ధి చేసిన ఈ చిప్ కృత్రిమ మేధ (ఏఐ), స్మార్ట్ ఎనర్జీ అప్లికేషన్స్‌లో బాగా ఉపయోగపడుతుందని తెలిపాయి. దేశంలో ఇలాంటి చిప్‌ను అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారని తెలిపాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ చిప్‌ను ఆవిష్కరించారు.

మళ్లీ 26,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ 388 పాయింట్లు అప్


ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభపడ్డాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 425.31 పాయింట్లు ఎగబాకి 84,988.09 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 388.17 పాయింట్ల లాభంతో 84,950.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.40 పాయింట్ల వృద్ధితో 26,013.45 వద్ద ముగిసింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు, కార్పొరేట్ కంపెనీల ఆశాజనక త్రైమాసిక ఫలితాలు ఇందుకు దోహదపడ్డాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కావచ్చన్న అంచనాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలపరిచాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.2 లక్షల కోట్లు పెరిగి రూ.477.14 లక్షల కోట్లకు చేరుకుంది.

రికార్డు గరిష్ఠానికి వాణిజ్య లోటు

ట్రంప్ సుంకాల దెబ్బకు భారత మొత్తం వస్తు ఎగుమతులు కూడా అక్టోబరు నెలలో 11.8 శాతం పతనమై 3,438 కోట్ల డాలర్లకు (రూ.3,04,572 కోట్లు) తగ్గాయి. పసిడి, వెండితో పాటు పత్తి, ఎరువులు, సల్ఫర్ దిగుమతులు అనూహ్యంగా పెరగడంతో మొత్తం దిగుమతులు కూడా 16.63 శాతం ఎగబాకి 7,606 కోట్ల డాలర్లకు (రూ.6,73,815 కోట్లు) చేరాయి. దీంతో గత నెల వాణిజ్య లోటు (ఎగుమతి ఆదాయం, దిగుమతి వ్యయానికి మధ్య వ్యత్యాసం) రికార్డు గరిష్ఠ స్థాయి 4,168 కోట్ల డాలర్ల (రూ.3,69,243 కోట్లు)కు పెరిగింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుతో ముగిసిన 7 నెలల్లో భారత ఎగుమతులు కేవలం 0.63 శాతం వృద్ధితో 25,425 కోట్ల డాలర్లు, దిగుమతులు 6.37 శాతం పెరుగుదలతో 45,108 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. దాంతో వాణిజ్య లోటు 19,682 కోట్ల డాలర్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ



హైదరాబాద్	620	విజయవాడ	640
వరంగల్	622	గోదావరి	625
చిత్తూరు	663	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	120
కర్నూలు	117	నెల్లూరు	125
విశాఖపట్నం	110	అనంతపురం	125
గోదావరి	111		


ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న సోళ్ల బొజ్జిరెడ్డి

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి ప్రమాణం

అమరావతి, విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా సోళ్ల బొజ్జిరెడ్డి, సభ్యులుగా జి.సునీత, కె.లక్ష్మి, కె.సాయిరాం, కె.మల్లేశ్వరరావు, వెంకటప్ప సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ భవనంలో ఉన్న ఎస్టీ కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే మిరియాల శిరీష ఎస్టీ కమిషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. గిరిజన యోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా 15 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

3 బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు బీసీ సంక్షేమ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే ఏపీ సగర/ఉప్పర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆర్.వెంకటరమణప్పను, ఏపీ మొదలియార్ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎస్ త్యాగరాజన్‌ను, దాసరి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా పొట్నూరు వెంకట రత్నాజీని నియమించిన ప్రభుత్వం తాజాగా ఒక్కో కార్పొరేషన్‌కు 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఆదేశాలిచ్చింది.

ఏపీఐఐసీ ఇన్‌చార్జి ఎండీగా శుభం బన్సాల్

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ ఇన్‌చార్జి వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరుగా, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇన్‌చార్జి సీఈవోగా పరిశ్రమలశాఖ డైరెక్టర్ శుభం బన్సాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఏపీఐఐ ఎండీ అభిషిక్త్ కిశోర్ పది రోజులు, ఏపీఎంఎస్ఎంఈడీసీ సీఈవో ఎం.విశ్వ 5రోజులు వ్యక్తిగత సెలవుపై వెళ్తుండటంతో ఆ పోస్టులలో బన్సాల్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు విడుదల చేశారు.

పిల్లలెవరూ బడి బయట ఉండకూడదు

- సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలెవరూ బడి బయట ఉండకూడదని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లాల ఆల్టర్‌నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్లతో సోమవారం విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పొట్టకూటి కోసం తల్లిదండ్రులు వలస వెళ్లినా స్థానిక పాఠశాలలు, సీజనల్ హాస్టళ్ల ద్వారా పిల్లలకు విద్యనందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు కూలి పనులు, యాచక వృత్తిలో కనిపించకుండా చూడాలన్నారు.

'సహకార' అవినీతిపై హౌస్ కమిటీ భేటీ వాయిదా

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో సహకార సంస్థల్లో జరిగిన అవినీతి, అవకతవకలపై దర్యాప్తు కోసం ఏర్పాటైన స్పెషల్ హౌస్ కమిటీ సోమవారం నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. 2019-24 మధ్య ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌ల్లో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథరెడ్డి అధ్యక్షతన హౌస్ కమిటీ ఏర్పాటైంది. ఈనెల 17లోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, ఆప్కాబ్ ఎండీని హౌస్ కమిటీ ఆదేశించింది. నివేదిక సిద్ధం కానందున సమావేశం వాయిదా వేసినట్లు తెలిసింది.

'బార్‌కోడ్' సరిపోలుతోందా?


- తెలుసుకునేందుకు నిపుణుల పేర్లు ఇవ్వండి
- గ్రూప్-1 పత్రాల మూల్యాంకనం పిటిషన్‌పై అభ్యర్థులు, ఏపీపీఎస్సీకి హైకోర్టు స్పష్టీకరణ
- కేసులో నిందితులుగా ఉన్న అధికారులను విచారణకు దూరంగా ఉంచాలని ఆదేశం
- ఇప్పటికీ పారదర్శకత రాలేదని ఆక్షేపణ

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న ఉద్యోగులు, అధికారులను విచారణకు దూరంగా ఉంచాలని ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికీ ఏపీపీఎస్సీ అధికారులు పారదర్శకంగా వ్యవహరించట్లేదని వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలకు అనుగుణంగా కోర్టుకు సమర్పించిన అభ్యర్థుల జబాబుపత్రాలతో పాటు ఓఎంఆర్ షీట్‌లో అభ్యర్థుల వివరాలు ఉండే భాగాన్ని కోర్టుకు సమర్పించకపోవడాన్ని తప్పుపట్టింది. తదుపరి విచారణలో వాటిని కూడా కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. అభ్యర్థులు జవాబుపత్రాలకు జత చేసిన ఓఎంఆర్ షీట్ల బార్ కోడ్‌లో సమాచారం, మ్యాన్యువల్ మూల్యాంకనం కోసం రెండోసారి ముద్రించిన బార్‌కోడ్‌లోని సమాచారం సరిపోలుతోందా? లేదా? అనే విషయాన్ని ఎలా నిర్ధారించారని ప్రశ్నించింది. ఆ విధంగా సరిపోలేలా బార్‌కోడ్లను తిరిగి ముద్రించడం సాధ్యమేనా? అని హైకోర్టు అడిగింది. తమ అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు నిపుణుల పేర్లను సూచించాలని అభ్యర్థులు, ఏపీపీఎస్సీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని నిర్ధారిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో ఉత్తర్వులు ఇచ్చారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం 2022, మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన ఉద్యోగుల జాబితాను రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ నిర్వహించాలని ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన కొందరు అభ్యర్థులు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అదనపు అఫిడవిట్ దాఖలు చేశామన్నారు. సొమ్ము చెల్లింపులకు సంబంధించి పలు చెక్కుల జిరాక్స్ కాపీలను అఫిడవిట్‌కు జత చేశామని తెలిపారు. అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం స్పందిస్తూ.. ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఉద్యోగులు, అధికారులను ప్రస్తుత విచారణకు దూరంగా ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పోలవరంలో కీలక పనులు భేష్!

ఎర్త్ వర్క్ 79.37 శాతం పూర్తి

- 37.72 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు కూడా
- కుడికాలువ మట్టి పనులు పూర్తి
- ఎడమ కాలువ లైనింగ్ పనులు 75% అయ్యాయి
- ప్రాజెక్టు పురోగతిపై పీపీఏ నిత్యం సమీక్ష
- వచ్చే నెలలో రానున్న అంతర్జాతీయ నిపుణులు



అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనుల తీరును పోలవరం ప్రాజెక్టు అథారిటీ (ఎప్పటికప్పుడు) సమీక్షిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రైమావీరా సాఫ్ట్‌వేర్ ఆధారంగా నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. తాను పరిశీలించిన అంశాలను ఎప్పటికప్పుడు తన వెబ్‌సైట్‌లో పెడుతోంది. హెడ్‌వర్క్స్‌లో అత్యంత కీలకమైన ఎర్త్ వర్క్ పనులు 1,825.88 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 79.37 శాతం అంటే 1,449.13 లక్షల క్యూబిక్ మీటర్ల మేర జరిగాయని తాజాగా వెల్లడించింది. 'కాంక్రీట్ పనులు 44.54 లక్షల క్యూబిక్ మీటర్లకు 37.72 లక్షల క్యూబిక్ మీటర్లు (84.69 శాతం) పూర్తయ్యాయి. 77,744.29 మెట్రిక్ టన్నుల స్టీల్‌కు గాను 67,059.52 మెట్రిక్ టన్నులు (86.2 శాతం) వాడారు. పోలవరం కుడి ప్రధాన కాలువ పనుల్లో ఎర్త్ వర్క్ (1154.67 లక్షల క్యూబిక్ మీటర్లు) పూర్తయిపోయింది. లైనింగ్ పనులు 19.25 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 18.06 లక్షల క్యూబిక్ మీటర్లు (93.82%) జరిగాయి. 255 స్ట్రక్చర్లలో 211 (83.5 శాతం) నిర్మించారు. ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి 1174 లక్షల క్యూబిక్ మీటర్ల ఎర్త్ వర్క్‌కు గాను 1,115.56 లక్షల క్యూబిక్ మీటర్ల (94.96%) పని జరిగింది. లైనింగ్ పనులు 75 శాతం.. అంటే 11.08 లక్షల క్యూబిక్ మీటర్లు జరిగాయి. స్ట్రక్చర్లు 461 కట్టాల్సి ఉండగా.. 172 కట్టారు. తొలిదశలో 172 హేబిటేషన్లు ముంపునకు గురవుతాయి. వాటిలో 38 హేబిటేషన్లను ఇప్పటిదాకా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తొలిదశకు సంబంధించి 26 పునరావాస కాలనీలనూ పూర్తి చేశారు. అయితే 38,060 మంది నిర్వాసితుల్లో 14,371 మందిని మాత్రమే ఇప్పటిదాకా సురక్షిత ప్రాంతానికి పంపించగలిగారు. తొలిదశ భూసేకరణలో 1,00,100 ఎకరాలకు గాను 86,995 ఎకరాలు సేకరించారు. రూ.12,832 కోట్ల నిధులు అవసరం కాగా.. ఇప్పటికి రూ.6,223 కోట్లు ఖర్చుచేశారు. కేంద్రం నుంచి మరో 6,609 కోట్లు రావలసి ఉంది. మొత్తంగా ప్రాజెక్టు ప్రధాన పనులు చురుగ్గా సాగుతున్నాయి' అని అందులో వివరించింది. పోలవరం పనుల తీరు పరిశీలనకు వచ్చే నెలలో అంతర్జాతీయ నిపుణుల బృందం వస్తున్న తరుణంలో పనుల వేగం పెంచడంపై పీపీఏ దృష్టి సారించింది.

పరకామణి కేసులో లోతైన విశ్లేషణ!

- కాల్ డేటా సేకరిస్తున్న దర్యాప్తు బృందాలు
- రవికుమార్, ఓ సీఐ ఫోన్ నెంబర్లపై ప్రత్యేక దృష్టి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ కేసుపై దర్యాప్తు బృందాలు లోతుగా విశ్లేషిస్తున్నాయి. చోరీ జరిగిన 2023 ఏప్రిల్ 9వ తేదీ నుంచి లోక్‌అదాలత్‌లో రాజీ జరిగిన అదే ఏడాది సెప్టెంబరు 9వ తేదీ వరకు నిందితుడు రవికుమార్‌తో ఎవరు ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడారన్న కోణంలో కాల్ డేటా సేకరిస్తున్నట్టు తెలిసింది. బెదిరింపులతో కూడిన మెసేజ్‌లు ఏమైనా ఉన్నాయా? రాజీ చేయడానికి ముందు ఎక్కడ ఒప్పందం కుదిరింది? అన్న కోణాల్లో విశ్లేషిస్తున్నారు. రవికుమార్ వినియోగించిన మూడు ఫోన్ నెంబర్లు, కుటుంబ సభ్యుల కాల్ డేటాలు కూడా తెప్పించుకునే పనిలో ఉన్నట్టు తెలిసింది. అలాగే, టీడీపీ నేతలు ఆరోపిస్తున్న సూత్రధారులు, పాత్రధారుల కాల్ డేటాపైనా దర్యాప్తు బృందాలు దృష్టిపెట్టినట్టు సమాచారం. వైసీపీ హయాంలో తిరుమలలో చక్రంతిప్పిన ఓ సీఐపైనా దర్యాప్తు బృందాలు ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ఆ సమయంలో అతడు వినియోగించిన అధికారిక ఫోన్‌తోపాటు వ్యక్తిగత నెంబరు కాల్ డేటాను విశ్లేషిస్తున్నట్టు సమాచారం. పరకామణి కేసు నమోదులో నామమాత్రపు సెక్షన్లు పెట్టించడంతోపాటు రవికుమార్‌తో రాజీ చేయించడంలో ఆ సీఐ కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. అతడి కాల్‌డేటాను విశ్లేషిస్తే సూత్రధారులు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు విచారణ ఎదుర్కొన్న వారినుంచి సేకరించిన సమాచారాన్ని నివేదికల రూపంలో సిద్ధం చేస్తున్నారు. దర్యాప్తు బృందంలోని సాంకేతిక సిబ్బంది ఆ పనిలో నిమగ్నమై ఉన్నారు.

దొరికిపోతామనే సీఐని చంపేశారు: పార్థసారథి

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దొరికిపోతామనే భయంతోనే వైసీపీ దొంగలు టీటీడీ మాజీ విజిలెన్స్ అధికారి, రైల్వే సీఐ సతీశ్‌కుమార్‌ను మట్టుబెట్టారని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల లాంటి పవిత్ర క్షేత్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కుట్రలు, దోపిడీలు అనేకం జరిగాయన్నారు. టీటీడీ పరకామణిలో వంద కోట్ల విలువైన విదేశీ కరెన్సీ చోరీ జరిగినా నాటి వైసీపీ ప్రభుత్వం కేసును నీరుగార్చిందని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు తీరుపైనా అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారు సతీశ్ సాక్ష్యం చెప్పడానికి రైల్లో వస్తుండగా, దుండగులు దారుణంగా హత్య చేశారని అన్నారు. అయితే, దీనిని వైసీపీ ఆత్మహత్యగా ప్రచారం చేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుందని, దోషులెవరైనా చట్టబద్ధంగా చర్యలుంటాయని తెలిపారు.

వైసీపీకి విశాఖ సమ్మిట్ షాక్: పంచుమర్తి

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ పెట్టుబడుల సదస్సు విజయవంతమై, ప్రభుత్వానికి మంచిపేరు రావడంతో వైసీపీ నాయకులకు దిక్కుతోచడం లేదని శాసనమండలి చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రావడం వారికి మింగుడు పడటం లేదని, ఇంకా వారు షాక్‌లోనే ఉన్నారని వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో 17 నెలల్లో 9.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఒక్క విశాఖ సదస్సులోనే ఏకంగా రూ.13.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. సుమారు 16 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని తెలిపారు. దీనికి హర్షించాల్సింది పోయి.. వైసీపీ దొంగల ముఠా, చంచలగూడ జైలు పార్టీ ఓర్వలేకపోతోందని మండిపడ్డారు. 2019-24 మధ్య అనేక పరిశ్రమలను జగన్ వెళ్లగొట్టారని, రాష్ట్ర యువత భవిష్యత్తును దెబ్బకొట్టారని అనురాధ అన్నారు. వైసీపీ నేతలు బెదిరించడంతో 19 కియా అనుబంధ పరిశ్రమలు రాష్ట్రానికి రాకుండా పోయాయన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగాలు లేవని, అన్నీ నిరుద్యోగుల ఆత్మహత్యలేనని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

తెలుగులోకి రవీనా టాండన్ కుమార్తె



బాలీవుడ్ నటి రవీనా టాండన్ కొన్ని తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి విదితమే. ఆమె కుమార్తె రషా ఇప్పుడు హీరోయిన్‌గా తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. 'ఆజాద్' హిందీ చిత్రంతో పరిచయమై 'ఊయి అమ్మా' పాటతో సోషల్ మీడియాను షేక్ చేసిన రషా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. హీరో కృష్ణ మనవడు, దివంగత రమేశ్‌బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న సినిమాలో రషా హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నిర్మాత అశ్వనీదత్ సమర్పణలో పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకుడు. అద్భుతమైన కొండల మధ్య సాగుతూ మనసుకు హత్తుకొనే విధంగా రూపుదిద్దుకొనే ప్రేమకథ ఇది. భావోద్వేగాలు, నిజాయతీ, రియలిజం కలసిన కొత్త తరహా ప్రేమకథ ఇదని అజయ్ భూపతి చెప్పారు. రషా కోసం ఓ అద్భుతమైన పాత్రను ఆయన సృష్టించారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుంది.

ఇఫీలో రజనీకాంత్.. బాలకృష్ణకు సన్మానం




కథానాయకులు రజనీకాంత్, నందమూరి బాలకృష్ణ అరుదైన గౌరవం సాధించారు. 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో వీరికి ఘనంగా సన్మానం జరగనుంది. వారిద్దరూ తమ నట ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఇఫీ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ వెల్లడించారు. 'ఈ ఇద్దరు లెజెండ్స్ తమ సినీ ప్రయాణంలో 50 వసంతాలను పూర్తి చేసుకోవడం భారతీయ సినీ చరిత్రలోనే ఓ మైలురాయి లాంటిది. అద్భుతమైన నటనతో, విశేష ప్రజాదరణతో వీరు ప్రేక్షకులకు ఎన్నో మంచి సినిమాలు అందించారు' అని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకూ గోవాలో ఈ చిత్రోత్సవం జరగనుంది.

కేఎస్ గోపాలి ఇక లేరు



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, చిరంజీవి, రాధారవి, నాజర్ సహా అనేక మందికి నటనలో శిక్షణ ఇచ్చిన చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ కేఎస్ నారాయణస్వామి(92) సోమవారం ఉదయం కన్ను మూశారు. ఆయన మద్రాస్ దూరదర్శన్‌లోనూ డైరెక్టర్‌గా పనిచేశారు. నారాయణస్వామి అందరికీ 'కేఎస్ గోపాలి'గానే సుపరిచితులు. రజనీకాంత్‌ను తమిళ దర్శక దిగ్గజం కె.బాలచందర్‌కు పరిచయం చేయడం వల్లే ఆయన 'అపూర్వ రాగంగళ్' సినిమా ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



భయపెట్టే కథ

ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలసి నిర్మించే సరికొత్త హారర్ చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో సూర్యరాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రధారులు. ఓ గ్రామంలోని మెడికల్ కాలేజీ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందనీ, ఇప్పటివరకూ చూడని ఓ సరికొత్త కథతో చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. త్వరలో షూటింగ్ ప్రారంభించుకునే ఈ చిత్రానికి మాటలు: మోహన్ బి.ఎస్, ఫొటోగ్రఫీ: దినేశ్ దివాకరన్, సంగీతం: వెంకీ జీజీ. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యర్నేని.

మంచి అనుభూతి పొందుతారు



అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. మొదట వేణు మాట్లాడుతూ 'ఖమ్మం, వరంగల్ జిల్లాల మధ్య జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు సాయిలు కథ తయారు చేసుకు వచ్చి నాకు వినిపించాడు. ఎన్నో పరువు హత్యల గురించి విన్నాం. కానీ ఇలాంటి దుర్మార్గం ఏ ప్రేమకథ లోనూ లేదు. వాస్తవ సంఘటన నేపథ్యంగా సాగే సినిమా అయినా మెయిన్ స్ట్రీమ్ అప్పీల్ ఉండేలా దర్శకుడు స్క్రిప్ట్ తయారు చేశాడు. సినిమాలో విషాదకరమైన ముగింపు ఉండదు. ఓ మంచి ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని చెప్పారు. మరో నిర్మాత రాహుల్ మాట్లాడుతూ 'ఘటన జరిగిన ప్రాంతంలోనే షూటింగ్ చేశాం. హీరోగా నటించిన అఖిల్ వరంగల్ అబ్బాయి. తనకు తెలంగాణ యాస ప్రాబ్లమ్ కాదు. కానీ తేజస్వినీ ఆంధ్రా అమ్మాయి. కానీ తెలంగాణ యాసలో పర్ఫెక్ట్‌గా డైలాగులు చెప్పింది' అన్నారు.


'అఖండ 2: తాండవం' నుంచి నేడు పాట విడుదలవుతున్న సందర్భంగా హీరో బాలకృష్ణ, హీరోయిన్ సంయుక్త స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు.



మేయర్ పీలా శ్రీనివాసరావుకు కేకు తినిపిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల తదితరులు

స్పీకర్‌ను చేసి నా నోటికి తాళం వేశారు

» శాసన సభాపతి అయ్యన్న వ్యాఖ్యలు

పెందుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తనను స్పీకర్‌ను చేసి తన నోటికి తాళం వేశారని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాజకీయాలు చూస్తుంటే బాధేస్తోందన్నారు. కొంతమంది పగలు ఓ పార్టీలో, రాత్రికి మరో పార్టీలో ఉంటున్నారని.. ఇదంతా చూస్తూ రాజకీయాల్లో ఎందుకు ఉన్నాననిపిస్తోందని, అయినా నెట్టుకొస్తున్నామని పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలకు అయ్యన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు రాజకీయాలు డబ్బుమయం అయ్యాయని, ఊసరవెల్లి నేతలు అధికమయ్యారన్నారు.

సీజేఐ గవాయ్ మీద దాడి అమానుషం: మందకృష్ణ

న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని, ఇది దేశంలోని 30 కోట్ల దళితుల మీద జరిగిన దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దళిత ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడారు. ధర్మం, విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా..? వారి మీద చర్యలు తీసుకోరా..? అని ప్రశ్నించారు. ఎన్నో ఘటనల మీద సుమోటోగా కేసులు తీసుకున్న వ్యవస్థలు.. సీజేఐ మీద దాడి జరిగితే ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు.

భూములకు బదులు బ్యాంకు డిపాజిట్లను గ్యారెంటీగా తీసుకోండి

» జగన్ అక్రమాస్తుల కేసులో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి సీబీఐ కోర్టులో డిపాజిట్ చేసిన ఆస్తి పత్రాలను విడుదల చేసి వాటి స్థానంలో బ్యాంకు గ్యారెంటీలను, బ్యాంకు ఫిక్సిడ్ డిపాజిట్లు పెట్టేందుకు హైకోర్టు ఆమోదం తెలిపింది. ఈ మేరకు జగన్‌కు చెందిన కంపెనీలు జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్‌లను అనుమతిస్తూ జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. అక్రమాస్తుల కేసుల్లో భాగంగా జగన్ కంపెనీలకు చెందిన బ్యాంకు ఖాతాలను 2012లో ఈడీ స్తంభింపజేసింది. ఆ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు, రోజువారీ వ్యయాల నిర్వహణకు బ్యాంకు ఖాతాలు అవసరం కాబట్టి వాటి బదులుగా రేవన్ ఇన్‌ఫ్రా పేరుపై బెంగుళూరు సమీపంలో ఉన్న 9 ఎకరాల్లోని మూడు ఆస్తులకు సంబంధించిన హక్కు పత్రాలను సీబీఐ కోర్టులో డిపాజిట్ చేశారు. తాజాగా ఈ పత్రాలను విడుదల చేయాలని కోరుతూ జగన్‌కు చెందిన కంపెనీలు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేశాయి. వీటికి హైకోర్టు అనుమతించింది.

ఒక్క ప్రాజెక్టు తెచ్చినట్టు నిరూపించినా రాజీనామా: గంటా



విశాఖపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రారంభించి, పూర్తిచేసిన ఒక్క ప్రాజెక్టు చూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాల్ చేశారు. విశాఖలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కియా వంటి ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేకపోయింది. రెండు రోజులు జరిగిన పెట్టుబడిదారుల సదస్సుతో ప్రపంచమంతా విశాఖ వైపే చూస్తోంది. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో పెడుతున్నామని సీఈవో సుందర్ పిచ్చై మూడు నెలల ముందు ప్రకటిస్తే.. వైసీపీ హయాంలోనే తీసుకువచ్చామని ఆ పార్టీ నేతలు ప్రకటించడం హాస్యాస్పదం' అని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంటుపై వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు.

తయారీ రంగాన్ని బలోపేతం చేస్తాం: మంత్రి కొండపల్లి



ఢిల్లీలో జరిగిన ఎంఎస్ఎంఈ వ్యాపార సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

న్యూఢిల్లీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో తయారీ రంగానికి సంబంధించిన ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన 22వ సీఐఐ గ్లోబల్ ఎంఎస్ఎంఈ బిజినెస్ సదస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలు భారీ సంస్థలుగా ఎదగడానికి తగిన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంఎస్ఎంఈల వృద్ధికి తోడ్పడే విధానాలను రూపొందించడానికి ప్రభుత్వ సంస్థలతో మరింత కలిసికట్టుగా పనిచేయాలని సీఐఐని మంత్రి కోరారు. ఈ కార్యక్రమానికి ముందు భారతమండపంలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లోని ఏపీ పెవిలియన్‌ను మంత్రి సందర్శించారు.

నాలుగు రోజుల కస్టడీకి అద్దేపల్లి సోదరులు

విజయవాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితులను రెండోసారి సిట్ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావులను మరింతగా విచారించేందుకు వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో బుధవారం నుంచి 22 వరకు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు సోమవారం తీర్పు వెలువరించారు. కాగా, మద్యం కుంభకోణంలో విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డికి కంటి వైద్య పరీక్షలు చేయించారు. తలనొప్పి ఎక్కువగా వస్తోందని ఆయన జైలు సిబ్బందికి చెబుతుండటంతో సోమవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు.

ఐపీఎస్ సంజయ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

అగ్నిమాపకశాఖ నిధుల దుర్వినియోగం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ బెయిల్ పిటిషన్‌ను విజయవాడలోని ఏసీబీ కోర్టు కొట్టివేసింది. అగ్నిమాపకశాఖతోపాటు సీఐడీలో నిధులను దుర్వినియోగం అభియోగాలపై సంజయ్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. ఆయన బెయిల్ పిటిషన్‌పై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరావు సోమవారం తీర్పు వెలువరించారు.

బెయిల్ కోసం 'మాలెంపాటి' బ్రదర్స్ పిటిషన్లు

సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబసభ్యులను కించపరిచేలా లండన్ నుంచి పోస్టింగ్‌లు పెట్టిన వైసీపీ నేతలు మాలే భాస్కర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి సోమవారం కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. భాస్కర్‌రెడ్డి నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో, ఓబుల్‌రెడ్డి విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారి తరఫున న్యాయవాది ఒగ్గు గవాస్కర్ కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

తిట్టించుకోవడానికా.. భూములిచ్చింది?

» సీఎంకే చెప్పుకోండి అంటున్నారు
» అంతమాత్రానికి సీఆర్డీఏ ఎందుకు?
» సీఎం చంద్రబాబు మమ్మల్ని ఎందుకు కలవరు?
» కూటమి వచ్చినా కష్టాలు తీరలేదు
» మాకు మళ్లీ పోరాటమే శరణ్యం
» రాజధానికి భూములిచ్చిన రైతుల ఆక్రందన
» గుంటూరులో అమరావతి రైతు జేఏసీ సమావేశం
» నెలాఖరు వరకూ వేచి చూస్తామని, ఆ తర్వాత పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి

వినతులను సీఆర్డీఏ అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న జమ్ముల శ్యామ్ కిశోర్

గుంటూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రాజధాని అభివృద్ధి ఎంత ముఖ్యమో రైతుల సమస్యలు పరిష్కరించడం అంతే ముఖ్యం. మీ చేత తిట్టించుకోవడానికే భూములిచ్చామా? సమస్యపై వినతులు ఇస్తే సీఆర్డీఏ అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబుకే చెప్పుకోండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అంతమాత్రానికి సీఆర్డీఏ ఎందుకు? గత ప్రభుత్వంలోలాగే ఈ ప్రభుత్వంలో కూడా రోడ్డెక్కాలా?. ఇదే పద్ధతిలో కొనసాగితే మాకు మళ్లీ పోరాటమే శరణ్యం' అంటూ రాజధాని రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రైతు ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చంద్రమౌళి నగర్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధానికి చెందిన పలువురు రైతు నేతలు, మహిళా నేతలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు, సీఆర్డీఏ అధికారుల తీరుపై సమావేశంలో చర్చించారు. ప్రధానంగా సీఆర్డీఏ అధికారుల తీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా తమ కష్టాలు తీరలేదని, సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. ఏపీసీఆర్డీఏ అధికారులు అమరావతి మహిళలు, రైతుల పట్ల ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆవేదన చెందారు. తమపై పెట్టిన కేసులు ఇప్పటికీ తొలగించలేదన్నారు. ఈ ఏడాది ఆగస్టు 5న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, కమిషనర్‌కు 14 సమస్యలను తెలియజేశామని, అయినా ఇప్పటి వరకు స్పందన లేదని వాపోయారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల చివర్లో రైతులంతా మరోసారి సమావేశం అవుతామని, ఆ సమావేశంలో పోరాట కార్యాచరణ ఖరారు చేస్తామని నేతలు పేర్కొన్నారు.

రైతులు విన్నవించిన సమస్యలు..

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని పార్లమెంటులో చట్టం చేయడం, సుప్రీం కోర్టులో పెండింగులో ఉన్న మూడు రాజధానుల కేసును, ఆర్-5 జోన్ కేసులను ఉపసంహరించుకోవడం, రిటర్నబుల్ ప్లాట్ల సమస్యలను తక్షణం పరిష్కరించడం, వార్షిక కౌలు బకాయిల చెల్లింపు, హద్దురాళ్లు పోయిన రిటర్నబుల్ ప్లాట్లలో పెగ్ మార్కింగ్ వేసి రాళ్లు వేయడం, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన స్థలాల్లో పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడడం, రాజధాని గ్రామా ల్లో పదేళ్లుగా ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయిన కారణంగా, ఆ నిధులు కేటాయించి 29 గ్రామాలను అభివృద్ధి చేయడం, ఇప్పటికీ భూములివ్వని చోట సమీకరణ, లేదా సేకరణ ద్వారా భూములు తీసుకోవడం, గ్రామకంఠ సమస్యల పరిష్కారం, పెండింగులో ఉన్న జరీబు, మెట్ట సమస్యలు, పేదలకు ఇచ్చిన టిడ్కో ఇళ్ల రుణాలపై వడ్డీ బకాయిలకు సంబంధించి మొత్తం 14 రకాల అంశాలపై రైతులు ప్రభుత్వం, సీఆర్డీఏకు విన్నవించారు. ఈ సమస్యల విషయంలో తగిన స్పందన లేకపోవడంతో అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి ఈ సమావేశాన్ని నిర్వహించింది. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా రైతులను కలవడానికి, చర్చించడానికి మొగ్గు చూపడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తక్షణమే చర్చించి, తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ప్రభుత్వం, సీఆర్డీఏ తీరుపై పలువురు నేతలు స్పందించారు. రాజధాని అంశాలపై సీఎంను కలవడానికి, సమస్యలు చెప్పడానికి సీఆర్డీఏ అధికారులు అవకాశం ఇవ్వడం లేదని ఐకాస నేత జమ్ముల శ్యాంకిశోర్ అన్నారు.

కోస్తాకు మరో తుఫాను ముప్పు?

» 22న అల్పపీడనం.. మరింత బలపడుతుందని అంచనా
» 25 నుంచి కోస్తా తీరం వెంబడి పయనించే అవకాశం

రాష్ట్రంలో పెరిగిన చలి

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోస్తాకు వచ్చే వారం మరో తుఫాను ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజులు తమిళనాడు, దక్షిణ కోస్తాల్లో వర్షాలు కురవనున్నాయి. తర్వాత ఇది బలహీనపడనుంది. కాగా ఈనెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించిన తర్వాత వాయుగుండం/తుఫాన్‌గా మారుతుందని కొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి. దీని ప్రభావంతో కోస్తాలో నెల్లూరు నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కోస్తాంధ్రలో వరి, పత్తి, మిరప రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి, కడప, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, ఉత్తరాది నుంచి వీస్తున్న గాలులతో అన్ని ప్రాంతాల్లో చలి పెరిగింది. పగటి పూట కూడా ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతున్నాయి. సోమవారం అల్లూరి జిల్లా జి.మాడుగులలో 6.5, దళపతిగూడలో 6.7, మైదాన ప్రాంతంలోని జంగమహేశ్వరపురంలో 13.3, కళింగపట్నంలో 15.6, అనంతపురంలో 15.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పెట్టుబడులు రాకుండా జగన్ కుట్రలు

» వోల్ట్ సన్ అనామక కంపెనీ కాదు
» ఆర్జే కార్ప్ గ్రూప్‌లో ఇదీ ఓ భాగం
» ఆర్జే గ్రూప్ టర్నోవర్ రూ.90,000 కోట్లు
» ప్రభుత్వ పాలసీల్లో భాగంగానే రాయితీలు
» జగన్ పత్రికలో తప్పుడు రాతలు: ప్రభుత్వం

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులతో కంపెనీలు వస్తుండటంపై మాజీ సీఎం జగన్ ఓర్వలేకపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దుయ్యబట్టింది. వోల్ట్ సన్ ల్యాబ్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించడాన్ని తప్పుపడుతూ జగన్ పత్రికలో రాసిన కథనంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుంటే, వాటిని అడ్డుకునేలా కుట్రల పార్టీ వైసీపీ కుట్రలు కొనసాగిస్తూనే ఉందని సోమవారం ప్రభుత్వం ఒక ప్రకటనలో విమర్శించింది. వోల్ట్ సన్ ల్యాబ్ ఏదో అల్లాటప్పా సంస్థ కాదని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరింది. కేవలం భూముల కోసమో? లేక ఇతర అవసరాల కోసమో స్థాపించిన సంస్థ అంతకంటే కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా రవి జైపురియా నేతృత్వంలో పనిచేస్తున్న ఆర్జే కార్ప్ గ్రూప్‌నకు మంచి పేరుందని, ఇందులో వోల్ట్ సన్ ల్యాబ్ కూడా భాగమని వివరించింది. రూ.90,000 కోట్ల టర్నోవర్ గల ఆర్జే కార్ప్ సంస్థ రాష్ట్రంలో 37 ఎకరాల కోసం వోల్ట్ సన్ ల్యాబ్‌ను స్థాపించిందంటూ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్జే కార్ప్ గ్రూప్‌లో భాగమైన వోల్ట్ సన్ ల్యాబ్ ఏదో అనామక కంపెనీ కాదని స్పష్టం చేసింది. తిరుపతి జిల్లాలోని నాయుడుపేట ఎంపీఎస్ఈసీలో రూ.1743 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 15వ తేదీన ఉత్తర్వు జారీ చేసినట్లు వివరించింది. ప్రభుత్వ పాలసీల్లో భాగంగా వేగవంతంగా ప్రాజెక్టు పూర్తిచేయడానికి రాయితీలను ప్రకటించినట్లు పేర్కొంది. వోల్ట్ సన్ సంస్థ 2 గిగావాట్ల సమగ్ర సౌర ఉత్పత్తి మాడ్యూల్‌ను తయారు చేస్తుందని వివరించింది. ఇంత మంచి పేరున్న సంస్థతో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందం చేసుకున్నామని తెలిపింది. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా చెల్లుబాటు కావని తాజాగా విశాఖ సదస్సులో పెట్టుబడుల ఒప్పందాలు తేల్చి చెప్పాయని వెల్లడించింది. కియ, గూగుల్ లాంటి సంస్థలకు ఇచ్చే రాయితీలపైనా జగన్ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ తీవ్ర ఆరోపణలు చేశారని గుర్తు చేసింది. తాజాగా వోల్ట్ సన్ ల్యాబ్ విషయంలోనూ ఇదే తరహాలో పెట్టుబడులకు అడ్డుపడేలా కుట్ర పన్నారని ధ్వజమెత్తింది.

వివిధ రంగాల్లో ప్రావీణ్యం

ఆర్జే కార్ప్ సంస్థకు ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్ తదితర రంగాలతో పాటు పెప్సికో బాట్లింగ్ భాగస్వామిగా, కేఎఫ్‌సీ, పిజ్జాహట్, కాస్టాకాఫీ వంటి ప్రధాన క్యూఎస్ఆర్ బ్రాండ్‌లను ఫ్రాంచైజీ రూపంలో నడిపే సంస్థగా పాపులారిటీ ఉందని ప్రభుత్వం వివరించింది. వరుణ్ బేవరేజెస్ లిమిటెడ్ (వీబీఎల్) అనేది ఆర్జే గ్రూప్‌నకు ప్రధాన సంస్థ అని పేర్కొంది. దేవయాని ఇంటర్నేషనల్ లిమిటెడ్ కూడా ఈ గ్రూప్ సంస్థేనని స్పష్టం చేసింది. జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరున్న ఈ గ్రూప్ పునరుత్పాదక విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టిందని వెల్లడించింది. గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహం కోసం పలు దేశాలు వివిధ పాలసీలను అమలు చేస్తున్నాయని.. అయితే రాష్ట్రానికి మేలు జరగకుండా, కంపెనీలు రాకుండా, భయపెట్టేలా జగన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించింది. నిర్మాణాలు చేపట్టేందుకు ఎలా ముందుకొస్తారో చూస్తామంటూ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

'ఉక్కు' సంకల్పం!

(మొదటి పేజీ తరువాయి)

ప్లాంట్ పునర్వైభవానికి అందిన సాయం అక్షరాలా రూ.15 వేల కోట్లు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిరంతర సంప్రదింపులతో ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్న కృతనిశ్చయంతో అడుగులు వేస్తున్నారు. చంద్రబాబు స్వయంగా ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో పలుమార్లు సమావేశమై ఆర్థిక సహకారం అందేలా చూశారు. స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించడానికి 2024లో రూ.500 కోట్ల ఈక్విటీని, వర్కింగ్ క్యాపిటల్ అడ్వాన్సుగా రూ.1,140 కోట్లను కేంద్రం రుణంగా విడుదల చేసింది. ఈ ఆర్థిక చేయూతతో అప్పటి వరకు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే పనిచేస్తుండగా.. 2024 అక్టోబరులో రెండో బ్లాస్ట్ ఫర్నేస్ పనిచేయడం ప్రారంభమైంది. దీంతో ఉత్పత్తి సామర్థ్యం 49 నుంచి 67 శాతానికి పెరిగింది. చంద్రబాబు సంప్రదింపుల మేరకు కేంద్రం మరోమారు రూ.9,800 కోట్లను ఈక్విటీ రూపంలో విడుదల చేసింది. గతంలో తీసుకున్న రూ.1,140 కోట్ల రుణాన్ని ప్రిఫరెన్స్ షేర్ క్యాపిటల్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అంటే మొత్తం రూ.11,400 కోట్లు ఆర్థిక సాయం చేసిందన్న మాట. దీంతో గత నెలనాటికి ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 80 శాతానికి పెరిగింది. ప్రస్తుతం రోజుకు 16,322 టన్నుల హాట్‌మెటల్‌ను ఉత్పత్తి చేయగలుగుతోంది.

28 వేల మంది ఉద్యోగులకు భరోసా..

విశాఖ ఉక్కు కర్మాగారం 1992లో ఏడాదికి 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభమైంది. 2001-02లో లాభాల దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. 2005-06లో దాని సామర్థ్యం 6.3 మిలియన్ టన్నులకు.. ఆ తర్వాత 7.3 మిలియన్ టన్నులకు పెరిగింది. నవరత్న కంపెనీ హోదాతో 2014-15లో రూ.12,958 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. అయితే ముడిసరుకు లభ్యత లేకపోవడంతో 2022 నుంచి స్టీల్ ప్లాంట్ సామర్థ్యం తగ్గుతూ వచ్చింది. మొత్తం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉండగా, తొలుత రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు, ఆ తర్వాత ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే పనిచేసే పరిస్థితికి వచ్చింది. నష్టాల కారణంగా నాడు ఉత్పత్తి సామర్థ్యాన్ని బాగా కుదించుకుంది. అయితే నాడు ప్లాంట్ ఎంత తీవ్ర నష్టాల్లో ఉన్నా వైసీపీ సర్కారు కనీసం స్పందించలేదు. పైగా స్టీల్‌ప్లాంట్ భూములు అమ్మేందుకు ప్రయత్నాలు చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల భద్రతే లక్ష్యంగా అడుగులు వేయడం ప్రారంభించింది. అక్కడ 13 వేల మంది రెగ్యులర్, 15 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి భద్రతకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో రాజకీయ సంప్రదింపులు జరిపి.. కర్మాగారాన్ని ప్రైవేటీకరించకుండా నిలువరించింది. స్టీల్ ప్లాంట్ రెండేళ్ల పాటు బకాయి పడిన రూ.2,400 కోట్ల విద్యుత్ బకాయిలను తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో ఈక్విటీలుగా మార్చి ప్లాంట్‌పై భారాన్ని తగ్గించింది. ఇప్పటికీ రూ.200 కోట్లకుపైగా విద్యుత్ బిల్లులు బకాయిపడినా నిరంతరం కరెంటు సరఫరా జరిగేలా చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు విశాఖ ఉక్కు నుంచే స్టీల్ ఉత్పత్తులు కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందించి.. అమలు చేస్తోంది.

గతంలోనూ ఆదుకుంది టీడీపీయే..

విశాఖ స్టీల్ ప్లాంట్ ఎప్పుడు సంక్షోభానికి గురైనా దానిని ఆదుకుంటూ వస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుంది. సుమారు 25 ఏళ్ల క్రితం ప్లాంట్ సంక్షోభానికి గురైన సమయంలో.. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు కేంద్రంలోని వాజపేయి ప్రభుత్వంతో మాట్లాడి దాదాపు రూ.2,800 కోట్లు ఇప్పించి ఆదుకున్నారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా బొగ్గు సరఫరా సంక్షోభం తలెత్తినప్పుడు.. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఇబ్బందులు రాకుండా గంగవరం పోర్టు నుంచి నిరంతరం సరఫరా జరిగేలా చూసిన ఘనత కూడా చంద్రబాబుదే. ఈ వాస్తవాలను మరుగునపరుస్తూ తప్పుడు ప్రచారాలతో వైసీపీ విషం చిమ్మే ప్రయత్నం చేస్తోంది. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల పేరుతో విశాఖ స్టీల్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనివ్వబోమని.. మోదీ ప్రభుత్వ సహకారంతో మరింత బలోపేతం చేస్తామని కూటమి పెద్దలు స్పష్టం చేస్తున్నారు.

నెల్లూరు డ్వామాకు జాతీయ అవార్డు

» నేడు ఢిల్లీలో జల్ సంచయ్-జన్ భాగీదారీ పురస్కారం ప్రదానం
» రాష్ట్రపతి నుంచి అందుకోనున్న కలెక్టర్ హిమాన్షు, డ్వామా పీడీ గంగాభవానీ
» ఉత్తమ గ్రామ పంచాయతీలుగా దుబ్బిగానిపల్లి, మురుగుమ్మి
» నీటి సంరక్షణకు కృషి చేసినందుకు అవార్డులు



గంగాభవానీ

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) జాతీయ అవార్డును సాధించింది. జల్ సంచయ్-జన్ భాగీదారీ (జేఎస్‌జేబీ)-2015 అరుదైన అవార్డు మన రాష్ట్రానికి సంబంధించి నెల్లూరు జిల్లాకు మాత్రమే దక్కింది. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యమిచ్చినందుకు దక్షిణ జోన్‌లో కేటగిరీ-3 కింద నెల్లూరు జిల్లాకు ఈ అవార్డు దక్కింది. నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవానీ చేపట్టిన వివిధ రకాల నీటి సంరక్షణ పనులతో ఈ అవార్డు సాధించారు. 2024 సంవత్సరంలో జిల్లాలో 856 ఫారం పాండ్స్, 3495 ఇంకుడుగుంతలు, 112 ఊట చెరువులు, 166 చెక్ డ్యాంలు, 512 వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్, 247 చెరువుల పూడికతీత పనులు చేపట్టారు. జిల్లాలో మొత్తంగా 5502 భూగర్భ జలాల రీచార్జ్ పనులు పూర్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్ ప్లీనరీ హాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డ్వామా పీడీ గంగాభవానీ ఈ అవార్డును స్వీకరించనున్నారు. దీంతోపాటు రూ.25 లక్షల నగదు పురస్కారం అందుకోనున్నారు. అలాగే, అన్నమయ్య జిల్లా దుబ్బిగానిపల్లి, ప్రకాశం జిల్లా మురుగుమ్మి గ్రామాలకు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా, ప్రకాశం జిల్లాకు చెందిన పొదిలి రాజశేఖరరాజుకు 6వ జాతీయ జలఅవార్డులను ఇదే కార్యక్రమంలో ప్రదానం చేస్తారు. రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన అవార్డులు సాధించిన నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల డ్వామా పీడీలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ అభినందనలు తెలిపారు.

నంద్యాల మహిళకు జాతీయ గోపాల రత్న అవార్డు

న్యూఢిల్లీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడి రంగంలో ఉత్తమ సేవలకు నంద్యాలకు చెందిన అనురాధ చాకలికి 'జాతీయ గోపాల రత్న' అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా పాడిపరిశ్రమ రంగంలో ఉత్తమ సేవకులందించినవారికి కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ సోమవారం జాతీయ గోపాల రత్న -2025 (ఎన్‌జీఆర్‌ఏ) అవార్డులను ప్రకటించింది. ఇందులో.. ఉత్తమ కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణులు(ఏఐటీ) కేటగిరిలో నాన్-ఎన్ఈఆర్ విభాగంలో అనురాధ రెండో స్థానం దక్కించుకున్నారు. ఈనెల 26న జాతీయ పాల దినోత్సవం రోజున ఢిల్లీలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ విజేతలకు అవార్డులు అందజేయనున్నట్లు శాఖ పేర్కొంది.

రోజూ ఎంత మందికి వైద్యం చేస్తున్నారు?

» విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు
» డాక్టర్లకు ఆరోగ్య మంత్రి హెచ్చరిక

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రతి రోజూ ఎంత మంది రోగులకు వైద్యం అందిస్తున్నారో పరిశీలించి మదింపు చేయాలని, రోజువారీ డేటా సేకరణ జరగాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రభుత్వాసుపత్రులు, వైద్యుల పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆసుపత్రుల్లో వైద్యులు ఉండడం లేదన్న విషయం తన దృష్టికి వస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ పరిస్థితులు బోధనాసుపత్రులు, జిల్లా, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఉన్నాయన్నారు. ఇలాగైతే రోగులకు మెరుగైన వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. వైద్యులు ప్రతిరోజూ ఎంతమంది రోగుల ఓపీ చూస్తున్నారో నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు అమలు చేస్తున్నా, కొందరు తప్పుడు విధానాలు అనుసరించి విధులకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. బోధనాసుపత్రుల్లో ఉన్నతాధికారుల పనితీరు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో ఇన్ పేషంట్ కింద చేరే వారు ఔట్ పేషంట్ కింద కూడా పేర్లు నమోదు చేసుకోవడం ఎందుకని, దీనివల్ల సమయం వృథా కాదా అని ప్రశ్నించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడీల ద్వారా రోగులకు చికిత్స అందేలా చూడాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స వివరాలనూ రిజిస్టర్ చేయాలన్నారు.

మంత్రి సత్యకుమార్ పేరుతో టీటీడీకి నకిలీ సిఫారసు లేఖ

» మంత్రికే ఫిర్యాదు చేసిన బాధితులు
» విజయవాడ సీపీ దృష్టికి.. కేసు నమోదు!

అమరావతి/విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుడి దర్శనానికి వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేరతో నకిలీ సిఫారసు లేఖలు సృష్టించడం వెలుగులోకి వచ్చింది. టీటీడీ బ్రేక్ దర్శనానికి మంత్రి నకిలీ సిఫారసు లేఖతో తెలంగాణకు చెందిన కేంద్రమంత్రి బండి సంజయ్ బంధువులు సోమవారం తిరుమలకు వెళ్లారు. దీన్ని పరిశీలించిన అధికారులు నకిలీదని గుర్తించి తిరస్కరించారు. దీంతో వారు సత్యకుమార్ పీఏకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆ లేఖ ఎవరిచ్చారని ఆరా తీయగా ఒకప్పుడు మంత్రి కార్యాలయంలో పనిచేసి మానేసిన యువకుడు ఇచ్చినట్టు వివరించారు. నకిలీ లేఖపై సీరియస్ అయిన మంత్రి విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఆయన తెలిపారు.

విశాఖ ఉక్కు మోదీ బినామీ కంపెనీనా?

» ఎంత ఉత్పత్తికి అంతే వేతనం ఇస్తామంటారా?
» చంద్రబాబు వ్యాఖ్యలు గర్హనీయం..: షర్మిల

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రభుత్వరంగ సంస్థా? మోదీ బినామీ కంపెనీనా? అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిలదీశారు. ఎంత ఉత్పత్తికి అంతే వేతనం ఇస్తామంటూ ఉత్తర్వు జారీ చేయడం ఏమిటని సోమవారం ఎక్స్ వేదికగా ఆమె ధ్వజమెత్తారు. ఉత్పత్తి లేదన్న నింద కార్మికుల మీద మోపుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భారతీయ కార్మిక చట్టమే అమలవుతుందా? లేక మోదీ లేబర్ యాక్టు అమల్లో ఉందా అని మండిపడ్డారు. ఇది కేంద్ర ప్రభుత్వ కండ కావరానికి, నియంత మోదీ వికృత చేష్టలకు పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఇదంతా స్టీల్ ప్లాంట్‌ను అమ్మే కుట్రలో భాగమేనని తేల్చిచెప్పారు. స్టీల్ ప్లాంట్‌లో 30వేల మంది కార్మికులను 18 వేలకు కుదించారని, స్టీల్ ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకు ఐదు రోజులకు మించి లేదని, ఐరన్ ఓర్ అందక నెలకు వారం ఉత్పత్తి ఆపాల్సి వస్తోందని, ఇప్పుడు ఉత్పత్తి లేదంటూ ఆ నిందను కార్మికులపై వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి వర్కింగ్ క్యాపిటల్ ఆపేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ రవాణాకు రైల్వే వ్యాగన్లను ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్‌పై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తక్షణం ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సత్తా ఉంటే పెండింగ్ జీతాలు ఇప్పించాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు.



కృష్ణా డెల్టాకు గోదారమ్మ పరుగులు

ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి సోమవారం 2,100 క్యూసెక్కుల గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు ఈఈ ఏసుబాబు తెలిపారు. కృష్ణా డెల్టా సాగునీటి అవసరాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరు మోటారు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. గత పది రోజుల వరకు 14 మీటర్ల నీటి మట్టం ఉండటంతో రెండు పంపుల ద్వారా నీరు విడుదల చేశామన్నారు. **- పోలవరం, ఆంధ్రజ్యోతి**





లంక చేరాలంటే బోటు ఎక్కాల్సిందే..

కృష్ణా జిల్లా కలిదిండి మండల పరిధిలోని చిలకల దిబ్బ, పోతురాజు దిబ్బ, పెదలంక, కాలినదిబ్బ లంక గ్రామాలకు రోడ్డు మార్గంలేదు. రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదిగో.. ఇలా సైకిళ్లు, బైకులు సహా బోటు ఎక్కి కృష్ణానది దాటాల్సిందే. సామగ్రి తరలించాలన్నా ఇదే పరిస్థితి. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చినప్పుడు మాత్రం బోటు నడవక బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి!.

ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి ఎంఆర్‌ఓ ఆఫీస్..!

రూ.20 వేలకు విక్రయానికి పెట్టిన ప్రబుద్ధుడు



గిద్దలూరు తహసీల్దారు కార్యాలయ్యాన్ని ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన పోస్టు

గిద్దలూరు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓఎల్‌ఎక్స్‌లో ఎవరైనా పాత వస్తువులను అమ్మవచ్చు.. కొనవచ్చు..! ఇదొక చక్కటి వేదిక. కానీ.. ఓ ప్రబుద్ధుడు ఏకంగా తహసీల్దార్ కార్యాలయాన్నే ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి.. ప్రకాశం జిల్లా గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం ఫొటోను ఓఎల్‌ఎక్స్‌లో పెట్టి.. దాన్ని రూ.20 వేలకే అమ్ముతానని ప్రకటించాడు. ఈ పోస్టు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అప్రమత్తమైన గిద్దలూరు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి దీనిపై సోమవారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే దీనిపై ఆరా తీసిన పోలీసులు అనుమానితుడు హైదరాబాద్‌లో ఉంటున్నట్టు తెలుసుకుని సోమవారం రాత్రి తెలంగాణ పోలీసుల సహకారంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సోదరుడితో కలసి ప్రియుడి హత్య

రాత్రి చంపి.. ఉదయం వరకు మృతదేహం వద్దే..



ఇనాందార్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న తయ్యబా అనే మహిళ.. తన ప్రియుడు సమీర్ అలియాస్ పీకే ఇనాందార్(26)ను సోదరుడితో కలిసి హత్య చేసింది. ఆ తర్వాత నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. ఆదివారం రాత్రి విజయపుర జిల్లా కేంద్రంలోని అమన్ కాలనీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సమీర్‌పై రౌడీ షీట్ ఉంది. గోల్‌గుంబజ్ పోలీస్‌స్టేషన్‌లో హత్య, హత్యాయత్నం కేసులున్నాయి. తాను ఉంటున్న ప్రాంతానికి చెందిన తయ్యబాతో నాలుగేళ్ల నుంచి సమీర్ సహజీవనం చేస్తున్నాడు. ఏడాది క్రితం ఆమెకు దూరంగా ఉండాలని భావించాడు. ఆ తర్వాత మళ్లీ ఒక్కటయ్యారు. ఇటీవల తయ్యబాను సమీర్ వేధిస్తున్నట్లు సమాచారం. దీంతో అతడి అడ్డు తొలగించుకోవాలని భావించి.. తయ్యబా తన సోదరుడు అస్లాంతో మంతనాలు సాగించింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు సమీర్ ఆమె నివాసానికి వెళ్లాడు. రాత్రి 11 గంటల తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కా తమ్ముడు కలిసి సమీర్‌ను గొంతు నులిమి హతమార్చారు. ఇద్దరూ.. సోమవారం ఉదయం వరకు మృతదేహం వద్దనే ఉన్నారు.

సచివాలయాల్లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్

స్పౌజ్ విభాగంలోనే ట్రాన్స్‌ఫర్లు పరిమితం

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వా ర్డు సచివాలయాల్లో పనిచేసే సిబ్బందికి 'స్పౌజ్' కేటగిరి కింద అంతర్ జిల్లా బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం జారీ చేసింది. ఈ బదిలీలు ఆయా ఉద్యోగుల విజ్ఞప్తి మేరకే ఉంటాయని, బదిలీ కోరుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించింది. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల భార్య/భర్త ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతేనే ఈ అంతరజిల్లా బదిలీలు చేపట్టాలని, ప్రైవేట్ ఉద్యోగులైతే ఇది వర్తించదని స్పష్టం చేసింది. కాగా, ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకుని ఈ బదిలీలు నిర్వహించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఖాళీల జాబితాను ఆయా హెచ్‌వోడీలు ప్రకటించాలని తెలిపారు. ఉద్యోగులకు ఆయా మండలాలు/పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. ఏసీబీ/విజిలెన్స్, క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉంటే అలాంటి వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోరాదని తెలిపారు. సిబ్బంది ఆయా ఎంపీడీవో/మున్సిపల్ కమిషన్ వద్ద 'నో డ్యూ' సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు.

'అనకాపల్లి' బొమ్మల తయారీ పార్కు

ఏర్పాటుకు 581 ఎకరాలు కేటాయింపు

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో గ్లోబల్ టాయ్స్ తయారీ పార్కు ఏర్పాటుకు 581.39 ఎకరాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉపమాకలో 497.43 ఎకరాలు, సీహెచ్ లక్ష్మీపురంలో 83.78 ఎకరాలు కేటాయిస్తూ సోమవారం పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వు జారీ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బొమ్మల వినియోగానికి అత్యధిక డిమాండ్ ఉందని, ఇటీవల గ్లోబల్ మార్కెట్‌లో 120 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరిగాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బొమ్మల తయారీ రంగానికి ఆదరణ బాగా ఉండటంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పుష్కలంగా ఉన్నందున పార్కు కోసం భూమిని కేటాయించినట్లు వెల్లడించారు.

జనరేటర్‌లోకి దూరి.. విగతజీవిగా మారి..

అనంతలో విషాదాంతం!.. 9 రోజుల తర్వాత వెలుగులోకి



జనరేటర్‌లో మృతదేహం

అనంతపురం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రతకు తట్టుకోలేక ఓ వృద్ధుడు రోడ్డుపక్కన ఉన్న జనరేటర్‌లోకి దూరాడు. అయితే విద్యుదాఘాతంతో లోపలే ప్రాణాలు కోల్పోయాడు. అనంతపురం పట్టణంలో జరిగిన ఈ ఘటన తొమ్మిది రోజుల తర్వాత వెలుగుచూసింది. అనంతపురం టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. సాయినగర్ మొదటి క్రాస్‌లోని భారతి ఆస్పత్రి ఎదుట జనరేటర్ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం జనరేటర్ నుంచి దుర్వాసన వస్తుండడంతో ఆస్పత్రి సిబ్బంది దాన్ని తెరచి చూడగా అందులో వృద్ధుడి మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల ఫుటేజీని గమనించిన పోలీసులు ఈ నెల 8వ తేదీ రాత్రి 7:52 గంటల సమయంలో సుమారు 60 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడు డోర్ తెరిచి అందులోకి ప్రవేశించినట్టు గుర్తించారు. ఆ తర్వాత లోపల విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంటాడని గుర్తించారు. స్థానిక సచివాలయ వీఆర్వో రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఐబొమ్మ ద్వారా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం

- ఉచిత సినిమా ఎరతో 50 లక్షల మంది డేటా తస్కరణ
- రవి వందల కోట్లు క్రిప్టో కరెన్సీగా తరలించాడు: సజ్జనార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి వల్ల సినిమా రంగానికే కాకుండా సమాజానికి కూడా బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ రూపంలో తీరని నష్టం జరిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా రవిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సినీ హీరోలు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు దిల్‌రాజు, సురేష్ బాబులతో కలిసి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, ఇమ్మడి రవిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్, బీఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. రవి కొత్త సినిమాల పైరసీ ద్వారా సినీ పరిశ్రమకు నష్టం చేశారని చెప్పారు. వెబ్‌సైట్లో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ చేస్తున్నాడని, ఆ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలై చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. ఐ బొమ్మ మాస్టర్ మైండ్ రవి వద్ద 1972 నాటి గాడ్‌ఫాదర్ సినిమా మొదలు ఇటీవల వచ్చిన ఓజీ సినిమా వరకు హాలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, ఇతర భాషల సినిమాల పైరేటెడ్ కాపీలు 21వేల వరకు ఉన్నాయని తెలిపారు. పైరసీతో రూ.20 కోట్లు సంపాదించిండాడని, అందులో రూ.3 కోట్లు సీజ్ చేశామని వెల్లడించారు. ఐబొమ్మ వెబ్‌సైట్ల ద్వారా లక్షల మంది ప్రేక్షకులను 1విన్, 1ఎక్స్ బెట్ వంటి అక్రమ బెట్టింగ్ వేదికల వైపు మళ్లించాడని చెప్పారు. రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల సమాచారం ఉందని, ఈ డేటాను ఎవరెవరికి అందించారనే విషయమై లోతైన విచారణ చేపడుతామని చెప్పారు. రవి లేటెస్ట్ టెక్నాలజీ వినియోగించి ఉదయం థియేటర్‌లో రిలీజైన సినిమాను సాయంత్రానికే ఐబొమ్మలో పెట్టేవాడన్నారు. ఈ కేసులో దుద్దెల శివాజీ, సురస్ల ప్రశాంత్‌లను కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఐబొమ్మ, బప్పం టీవీ కొన్నేళ్లుగా సినిమాలను పైరసీ చేస్తున్నాయని, కొన్ని సినిమాలను థియేటర్లలో విడుదల కాగానే కొన్ని సినిమాలను ఓటీటీలో విడుదల కాగానే గంటల వ్యవధిలోనే రెండు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. వీటికోసం 65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. థియేటర్లలో కెమెరాలు పెట్టి, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ర్కీన్ రికార్డ్ చేస్తూ ఆ వీడియోలను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశారని తెలిపారు. ఇక్కడ సంపాదించిన కోట్ల రూపాయల సొమ్మును విదేశాలకు అక్రమంగా తరలించారని తెలిపారు. ఇక్కడ జరిగిన మనీలాండరింగ్ మీద ఈడీకి కూడా సమాచార ం ఇస్తామని చెప్పారు. ఈ వెబ్‌సైట్ల అక్రమ బెట్టింగ్, గేమింగ్ సైట్లకు యూజర్లను బలవంతంగా మళ్లిస్తున్నారని, వ్యక్తిగత డేటా కూడా దొంగతనానికి గురవుతోందని తెలిపారు.

సజ్జనార్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు

పైరసీ ముఠాను అరెస్టుపై సజ్జనార్‌ను ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. సినిమాలు విడుదలైన రోజునే ఇంటర్నెట్‌లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే మహాయజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం స్వాగతించదగ్గ పరిణామం" అన్నారు. బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తెచ్చిందని ప్రశంసించారు.

దమ్ముంటే పట్టుకోండని సవాల్

వెబ్‌సైట్ బ్లాక్ చేస్తే 5 కోట్ల మందికి పైగా యూజర్ల సమాచారం తమ దగ్గర ఉందని రవి బెదిరింపులకు దిగిన విషయాన్ని సజ్జనార్ ప్రస్తావించారు. "వేరే దేశంలో ఉండి దమ్మంటే పట్టుకొండి అని సవాల్ విసిరాడు. ఇప్పుడు ఎక్కడున్నారో చూడండి. తప్పు చేసిన వాళ్లు, చేస్తున్న వాళ్లు చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు" అన్నారు. రవి బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్లు ఫ్రీజ్ చేశామని, మూడు మొబైల్ ఫోన్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఆరు సీపీయూలు, 15 సిగెట్, హెచ్‌డీడీ, ఎస్ఎస్‌డీలు, పెన్ డ్రైవ్‌లు, 10 బ్యాంకు పాస్‌బుక్‌లు, 35 వివిధ బ్యాంకులకు చెందిన చెక్‌బుక్‌లతో పాటు 34 ఐసీఐసీఐ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, హెచ్ఎస్‌బీసీ, ఇండస్, డీబీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఏయూ, ఫెడరల్ బ్యాంక్ వంటి బ్యాంకుల డెబిట్/క్రెడిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదనపు పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు, డీసీపీ దారా కవిత నేతృత్వంలో సైబర్ క్రైం యూనిట్ ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు. "ఇమ్మడి రవి స్వస్థలం విశాఖ. బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. ప్రహ్లాద్ వెల్లాల పేరుతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులు తీసుకున్నాడు. ఏపీలో కూడా డ్రైవింగ్ లైసెన్స్ ఉంది. మొదటి నుంచి అతనిది నేర ప్రవృత్తి. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంటపడ్డారు. భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ థాయ్‌లాండ్, దుబాయ్ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐ బొమ్మ ప్రారంభించాడు. 21 వేల సినిమాలను అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ సర్వర్లలో పెట్టాడు. 110 డొమైన్లను కొనుగోలు చేశాడు. కొత్త సినిమాల పైరసీ చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాడు. వందల కోట్ల నగదు క్రిప్టో కరెన్సీ రూపంలో బదిలీ అయింది. రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం" అని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇతడిపై లోతైన దర్యాప్తు కోరుతూ సీబీఐ, ఈడీలకు లేఖలు రాస్తామన్నారు. పోలీస్ నెట్‌వర్క్ ద్వారా నిందితులను పట్టుకున్నామని, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు తమకు ఎవరూ సహకరించలేదని చెప్పారు.

కష్టాన్ని దోచుకుంటున్నారు: చిరంజీవి

సినీ పరిశ్రమ మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆధారపడి బతుకుతున్నారని, వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించి, పైరసీకి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాజమౌళి తీయబోయే సినిమాతో మన ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరిస్తుందని చెప్పారు. అలాంటి సమయంలోనూ పైరసీ ముప్పు ఉండటం ఆందోళనకరమని అన్నారు.

ఉచితం వెనుక పెద్ద ప్రమాదం: రాజమౌళి

ఏదీ ఉచితంగా రాదని, ఒకవేళ అలా వస్తే దాని వెనుక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుందని, అది చావు వరకూ తీసుకెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. లేటెస్ట్ టెక్నాలజీతో సినిమాలను పైరసీ చేస్తున్నారని, వాటిని అడ్డం పెట్టుకుని ప్రజల వ్యక్తిగత సమాచారం విక్రయించి సంపాదిస్తున్నారని తెలిపారు. మన సమాచారం క్రిమినల్స్ చేతిలో పడటం వల్ల డబ్బులు పోవడమే కాదు ప్రాణాలు పోయే వరకూ వెళ్తోందన్నారు. పైరసీ వల్ల సినిమా వాళ్ల కన్నా చూసేవాళ్లే ఎక్కువ నష్టపోతున్నారని చెప్పారు. పైరసీని అడ్డుకునేందుకు త్వరలో సినీ పరిశ్రమ లేటెస్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకోబోతోందని సురేశ్‌బాబు తెలిపారు.

మీ దేశంలో సేవలు నిలిపివేస్తున్నాం

రవి వద్ద ఉన్న పాస్‌వర్డ్‌ల సాయంతో ఐ బొమ్మ, బప్పం టీవీతో పాటు దానికి అనుబంధంగా ఉన్న 65 వెబ్‌సైట్లను పోలీసులు బ్లాక్ చేయించారు. వెబ్‌సైట్‌లో మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపి వేశామంటూ ప్రస్తుతం అందులో ప్రకటన కనిపిస్తోంది. "ఇటీవల మా గురించి మీకు తెలిసి ఉండవచ్చు లేదా మొదటి నుంచి మీరు మమ్మల్ని అభిమానిస్తూ ఉండవచ్చు, ఏది ఏమైనా మాసేవలు మీ దేశంలో శాశ్వతంగా నిలిపివేస్తున్నాయి. మిమ్మల్ని నిరాశపరిచినందుకు క్షమాపణలు కోరుతున్నాం' అన్న సందేశం కనిపించింది.

మా కుటుంబంలోనూ ఒకరు డిజిటల్ అరెస్టు

రెండ్రోజులు నిర్బంధించారు: నాగార్జున

హైదరాబాద్ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న సైబర్ మోసాల సెగ తన ఇంటికి కూడా తాకిందని టాలీవుడ్ హీరో నాగార్జున తెలిపారు. తమ కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్ మోసం బారినపడ్డారని వెల్లడించారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిని సైబర్ నేరగాళ్లు సుమారు రెండు రోజుల పాటు ఎటూ కదలకుండా ఇంట్లోనే ఉండేటట్లు నిర్బంధించారని చెప్పారు. సినిమా పైరసీ ముఠా అరెస్టు నేపథ్యంలో మాట్లాడిన నాగార్జున తన కుటుంబంపై జరిగిన సైబర్ నేరాన్ని వెల్లడించారు. పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని నాగార్జున అన్నారు.

'పిన్నాపురం' దేశానికే ఆదర్శం



- కేంద్ర విద్యుత్ మంత్రి ఖట్టర్ వెల్లడి
- గ్రీన్‌కో పవర్ ప్రాజెక్టు సందర్శన

ఓర్వకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రపంచ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే ఆదర్శమని కేంద్ర విద్యుత్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురం గ్రీన్‌కో విద్యుత్ ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఇక్కడే విద్యుత్ శాఖపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ సమావేశమైంది. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సౌర, పవన విద్యుదుత్పత్తి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని పెంచడం జాతీయ ప్రాధాన్యంగా మారింది. మా శాఖ ఇప్పటికే అనేక స్టోరేజీ ప్రాజెక్టులను ప్రారంభించింది. భారీ రెన్యువబుల్ స్టోరేజీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్రం భారీగా ఆర్థిక సాయం అందిస్తోంది. 200మెగావాట్ల వరకు సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులకు ప్రతిమెగావాట్‌కు రూ.కోటి సబ్సిడీ ఉంటుంది. దానికి పైబడితే ప్రతి మెగావాట్‌కు రూ.75 లక్షలు సబ్సిడీ ఇస్తున్నాం.'అని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్‌కోగ్రూప్ సీఈవో ఎండీ చలమలశెట్టి అనిల్, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, గ్రీన్‌కో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

గర్భనిరోధక మాత్రల అమ్మకాల జోరు

(మొదటిపేజీ తరువాయి)

లెక్కలు చెబుతున్నాయి. 2019లో మనదేశంలో వీటి అమ్మకాలు సుమారు 33.5 మిలియన్ యూనిట్లు ఉండేది. ప్రస్తుతం వీటి అమ్మకాల విలువ 264 మిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.23,414,023,776) ఉంది. ఇది 2030 నాటికి 377 మిలియన్ డాలర్ల (రూ.33,435,935,468) కు చేరుతుందని అంచనా. ఈ గణాంకాలను బట్టి మహిళలు కుటుంబ నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. 2009 నుంచి 2014 మధ్యకాలంలో ఈ మార్కెట్ 88% వృద్ధి నమోదు చేసింది. తర్వాతి దశాబ్దకాలంలో సగటున 12% చొప్పున వృద్ధి చెందుతోందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

సులభంగా లభ్యం...

లెవోనార్జెస్ట్రెల్ 1.5 ఎం.జీ వంటి నిర్దిష్టమైన గర్భనిరోధక మాత్రలు ఎటువంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం లేకుండా మెడికల్ షాపుల్లో నేరుగా అమ్ముతున్నారు. వీటి అమ్మకాలు పెరగటానికి ఇదే కారణమని చెబుతున్నారు. 2019- 2021 మధ్య కాలానికి సంబంధించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ప్రకారం.. అత్యవసర గర్భనిరోధక మాత్రలను తీసుకునే మహిళల్లో 57% మంది వాటిని మెడికల్ షాపుల నుంచి నేరుగా కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. మిగిలినవారు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ క్లినిక్‌ల ద్వారా వాటిని పొందారు. ఈ అమ్మకాల వృద్ధి కారణంగా అన్ని రకాల గర్భనిరోధక పద్ధతుల రేటు కూడా పెరిగింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 54 శాతం ఉన్న గర్భనిరోధక పద్ధతుల వినియోగ రేటు, 2019-21 నాటికి 67 శాతానికి పెరిగినట్లు తేలింది. సులభంగా లభించటంతో టీనేజర్లు అవాంఛిత గర్భాన్ని నిరోధించేందుకు వీటిని ఎంచుకుంటున్నారని 2021లో నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీబీఐ) అధ్యయనంలో వెల్లడైంది. మనదేశంలో అవాంఛిత గర్భాల రేటు 11.9 శాతం ఉన్నట్లు ఆ అధ్యయనంలో తేలింది. ఈ అవాంఛిత గర్భాల నిరోధానికి విరివిగా వాడుతుండటంతో ఈ పీసీల అమ్మకాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే కుటుంబ నియంత్రణపై ప్రభుత్వాల చొరవ, అవగాహన కార్యక్రమాలు కూడా ఈ మాత్రల డిమాండ్‌ను పెంచుతున్నాయని చెబుతున్నారు. ఈపీసీల వినియోగం పెరగటంతో కండోమ్ విక్రయాలు తగ్గుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కండోమ్ విక్రయాల్లో 41%తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఫ్రాన్స్ రెండో స్థానంలో ఉంది. భారత్, ఆస్ట్రేలియా, ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మనదేశంలో మొత్తం కండోమ్‌ల విక్రయాల్లో ఆన్‌లైన్ అమ్మకాల వాటా 34 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే ఐదేళ్లలో వీటి విక్రయాలు 17% వరకు తగ్గాయని నివేదికలు చెబుతున్నాయి. ఈసీపీలు ఎక్కువ కాలం వినియోగిస్తే ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. వాస్తవానికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే వీటిని విక్రయించేలా నిబంధనలు మార్చాలనే ప్రతిపాదనలు గతంలో వచ్చాయి. కానీ, ఓవర్ ది కౌంటర్ ద్వారా లభ్యమయ్యే నిర్దిష్ట మాత్రల విషయంలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని కేంద్రప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

ఇష్టం వచ్చినట్లు వాడితే ప్రమాదం



ఈసీపీలు ఇష్టం వచ్చినట్లు వాడితే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. నెలసరిలో సమస్యలు వస్తాయి. బరువు పెరుగుతారు. రక్తపోటు పెరుగుతుంది. కొన్నిసార్లు శరీరం వాపు వస్తుంది. దీంతోపాటు కడుపు ఉబ్బరం, కడుపులో వికారం, తలనొప్పి, వాంతులు లాంటి సమస్యలు వస్తాయి. రొమ్ముల్లో ఒక రకమైన ఇబ్బంది ఏర్పడుతుంది. అలాగే రెగ్యులర్ గర్భనిరోధక మాత్రలు వాడేవారిలో చర్మ సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువ కాలం వాడితే కొన్నిసార్లు గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

- డాక్టర్ ఎస్. విజయలక్ష్మి, గైనకాలజిస్టు

పార్సిల్‌లో డ్రగ్స్.. 33 కోట్లు స్వాహా

మహిళా టెకీపై సైబర్ వల.. సీబీఐ పేరిట బురిడీ

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీలో ముందుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ మహిళా టెకీని 'మీ పేరిట వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి.. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ.. బెదిరించిన కేటుగాళ్లు ఆరు నెలల్లో దాదాపు రూ.32 కోట్లు కాజేయడం తీవ్ర సంచలనం రేపింది. బెంగళూరులోని ఇందిరానగర్‌కు చెందిన 57 ఏళ్ల మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు 2024 సెప్టెంబరు 15న డీహెచ్ఎల్ కొరియర్ సర్వీస్ నుంచి మాట్లాడుతున్నామని ఓవ్యక్తి ఫోన్‌చేశాడు. 'మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ ఉన్నాయి. ముంబై అంధేరిలోని డీహెచ్ఎల్ కొరియర్‌కు ఈ పార్సిల్ వచ్చింది.' అని సమాచారం ఇచ్చారు. తాను బెంగళూరులో నివసిస్తున్నానని, ఆ పార్సిల్ తనది కాదని ఆమె బదులిచ్చారు. దీంతో 'మీ ఫోన్ నంబరు ఈ పార్సిల్‌కు లింక్ అయింది. ఇది సైబర్ నేరం. సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశాం. అక్కడి నుంచి ఓ సీబీఐ అధికారి మిమ్మల్ని సంప్రదిస్తారు..' అని చెప్పి ఆ వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. కాసేపటికి మరో ఫోన్‌కాల్ వచ్చింది. అతను సీబీఐ అధికారినని పరిచయం చేసుకున్నాడు. పార్సిల్ విషయమై బెదిరించాడు. 'మీపైనా, మీ ఇంటిపైనా నిఘా పెట్టాం. స్థానిక పోలీసులను సంప్రదించినా, న్యాయసాయం కోసం ప్రయత్నించినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. ఈ కేసు ముంబైలో నమోదైంది. ఇక్కడి వారితోనే మాట్లాడాలి..' అని హెచ్చరించాడు. రెండురోజుల తర్వాత స్కైప్ వీడియోకాల్ చేసి టెకీని 'డిజిటల్ అరెస్టు' చేస్తున్నట్లు బెదిరించారు. సీబీఐ అధికారిగా చెప్పుకొన్న ప్రదీప్‌సింగ్ ఆమెకు ఫోన్ చేసి 'వారం రోజులపాటు రాహుల్ యాదవ్ అనే అధికారి మిమ్మల్ని పర్యవేక్షిస్తారు' అని సమాచారం ఇచ్చాడు. 2024 సెప్టెంబరు 23న ప్రదీప్‌సింగ్ పేరిట ఫోన్ చేసి, ఆర్‌బీఐ ఫైనాన్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌టీయూ)కు ఆస్తుల వివరాలు చూపాలని సూచించాడు. అతడు చెప్పినట్టే ఆమె చేశారు. ఆ తర్వాత మీరు ఈ కేసు నుంచి బయటపడాలంటే కొంత నగదు డిపాజిట్ చేయాలని ఒత్తిడి చేసిన మోసగాళ్లు విడతలవారీగా నగదు బదిలీ చేయించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోగా పరిశీలన జరిపి, ఆ సొమ్మును తిరిగి బదిలీ చేస్తామని చెప్పారు. తర్వాత నుంచి వారు ఆమెకు ఫోన్ చేయలేదు. దీంతో ఆమె ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై దర్యాప్తు ప్రారంభించారు.

10 లక్షలు.. రెండు ఉద్యోగాలు

ఇద్దరు స్నేహితులకు టోకరా

అటవీ శాఖ పేరిట నకిలీ నియామకాలు

రాజమహేంద్రవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ శాఖలో ఉద్యోగాలు ఆశ జూపి మోసం చేయబోయిన ఇద్దరు వ్యక్తుల నుంచి మరో ఇద్దరు నిరుద్యోగులు తృటిలో తప్పించుకున్నారు. రూ.10 లక్షలు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికిన వ్యక్తుల మోసాన్ని గ్రహించి.. వారి ఉచ్చు నుంచి బయటపడ్డారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన నవంత్, ఆలమూరుకు చెందిన రాజ్‌కుమార్ డిగ్రీ చదువుకున్నారు. రెండు నెలల కిందట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. రాజ్‌కుమార్, నవంత్‌లు ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలని అనుకున్నారు. కానీ, రాజ్‌కుమార్ దరఖాస్తు చేసినా.. నవంత్ మాత్రం అప్లికేషన్ పెట్టలేదు. ఇదిలావుంటే, నవంత్, రాజ్‌కుమార్‌లకు కొత్తపల్లికి చెందిన ఒక యువకుడి ద్వారా తొలుత ఎక్సైజ్ శాఖలో జీపు డ్రైవరుగా పనిచేస్తున్న ఉద్యోగి పరిచయం అయ్యారు. తర్వాత ఈ ఉద్యోగి ద్వారా కోటికేశవరానికి చెందిన జల్లూరు రాజ్‌కుమార్, ధవళేశ్వరానికి చెందిన యర్రంశెట్టి ప్రసాద్ పరిచయమయ్యారు. వీరిద్దరూ అటవీ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, దీనికి కొంత ఖర్చవుతుందని నవంత్, రాజ్‌కుమార్‌లను నమ్మించారు. దీంతో ఆశపడిన స్నేహితులు జల్లూరు రాజ్‌కుమార్‌తో రెండు రోజుల కిందట ఫోన్‌లో మాట్లాడి రూ.10 లక్షలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లను సోమవారం రాజమహేంద్రి ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు కార్యాలయానికి తీసుకొస్తున్నాని.. అడ్వాన్స్‌గా రూ.లక్ష చొప్పున ఇద్దరూ రూ.2 లక్షలు తీసుకురావాలని రాజ్‌కుమార్ చెప్పాడు. ఇద్దరూ అక్కడికి వెళ్లగా పార్కింగ్‌లో రాజ్‌కుమార్ మాట్లాడి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇచ్చారు. ఒకరికి చింతూరు, మరొకరికి రంపచోడవరంలో పోస్టింగ్ ఇచ్చినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్‌సెక్రటరీ సంతకం, అటవీ శాఖ స్టాంపుతో రెండేసి ప్రింటెడ్ కాగితాలను చేతిలో పెట్టాడు. ఈ వ్యవహారంపై ఉప్పందడంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వీళ్లను పిలిచి ఆరాతీయగా విషయం బయటపడింది. డబ్బులందాయంటూ రాజ్‌కుమార్‌తో ఫోన్ చేయించి మరో నిందితుడు ప్రసాద్‌ని అటవీ శాఖ సంరక్షణాధికారి కార్యాలయానికి రప్పించారు. ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. 282/2025గా ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించి ఎవరైనాసరే ప్రక్రియను పాటించాల్సిందేనని, ఇలాంటి వాళ్లను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఎఫ్ఆర్‌వో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ వెలువడిందని, స్క్రీనింగ్ టెస్ట్ మాత్రమే పూర్తయిందని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకరరావు తెలిపారు.

3 తరాలు బుగ్గి

ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి..

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీ బస్సు ప్రమాదం మాటలకందని విషాదం!! ఆ కుటుంబంలోని నిన్నటితరం, నేటి తరం, రేపటి తరం ఇలా మూడు తరాల వారంతా మృతిచెందడం గుండెలను పిండేస్తోంది. 8 మంది పెద్దలు, 10 మంది పిల్లలు మొత్తం 18మంది బస్సు ప్రమాదంలో మృతిచెందారు. రైల్వేలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఇంటిపెద్ద అయిన 70 ఏళ్ల నసీరుద్దీన్‌ది పెద్ద కుటుంబమే! విద్యానగర్‌లో ఉంటున్న ఆయనకు వయసుపైబడిన తల్లి రోషన్ బీతో పాటు భార్య అక్తర్ బేగం (65), కుమారులు సిరాజుద్దీన్, సలావుద్దీన్ , కూతుళ్లు అమీనా బేగం, రిజ్వానా బేగం, షబానా బేగం ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లయ్యాయి. పెద్ద కుమారుడు సిరాజుద్దీన్‌కు భార్య సన, ముగ్గురు పిల్లలు.. సలావుద్దీన్‌కు భార్య ఫర్హానా, ముగ్గురు పిల్లలు, అమీనాకు కూతురు, షబానాకు కుమారుడు, రిజ్వానాకు కూతురు, కుమారుడు ఉన్నారు. సిరాజుద్దీన్, భార్యాపిల్లలతో అమెరికాలో ఉంటున్నారు. సలావుద్దీన్, కూతుళ్లు అమీనా, రిజ్వానా తమ తమ కుటుంబాలతో నగరంలోనే వేర్వేరుగా ఉంటున్నారు. కుటుంబసభ్యులందరితో మక్కా యాత్ర చేసిరావాలని నసీరుద్దీన్ చిరకాల స్వప్నం! ఇటీవల అమెరికా నుంచి సిరాజుద్దీన్ భార్య సన, పిల్లలు హైదరాబాద్‌కొచ్చారు. సలావుద్దీన్‌కూ సెలవు దొరకడంతో మక్కా యాత్రకు ఇదే అనువైన సమయం అని నసీరుద్దీన్ అనుకున్నారు. అమెరికా నుంచి నేరుగా మక్కా రావాలని సిరాజుద్దీన్‌కుచెప్పారు. తన తల్లి రోషన్ బీని నసీరుద్దీన్ తన సోదరి వద్ద వదిలిపెట్టారు. ఈనెల 9న తాను, తన భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కోడళ్లు, ముగ్గురు కుమార్తెలు.. 10మంది మనుమలు, మనుమరాళ్లతో నసీరుద్దీన్ మక్కా బయలుదేరారు. 23న తిరిగిరావాలనుకున్నారు. అయితే వెళ్లినవారిలో ఒక్కరూ మిగలకుండా ప్రాణాలు కోల్పోయారు. అనుకున్న తారీఖున టికెట్ దొరక్కపోవడంతో సిరాజుద్దీన్ అమెరికాలోనే ఉండిపోయారు. ప్రస్తుతం ఇంట్లో నాన్నమ్మ (నసీరుద్దీన్ తల్లి) రోషన్ బీ, తాను మాత్రమే మిగిలారు. ప్రమాదంలో నసీరుద్దీన్ మనుమలు, మనుమరాళ్లలో ఒక్కరూ మిగలకుండా అందరూ ప్రాణాలు కోల్పోవడం పెను విషాదం.



కుటుంబసభ్యులతో నసీరుద్దీన్ (ఫైల్)

45 మంది సజీవదహనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 9న హైదరాబాద్ నుంచి జెడ్డాకు వెళ్లింది. ఈ నెల 23 వరకు వివిధ ప్రాంతాలను సందర్శించుకునే విధంగా వారు పర్యటనను రూపొందించుకున్నారు. ఆదివారం మక్కా యాత్రను ముగించుకున్న తర్వాత 46 మంది మదీనాకు బస్సులో బయలుదేరారు. మిగతా 8 మందిలో నలుగురు మక్కాలోనే ఉండగా.. మరో నలుగురు మదీనాకు కారులో వెళ్లారు. అయితే యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సు.. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలోని ముఫ్రిహాత్ వద్ద డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి 45 మంది కాలి బూడిదైపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న అబ్దుల్ షోయబ్(25) మాత్రం గాయాలతో బయటపడ్డాడు. అతను మదీనాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ విలేకరులకు తెలిపారు. 45 మందిలో 44 మంది హైదరాబాద్ వాసులు కాగా.. ఓ వ్యక్తి హుబ్లీకి చెందిన వారని తెలంగాణ హజ్ కమిటీ తెలిపింది. మృతులు హైదరాబాద్‌లోని మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ వాసులని పేర్కొంది. మృతుల్లో 18 మంది మహిళలు, 17 మంది పురుషులు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. విద్యానగర్‌లోని ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. టప్పాచబుత్రలోని ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు, మొఘల్‌కానాలోని ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు, జిర్రాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన వారిలో ఉన్నారు. మొత్తం నాలుగు ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా వెళ్లారని, ఎవరూ హజ్‌హౌస్ ద్వారా వెళ్లలేదని హజ్ కమిటీ స్పష్టం చేసింది. ఇది హజ్ యాత్రకు వెళ్లే సమయం కాదంది. ఉమ్రా యాత్రకు ఎప్పుడైనా వెళ్లవచ్చని తెలిపింది. హజ్ యాత్రకు, ఉమ్రా యాత్రకు సంబంధం ఉండదని వివరించింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణ సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వివరాల కోసం 79979 59754, 99129 19545 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 040 27852333 లేదా ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ 87126 60381ను సంప్రదించాలని సీపీ సజ్జనార్ చెప్పారు.

దుబాయ్ నుంచి వచ్చి..

ఘటనలో మృతి చెందిన ఇర్ఫాన్ అహ్మద్ (45) దుబాయ్‌లో పనిచేస్తుంటారు. కుటుంబం హైదరాబాద్‌లోని మొఘల్‌కానాలో ఉంటుంది. తల్లి సబీబా సుల్తానా (67), భార్య హుమీరా నజీన్ (32), కుమారులు ఇజాన్ అహ్మద్ (8), హమీద్ అహ్మద్(6)ను ఉమ్రా యాత్రకు తీసుకెళ్లేందుకు ఈ నెల 7న ఇర్ఫాన్ హైదరాబాద్ వచ్చారు. 9న కుటుంబ సభ్యులను యాత్రకు తీసుకెళ్లారు. తండ్రి సలీం అహ్మద్ మాత్రం ఇంటి వద్దే ఉండిపోయారు. 4 రోజుల్లో వస్తారనుకున్న కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో సలీం గుండెలవిసేలా రోదిస్తున్నారు.

హైదరాబాద్ టూ సౌదీ అరేబియా..

ఉమ్రా యాత్ర చేయడానికి రోజూ వందలాది మంది యాత్రికులు హైదరాబాద్ నుంచి సౌదీ అరేబియాకు వెళ్తుంటారు. మక్కా, మదీనాలను సందర్శించి వస్తారు. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 200 వరకు వివిధ టూర్ ఆపరేటర్లు ఉమ్రా యాత్రలను నిర్వహిస్తుంటారు. మక్కా, మదీనాల మధ్య 440 కిలోమీటర్ల హైవేపై నిరంతరం వేలాది మంది బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. అతి వేగం, నిద్రలేమి కారణాలతో అప్పుడప్పుడు ఇలాంటి ఘోర ప్రమాదాలు జరుగుతుంటాయి.

రెండు వారాలకంటే ఎక్కువే కావచ్చు..

సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాల నిబంధనల ప్రకారం అగ్నిప్రమాద మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేసిన తర్వాతే వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. డీఎన్ఏ పరీక్షల ఫలితాలు రావడానికి వారం, రెండు వారాలు.. అంతకంటే ఎక్కువ సమయం కూడా పట్టొచ్చు. తాజాగా హైదరాబాద్‌లో అధికారులు ప్రకటించిన విధంగా మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరు సౌదీ వచ్చినా.. డీఎన్ఏ ఫలితాలు వచ్చి, మృతదేహాలు అప్పగించేదాకా వారు అక్కడే ఉండాలి.

మృతుల కుటుంబాలకు 5లక్షలు

ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందించాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యేతోపాటు మైనారిటీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన బృందాన్ని సౌదీకి పంపింది. మృతుల అంత్యక్రియలను మత సంప్రదాయం ప్రకారం మక్కాలోనే నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరు చొప్పున మృతుల బంధువులను మక్కా తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మోదీ, ఉపరాష్ట్రపతి, సీఎంల దిగ్ర్భాంతి

సౌదీలో ఘోర ప్రమాదంపై ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు లోకేశ్, ఫరూక్ కూడా సంతాపం తెలిపారు.

చిన్న అప్పన్న పెద్ద ముదురు!

(మొదటి పేజీ తరువాయి)

వైద్య పరీక్షలు చేయించారు. ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు ధ్రువీకరించడంతో నేరుగా సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. విచారణలో వైవీ సుబ్బారెడ్డికి చిన్నఅప్పన్న ఎలా పరిచయమయ్యారు...అంతకుముందు ఏం చేసేవారు....వైవీతో పరిచయానికి ముందు, తర్వాత ఆయన ఆస్తుల స్థాయి ఏమిటనే అంశాలపై సిట్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాల్లో భారీగా నగదు, విశాఖ పరిసరాల్లో ఆస్తులు ఎలా సమకూరాయన్న ప్రశ్నకు తనకు అంత స్థోమత లేదని చిన్న అప్పన్న సమాధానమిచ్చినట్టు తెలిసింది. అంత స్థోమత లేనప్పుడు ఇన్ని వ్యవహారాలు ఎలా నడిపావని, టీటీడీకి నెయ్యి సరఫరాచేసే డెయిరీల డైరెక్టర్లు, వారి కుటుంబసభ్యులు, వారి ఫోన్ నంబర్లు ఎలా తెలిశాయంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. నెయ్యి సరఫరా వ్యవహారం వెనుక చాలా మంది ఉన్నారని, తనను పావుగా వాడుకున్నారని చిన్న అప్పన్న సమాధానమిచ్చినట్టు తెలిసింది. వైవీ సుబ్బారెడ్డికి తెలియకుండా తాను ఏ పనీ చేయలేదని చెప్పినట్టు సమాచారం.

వైవీ వద్ద పనివాడిగా చేరి.... ఢిల్లీలో రాజభోగాలు

హైదరాబాద్‌లో ఓ అధికారి చిన్న అప్పన్నను వైవీ సుబ్బారెడ్డికి పరిచయం చేశారని తెలుస్తోంది. 'నమ్మకంగా ఉంటాడు... దగ్గర పెట్టుకోండి' అని సిఫారసు చేసినట్టు తెలిసింది. అలా వైవీ వద్ద చేరిన చిన్న అప్పన్న 2014-19 నడుమ ఆయన చెప్పే పనులు చేసేవారని సమాచారం. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో చిన్న అప్పన్న స్థాయి అమాంతం పెరిగినట్టు సిట్ గుర్తించింది. ముఖ్యంగా ఆ ఐదేళ్లూ ఢిల్లీ కేంద్రంగా వైవీ సుబ్బారెడ్డి తరఫున పెద్దపెద్ద పనులు చేశారని తెలుస్తోంది. 2019-24 మధ్య ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఓఎస్‌డీ కమ్ స్పెషల్ లైజన్ ఆఫీసర్ హోదాలో చిన్న అప్పన్నను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రొటోకాల్ వాహనం, బంగ్లా, విమాన చార్జీలు... ఇలా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రాజభోగాలు అనుభవించినట్టు సిట్ గుర్తించింది. నాలుగేళ్లలో ఇతర సదుపాయాలు కాకుండా కేవలం వేతనం కింద రూ.64 లక్షలదాకా ఆయన ఖాతాలో జమ అయినట్టు సమాచారం. ఢిల్లీలోనే కాకుండా చెన్నై, తిరుపతి... ఇలా ఎక్కడికి వెళ్లినా ప్రొటోకాల్ వాహనం ఉపయోగించేవారని, ఎక్కువ హడావిడి చేసేవారని సమాచారం. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే సంస్థలు, పరిమాణం, ధరలు వంటి వివరాలన్నింటినీ అప్పటి టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం ఒకరు చిన్నఅప్పన్నకు అందజేసినట్టు సిట్ గుర్తించింది. 2019 నుంచి 2023వరకూ ఆ విభాగానికి జీఎంగా సుబ్రమణ్యం పనిచేశారని, ఆయనే 2022 ఏప్రిల్‌లో టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీల పేర్లు, వాటి తయారీ సామర్థ్యం, టీటీడీకి సరఫరా చేస్తున్న పరిమాణం, టెండర్ల గడువు, నెయ్యి ధరల సమాచారాన్ని చిన్నఅప్పన్నకు అందజేసినట్టు సిట్ గుర్తించింది.

తిరుపతికి భోలేబాబా ప్రతినిధిని రప్పించి..

అప్పటి టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం నుంచి సమాచారాన్ని సేకరించిన చిన్న అప్పన్న, ఆ మరుసటి నెలలోనే టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీలలో ఒకటైన భోలేబాబా డెయిరీ అధికారిక ప్రతినిధి కైలేశ్ చాంద్‌మాంగ్లాను సంప్రదించినట్టు సమాచారం. ఆయనను తిరుపతికి పిలిపించి కమీషన్ల గురించి బేరసారాలు ఆడినట్టు సమాచారం. ఆ తర్వాత చిన్న అప్పన్న ఫోన్ చేసి ఆరా తీయగా, తమ యజమానులు కమీషన్ ఇవ్వడానికి అంగీకరించలేదని కైలేశ్ చెప్పారని, దాంతో చిన్న అప్పన్న నేరుగా పొమిల్ జైన్, విపిన్ జైన్‌లకే ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలిసింది. అయితే పొమిల్ జైన్, విపిన్ జైన్ కూడా కమీషన్ చెల్లించడానికి ఒప్పుకోలేదని సమాచారం. దీంతో అదే ఏడాది ఆగస్టులో భోలేబాబా నెయ్యి శాంపిల్స్ మైసూరు ల్యాబ్‌కు పంపారు. ఎక్కువ శాతం రసాయనాలతో నెయ్యి తయారు చేశారంటూ రిపోర్టు వచ్చింది. దాన్ని అడ్డుపెట్టుకుని భోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సరఫరాను నిలిపివేసినట్టు తెలిసింది. ఆ తర్వాత చిన్న అప్పన్న ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ డెయిరీతో సంప్రదింపులు జరిపి టీటీడీ నెయ్యి కాంట్రాక్టు వారికి దక్కేలా చేశారని, దానికి ప్రతిఫలంగా హవాలా మార్గంలో ఒకసారి రూ.20 లక్షలు, మరోసారి రూ.30 లక్షలు చొప్పున చిన్న అప్పన్నకు మొత్తం రూ.50 లక్షలు అందినట్టు సిట్ గుర్తించింది.

కోర్టులో చిన్న అప్పన్నకు చుక్కెదురు

చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టు సోమవారం కొట్టివేసింది. కల్తీ నెయ్యి సరఫరాలో చిన్న అప్పన్నదే కీలకపాత్ర అని సిట్ బృందం, ఏపీపీ చేసిన వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ కేసులో ఏ 24 నిందితుడిగా ఉన్న చిన్న అప్పన్నను గత నెల 29న సిట్ అరెస్టు చేసింది. అదే రోజు నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. గత నెల 30న చిన్న అప్పన్నకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన తరపు న్యాయవాది యుగంధర్‌రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఈనెల 12న కోర్టులో ఇరుపక్షాలూ తమ వాదనలు వినిపించాయి. సిట్ తరపున ఏపీపీ జయశేఖర్ వాదనలు వినిపించారు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో చిన్న అప్పన్న కీలక పాత్ర పోషించారని, కేసు దర్యాప్తు కీలకదశలో ఉన్న ప్రస్తుత తరుణంలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను, ఇతర అంశాలను ప్రభావితం చేసే ప్రమాదముందని కోర్టును అభ్యర్థించారు.

న్యూ ఇయర్‌కి ఎక్కడుంటారో తేల్చుకోండి!

తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరిక

- ఆదేశం పాటిస్తారా?... ధిక్కారం కేసు ఎదుర్కొంటారా?
- 4 వారాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తేల్చండి
- స్పీకర్‌తో పాటు ప్రతివాదులకు నోటీసులు జారీ

న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 10 మంది శాసన సభ్యుల ఫిరాయింపు వ్యవహారంపై స్పీకర్ విచారణలో జాప్యాన్నిసుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. రోజువారీగా విచారించాలని, ఎమ్మెల్యేలు సహకరించకపోతే వేటు వేయాలని గత ఆదేశాల్లోనే స్పష్టం చేశామని గుర్తు చేసింది. తమ ఆదేశాలు పాటిస్తారో? లేదంటే కోర్టు ధిక్కారాన్ని ఎదుర్కొంటారో? సభాపతి తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. "అనర్హత అంశంపై నాలుగు వారాల్లో తేల్చండి.. లేదంటే న్యూ ఇయర్ వేడుకలు ఎక్కడ చేసుకుంటారోనిర్ణయించుకోండి?" అని స్పీకర్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై వీలైనంత త్వరగా, లేదంటే మూడు నెలల్లో విచారించి నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జూలై 31 సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు విధించిన గడువు అక్టోబరు 31తో ముగిసింది. స్పీకర్‌గా రాజ్యాంగ బాధ్యతలు, హైదరాబాద్‌లో వరదలు, రోజువారీ కార్యక్రమాలు, అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనల కారణంగా సుప్రీంకోర్టు విధించిన గడువులోగా విచారించడం సాధ్యం కాలేదని చెబుతూ అక్టోబరు 31న స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు లేఖ రాసింది. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న ఎమ్మెల్యేలు సైతం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అకాల వర్షాల నేపథ్యంలో వరద సహాయక చర్యల్లో పాల్గొనడం కారణంగా నియోజక వర్గాల్లోనే ఉండాల్సి వస్తోందని, మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై విచారణలో స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్‌దాఖలు చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరారు. పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలుచేశారు. గడువు కోరుతూ స్పీకర్ దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు బీఆర్ఎస్ రెండు పిటిషన్లు కలిపి సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది.

ఉద్దేశ పూర్వకంగానే తత్సారం: బీఆర్ఎస్

అసెంబ్లీ స్పీకర్‌కు అనర్హత పిటిషన్లపై విచారణను ముగించాలనే ఉద్దేశం లేదని, కావాలనే తాత్సారం చేస్తున్నారని బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేనందున విచారణను వాయిదా వేయాలని ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్ కోరారు. ఉదయమే ఒకసారి పాస్ ఓవర్ అడిగితే ఇచ్చామని, ఇంకెన్ని సార్లు ఇవ్వాలని సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. ఎండ్ ఆఫ్ ది బోర్డు(రోజులో చివరి కేసుగా) విచారించాలని శ్రవణ్ అభ్యర్థించగా, సీజేఐ తిరస్కరించారు. రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో శ్రవణ్ వాదనలు వినిపించడంప్రారంభించారు. నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి విచారణ పూర్తయిందని, తీర్పు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. "పది మంది ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లపై రోజువారీ విచారణ జరపాలని గతంలోనే చెప్పాం కదా?" అని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం కలుగజేసుకుని, నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి కూడా స్పీకర్ మూడు వారాల క్రితం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మరో నలుగురికి సంబంధించి ఆధారాలన్నీ సమర్పించినా విచారణ తేదీలు ఇవ్వలేదని తెలిపారు. ఫిరాయింపు వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఇద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్ నోటీసులకు కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని వెల్లడించారు. స్పీకర్ కావాలనే కాలయాపన చేస్తున్నారని, అనర్హతపై నిర్ణయం తీసుకునే ఉద్దేశం ఆయనకు లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాలను ఏ మాత్రం లెక్కచేయలేదని, దీనిని అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉన్నదని, స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు ఇవ్వాలని కోరారు. స్పీకర్ కార్యాలయం తరఫున మరోసారి శ్రవణ్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ మను సింఘ్వి కోర్టు హాలుకు చేరుకున్నారు. అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ, హైదరాబాద్‌లో వరదల కారణంగా 10 రోజులు ఆలస్యం అయిందని, విచారణ పూర్తి చేయడానికి మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని ధర్మాసనం ఎదుట అభ్యర్థించారు. సింఘ్వి అభ్యర్థనపై సీజేఐ, జస్టిస్ బీఆర్ గవాయి అసహనం వ్యక్తం చేశారు. "10 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపునకు సంబంధించి రోజువారీగా విచారించాలని గత ఆదేశాల్లో స్పష్టం చేశాం. ఒకవేళ ఎవరైనా ఎమ్మెల్యేలు ఉద్దేశ పూర్వకంగా విచారణను పొడిగించాలని చూస్తే వేటు వేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. మళ్లీ వచ్చి సమయం అడుగుతున్నారు. ఇదేం మంచి పద్ధతి కాదు. ఎమ్మెల్యేల అనర్హతపై చర్యలు తీసుకుంటారో?కోర్టు ధిక్కారాన్ని ఎదుర్కొంటారో? ఆయన(స్పీకర్‌ను ఉద్దేశిస్తూ) ఇష్టం. నాలుగు వారాల్లో తేలుస్తారో? లేదంటే ఈ న్యూ ఇయర్ వేడుకలు ఎక్కడైనా, ఇంకెక్కడైనా చేసుకోవాలని నిర్ణయించుకుంటారో? ఆయన ఇష్టం" అని జస్టిస్ గవాయ్ హెచ్చరికగా వ్యాఖ్యానించారు. స్పీకర్‌తోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ అంశం మరోసారి డిసెంబర్ 19న విచారణకు వచ్చే అవకాశముంది.

కబడ్డీకి కష్ట కాలం..!

అసోసియేషన్ కోసం ఆధిపత్య పోరు
ఒకరిపై ఒకరు ఫిర్యాదులకే పరిమితం

అమరావతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడగా కూడా కబడ్డీకి గుర్తింపు ఉంది. అయితే కొందరు వ్యక్తుల స్వార్థం, కబడ్డీ అసోసియేషన్‌పై ఆధిపత్య పోరు కోసం చేస్తున్న ప్రయత్నాల్లో రాష్ట్రంలో కబడ్డీకి కష్టకాలం వచ్చింది. కొంతమంది ప్రతిరోజూ శాప్ కార్యాలయానికి రావడం.. క్రీడాకారులపైనా, టోర్నమెంట్ల నిర్వహణపైనా, అసోసియేషన్ల తీరుపైనా ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకున్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్).. అంతర్గత విచారణ జరపగా... ఎలాంటి అవకతవకలూ వెలుగులోకి రాలేదు. దీంతో రాష్ట్రంలోని కబడ్డీ అసోసియేషన్ల పేరుతో హడావిడి చేసే వారిపైనా, తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని శాప్ నిర్ణయించింది. దీనికోసం త్రిసభ్య కమిటీ వేసేందుకు సిద్ధమైంది. శాప్ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు అధికారులతో పాటు ఒక లీగల్ నిపుణుడితో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కమిటీ ఇప్పటి వరకూ వచ్చిన ఫిర్యాదులను క్షణ్ణంగా పరిశీలిస్తుంది. వాటిలో పేర్కొన్న వివరాలు నిజమేనా..? లేదా ఎవరో ఒకరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారా..? అనే కోణంలో విచారణ చేపడుతుంది. ఎవరైనా శాప్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఫిర్యాదులు చేసినట్టు గుర్తిస్తే మాత్రం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అవసరమైతే శాప్ అధికారులే క్రిమినల్ కేసులకు సిఫారసు చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి కొంతమంది వ్యక్తుల ఆధిపత్య పోరు వల్ల మూడేళ్లుగా కబడ్డీ అసోసియేషన్‌కు సరైన గుర్తింపు దక్కడంలేదు. దీంతో క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మూడేళ్ల నుంచి ఆటగాళ్లకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కూడా అందడం లేదు. దీంతో కబడ్డీ ఆడేవారి సంఖ్య కూడా చాలా వరకూ తగ్గిపోతోంది. ఒకవేళ ఆడినా ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన ప్రోత్సాహకాలు అందడం లేదు.

'ఉపాధి' పనిదినాల్లో కోత!

ఈ ఏడాది 18 కోట్లకు పరిమితం చేసిన కేంద్రం.. గత ఏడాది 24 కోట్ల పనిదినాలు మంజూరు

- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనకే కొంత మేలు
- మెటీరియల్ నిధులు కూడా తగ్గే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పనిదినాల సంఖ్యను తగ్గిస్తోంది. గతేడాది మన రాష్ట్రానికి 24 కోట్ల పనిదినాలను మంజూరు చేయగా.. ఈ ఏడాది మొత్తంగా 18 కోట్ల పనిదినాలు మాత్రమే మంజూరు చేసింది. మొదటి విడతలో కేటాయించిన 15 కోట్ల పనిదినాలు నెల కిందటే పూర్తయ్యాయి. దీంతో మరో 9 కోట్ల పనిదినాలు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయితే కేంద్రం ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా పనిదినాల సంఖ్యను తగ్గించాలన్న యోచనతో మన రాష్ట్రానికి 3 కోట్ల పనిదినాలు మాత్రమే మంజూరు చేశారు. పనిదినాల మంజూరు తగ్గింపును కేంద్రం అన్ని రాష్ట్రాలకు వర్తింపచేసింది. తెలంగాణకు గతంలో 6 కోట్ల పనిదినాలు కల్పించగా, తాజాగా ఒక కోటి పనిదినాలు మాత్రమే అదనంగా మంజూరు చేశారు. ఇతర రాష్ట్రాల కంటే కొంత మెరుగ్గానే మన రాష్ట్రానికి పనిదినాలు మంజూరయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు అయింది. ప్రతి ఏటా పనిదినాలను పెంచడం ద్వారా చాలా రాష్ట్రాలు దుర్వినియోగం చేస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అంతే కాకుండా ఎన్నేళ్లయినా ఉపాధి పనిదినాలు మంజూరు చేయడం ద్వారా ఉపాధి లక్ష్యం నెరవేరినట్లు కాదని కేంద్ర అధికారులు చెప్తున్నట్లు సమాచారం. దీంతో పనిదినాల సంఖ్య భవిష్యత్తులో ఇంకా తగ్గిపోతుందని పేర్కొంటున్నారు.



ఐదేళ్లతో పోలిస్తే తగ్గిన లేబర్ బడ్జెట్

గత ఐదేళ్లతో పోలిస్తే కేంద్రం రాష్ట్రానికి కేటాయించే లేబర్ బడ్జెట్ (పని దినాల సంఖ్య) ఈ ఏడాది తగ్గింది. 2021-22 నుంచి ఈ బడ్జెట్ ఎన్నడూ 24 కోట్లకు తగ్గలేదు. 2021-22, 2022-23ల్లో 24 కోట్లు, 2023-24లో 25.54 కోట్లు, 2024-25లో 24.22 కోట్ల లేబర్ బడ్జెట్ కేంద్రం కేటాయించింది. అయితే ఈ ఏడాది గణనీయంగా 18 కోట్ల పనిదినాలకు తగ్గించారు. అంటే 25 శాతం లేబర్ బడ్జెట్ తగ్గించినట్లయింది. అందుకు అనుగుణంగా 25 శాతం మెటీరియల్ నిధుల కేటాయింపులు తగ్గే పరిస్థితులు ఏర్పడ్డాయి.

మెటీరియల్ పనులూ తగ్గుముఖం

ఉపాధి హామీ పథకంలో కూలీలు పనులు చేయడం ద్వారా ఖర్చు చేసే మొత్తానికి అనుగుణంగా కేంద్రం మెటీరియల్ నిధులను రాష్ట్రాలకు మంజూరు చేస్తుంది. లేబర్ బడ్జెట్, మెటీరియల్ నిధులను 60:40 నిష్పత్తిలో కేటాయిస్తుంది. దీంతో 25 కోట్ల మేర పనిదినాలను ప్రతి ఏటా వినియోగిస్తున్న క్రమంలో రాష్ట్రానికి ఏటా రూ.3 వేల నుంచి రూ.4 వేల కోట్ల దాకా మెటీరియల్ నిధులు అందేవి. దీంతో రాష్ట్రంలో ఉపాధి పథకం ద్వారా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, రైతులకు ఉద్యానవన పంటలు, మొక్కల పెంపకం, గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణాలు, మినీ గోకులాలు తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. లేబర్ బడ్జెట్ కేటాయింపు తగ్గుదలకు అనుగుణంగా మెటీరియల్ నిధులూ తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. దీంతో ఈ పథకం ద్వారా పనులను కొంత మేర తగ్గించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

అదనపు పనిదినాలు కేటాయిస్తారా?

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా లేబర్ బడ్జెట్ కేటాయించే క్రమంలో మొదట తక్కువగా ఇస్తారని, ఆ తర్వాత డిమాండ్ మేరకు అదనంగా కేటాయిస్తారని అధికారులు చెప్తున్నారు. గతంలోనూ ఇదేవిధంగా జరిగిందంటున్నారు. రాష్ట్రంలో శ్రామికుల పనిదినాల డిమాండ్ మేరకు అదనపు పనిదినాలు కూడా కల్పిస్తారని ఆశిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, అదనపు పనిదినాలు సాధిస్తామని చెప్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.